
'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00

సంపుటి: 16 | సంచిక: 150

ఆదివారం 20-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 20-8-2023
II

వైరల్





దేశాలు వేరైనా డ్యాన్స్ నీదేనయా!

• టాంజానియాలో కంటెంట్ క్రియేటర్ కిలీపాల్ తన సోదరి నీమ్‌పాల్‌తో కలిసి చేసిన డాన్స్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. రణ్‌వీర్ సింగ్, ఆలియా భట్ 'రాకీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ' సినిమాలోని 'ఝుమ్కా' పాటకు కిలీపాల్, నీమ్‌పాల్‌లు స్టెప్పులు వేశారు. తమ సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన ఈ డ్యాన్స్ వీడియో 1.4 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

• ఏ దేశమేగినా గానం నుంచి నృత్యం వరకు ఏదో ఒక రూపంలో దేశం మనతో ఉంటుంది. తాజాగా ఐకానిక్ వాషింగ్టన్ మాన్యుమెంట్ (యూఎస్) బ్యాక్‌గ్రౌండ్‌గా స్వాతి జయశంకర్ భరతనాట్యం చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో లక్షలాది వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'బ్యూటిఫుల్ బ్యాక్‌గ్రౌండ్ బ్యూటిఫుల్ డ్యాన్స్' అంటూ కామెంట్ సెక్షన్ ప్రశంసలతో నిండిపోయింది.

మణికేరళం

ఎక్కడి కేరళ? ఎక్కడి మణిపుర్? అయితే మానవత్వానికి భౌగోళిక సరిహద్దులతో పని లేదు అని నిరూపించే విషయం ఇది. కేరళ కోచిలోని ఆర్‌సీపీ రెస్టారెంట్‌లో మణిపుర్‌కు చెందిన సుస్మిత పనిచేస్తుంది. సర్వీస్ స్టాఫ్‌లో ఒకరైన సుస్మిత ఎప్పుడూ చురుగ్గా ఉంటుంది. మూడుసార్లు 'బెస్ట్ ఎంప్లాయీ'గా అవార్డ్ కూడా అందుకుంది. అలాంటిది... ఓ రోజున సుస్మిత డల్‌గా ఉండడం చూసి 'ఏమైంది?' అని అడిగాడు జనరల్ మేనేజర్.

తన రాష్ట్రం మణిపుర్‌లో జరుగుతున్న అల్లర్లు, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తల్లి, సోదరి గురించి ప్రస్తావిస్తూ 'వారికేమైనా అవుతుందేమో' అంటూ భయపడింది.

విషయం తెలిసిన చెఫ్ పిళ్లై, అతని టీమ్ మణిపుర్ నుంచి ఆమె తల్లి, సోదరిలను రప్పించి కోచిలో బస ఏర్పాటు చేశారు. సుస్మిత తల్లి ఇబెంచదేవి, సోదరి సర్నిదేవిలకు 'ఆర్‌సీపీ కోచి కిచెన్'లో ఉపాధి కల్పించారు. ఈ స్టోరీ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయింది.



సార్... దిస్ అబ్బాయి బీట్ మీ... బట్ ఐయామ్ నాట్ తిరిగి బీట్!

అస్సాంలోని పచిమ్ నగామ్ గ్రామంలోని 'న్యూ లైఫ్ హైస్కూల్'లో పిల్లలు ఇంగ్లిష్‌లో మాత్రమే మాట్లాడాలనే నిబంధన ఉంది. ఒక రోజు ఇద్దరు పిల్లలు గొడవ పడ్డారు. క్లాస్ టీచర్ వారిని పిలిపించి 'టెల్ మీ, వాట్ హ్యాపెన్డ్?' అని అడిగారు. 'ఇతడు నా మెడ పట్టుకున్నాడు' అని ఒకరు చెప్పాలనుకున్నారు. 'ఇతడు నా తలపై పంచ్ ఇచ్చాడు' అని మరొకరు చెప్పాలనుకున్నారు. అట్టి విషయాన్ని పూర్తిగా ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో చెప్పలేక సైన్ లాంగ్వేజ్‌ను కూడా అప్పు తెచ్చుకొని కాస్తో కూస్తో ఇంగ్లిష్‌లో ఆ పిల్లలు చెబుతున్న మాటలు నెటిజనులను నవ్వుల్లో ముంచెత్తాయి.



పకోడీలు, బజ్జీలు తెలుసు.
కాని ఉల్లిపాయను తామరపువ్వులా ఒలిచి
శనగపిండిలో కలిపి నూనెలో వేయించి
ఉల్లి పుష్పంగా తయారు చేసి సర్వ్ చేస్తే
11 లక్షల వ్యూస్ లొట్టలేశాయి.
వదోదర స్ట్రీట్‌ఫుడ్‌లో తాజా హల్‌చల్ ఇది.

వేడి వేడి ఉల్లి పుష్పము



స్ట్రీట్‌ఫుడ్ ఎంత నోరూరించేదిగా ఉన్నా శుభ్రత పాటించరనే కంప్లయింట్‌తో కొందరు తినరు. కాని వడోదరలోని ఈ తాజా చిరుతిండి హల్‌చల్ చేయడమే కాక అందరి మన్ననా పొందింది. 'చేస్తే ఇంత శుభ్రంగా చేయాలి' అనే మెచ్చుకోలు అందుకుంది. వడోదర (గుజరాత్)లోని ఇద్దరు వ్యక్తులు ప్రత్యేకమైన స్టాల్ పెట్టి ఈ 'ఉల్లి పుష్పం' (ఉల్లి బజ్జీ) అమ్ముతున్నారు. ఇందుకు పెద్దసైజు ఉల్లిగడ్డలను వాడుతున్నారు. వాటిని పువ్వులా కట్ చేసే మిషన్‌ను తయారు చేయించుకున్నారు. శుభ్రంగా వొలిచిన ఉల్లిపాయను ఈ మిషన్ కింద పెడితే పువ్వులా రెక్కలు వచ్చేలా కట్ చేస్తుంది. దానిని శనగ పిండిలో ముంచి వేడి వేడి నూనెలో వేయిస్తే ఉల్లిపువ్వు ఆకారంలో బజ్జీలు తయారవుతున్నాయి. ఇవి చూడటానికి ఆకర్షణీయంగా ఉండటంతో జనం ఎగబడుతున్నారు. అంతే కాదు చేస్తున్న పద్ధతి శుభ్రంగా ఉండటంతో సంకోచం లేకుండా తింటున్నారు. ఒక వ్లోగర్ ఈ ఉల్లిపువ్వు బజ్జీ తయారీని వీడియో తీసి ఇన్‌స్టాలో పెడితే క్షణాల్లో 11 లక్షల వ్యూస్ వచ్చాయి. 'కొత్త కొత్త ఆలోచనలే వ్యాపారాన్ని నిలబెడతాయి' అంటున్నారు. అందరి దగ్గరా ఉల్లిపాయలు ఉంటాయి. అందరూ బజ్జీలు వేస్తారు. కాని 'ఉల్లిపువ్వు బజ్జీ' అనే ఐడియా వీరికే వచ్చింది. ఆ 'ఎక్స్' ఫ్యాక్టర్ ఉన్నవాళ్లనే విజయం వరిస్తుంది. కొత్తగా ఆలోచించండి... పెద్ద విజయం సాధించండి... అని ఈ ఉల్లిపువ్వు కరకరలాడుతూ సందేశం ఇస్తోంది. •

కనబడని చెయ్యేదో ఆడిస్తున్న ఆటబొమ్మలం... తోలుబొమ్మలం

'రంగ రంగ రంగస్థలానా... కనబడని చెయ్యేదో ఆడిస్తున్న ఆటబొమ్మలం అంటా...తోలు బొమ్మలం అంటా' అంటూ 'రంగస్థలం'లో తాత్వికంగా పాడతాడు రామ్‌చరణ్. ఈ పాట సంగతి ఎలా ఉన్నా 'బొమ్మలు మన కుటుంబ సభ్యులు' అంటున్నాడు ఆలిఫ్. కోల్‌కతాకు చెందిన వ్లోగర్ ఆలిఫ్ బొమ్మలు తయారుచేసే కార్మికుల వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

లిక్విడ్ ప్లాస్టిక్‌ను వివిధ రకాల బొమ్మల మూసలలో పోయడం నుంచి బొమ్మల తలలకు ప్లాస్టిక్ వెంట్రుకలు అతికించడం వరకు రకరకాల దశలు ఈ వీడియోలో కనిపిస్తాయి.



'లైఫ్ ఇన్ ప్లాస్టిక్ నాట్ ఫంటాస్టిక్' అంటూ ఒక యూజర్ స్పందించాడు.

'అందమైన బొమ్మల వెనుక ఇంత కష్టం ఉంటుందా!' అని చెప్పేలా ఉన్న ఈ వీడియో వైరల్ అయింది.

జయహే!




గ్రామీ అవార్డ్ విజేత రికీ కేజ్ లండన్‌లోని ప్రసిద్ధ అబేరోడ్ స్టూడియోస్‌లో మన జాతీయ గీతానికి సంబంధించి 100 మందితో లార్జెస్ట్ ఆర్కెస్ట్రాను నిర్వహించి రికార్డ్ సృష్టించాడు. ఈ వీడియోకు నెటిజనులు ఫిదా అవుతున్నారు. 'చారిత్రాత్మకమైన 100 పీస్ బ్రిటిష్ ఆర్కెస్ట్రాను నిర్వహించినందుకు మ్యూజిక్ కంపోజర్‌గా గర్విస్తున్నాను. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఈ వీడియోను ఎంతోమందికి షేర్ చేశాను. యూజ్ ఇట్, షేర్ ఇట్, వాచ్ ఇట్... బట్ విత్ రెస్పెక్ట్' అంటూ ట్విట్టర్‌లో రాశాడు రికీ కేజ్. 'వండర్‌ఫుల్' అంటూ ఈ వీడియోను రీషేర్ చేశారు ప్రధాని మోదీ.



75 కాదు 25!

సాధారణంగా 75 సంవత్సరాల వయసులో కొద్దిదూరం నడిచినా ఆయాసపడుతుంటారు. అస్సాంలోని దిబ్రూఘర్‌కు చెందిన 75 సంవత్సరాల హీర బోరా అలా కాదు. ఆరోగ్యకరమైన జీవనశైలి విషయంలో యువతను చైతన్యవంతం చేయడానికి త్రివర్ణ పతాకం చేతబూని పదికిలోమీటర్లు పాదయాత్ర చేసింది. ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. 'ఆమె వయసు 75 నుంచి 25కు వచ్చింది' అంటూ నెటిజనులు స్పందించారు.

హెల్త్



దేహంలోని రక్తనాళాలు కొన్ని చోట్ల బలహీనంగా ఉండవచ్చు. మెదడులో అలా జరిగినప్పుడు బలహీనమైన చోట రక్తనాళం ఉబ్బి... ఒక్కోసారి ఆ ఉబ్బిన రక్తనాళంలోని లోపలి పొర మీద ఒత్తిడి పెరిగిపోయి, అది మరింత పలచబారి అకస్మాత్తుగా చిట్లిపోవచ్చు. ఈ పరిణామం మెదడులో జరిగితే అక్కడ జరిగే రక్తస్రావంతో మరిన్ని దుష్పరిణామాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ప్రాణాంతకమూ కావచ్చు. ఇలా మెదడులోని రక్తనాళాల్లో బలహీనమైన చోట రక్తం పేరుకుని, అది బుడగలా మారడాన్ని 'అన్యురిజమ్స్' అంటారు. అప్పటివరకూ అంతా బాగున్నట్టే అనిపిస్తూ... అకస్మాత్తుగా ప్రమాదాన్ని తెచ్చిపెట్టే ఈ కండిషన్‌పై అవగాహన కోసం ఈ కథనం.

అన్యురిజమ్స్ నుంచి రక్షణ సాధ్యమే!

మెదడు చుట్టూరా ఆవరించుకుని ఉండే స్థలాన్ని సబర్కనాయిడ్ ప్రాంతంగా చెబుతారు. అన్యురిజమ్ కేసుల్లో దాదాపు 90 శాతం మందిలో ఆ ప్రాంతంలో రక్తస్రావం అవుతుంది కాబట్టి దాన్ని 'సబర్కనాయిడ్ హేమరేజ్' (ఎస్ఏహెచ్) అంటారు. రక్తనాళాలు చిట్లిన ప్రతి ఏడుగురిలోనూ నలుగురిలో ఏదో ఒకరకమైన వైకల్యం చోటు చేసుకునే అవకాశం ఉంది. రక్తస్రావం కాగానే పక్షవాతం (స్ట్రోక్), కోమాలోకి వెళ్లే అవకాశాలెక్కువ.

అన్యురిజమ్స్ ఉన్న చాలామందిలో మెదడులో రక్తనాళాలు బలహీనంగా ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు వారి జీవితకాలంలో అవి చిట్లకపోవచ్చు. కొందరిలో ఉబ్బు చాలా చిన్నగా ఉండవచ్చు. కానీ మరికొందరిలో ఇది ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని 'జెయింట్ అన్యురిజమ్స్' అంటారు. ఇలాంటివి అకస్మాత్తుగా చిట్లే అవకాశాలుంటాయి. దాంతో బాధితుల్లో అకస్మాత్తుగా పక్షవాతం కనిపించవచ్చు. హార్ట్ ఎటాక్స్‌లోలాగే 'సబర్కనాయిడ్ హ్యామరేజ్' అకస్మాత్తుగా సంభవిస్తుంది.

కారణాలు

• పొగాకు వాడకం, అనియంత్రితమైన రక్తపోటు, డయాబెటిస్ వంటివి • రక్తానికి వచ్చే ఇన్ఫెక్షన్ కారణంగా కలిగే దుష్పరిణామాలు (కాంప్లికేషన్స్) • చాలావరకు పుట్టుకతో వచ్చే (కంజెనిటల్), అలాగే జన్యుపరమైన కారణాలు. ఫ్యామిలీ హిస్టరీలో ఈ సమస్య ఉన్నప్పుడు ముప్పు ఎక్కువ • క్రమబద్ధంగా / ఆరోగ్యకరంగా లేని జీవనశైలి • ఏదైనా ప్రమాదం కారణంగా రక్తనాళాలు గాయపడటం. • కొన్ని అరుదైన కేసుల్లో... ఫైబ్రోమస్క్యులార్ డిస్‌ప్లేసియా వంటి కండరాల జబ్బు, మూత్రపిండాల్లో నీటితిత్తుల్లా ఉండే పాలిసిస్టిక్ కిడ్నీ డిసీజ్... అన్యురిజమ్‌కు దారితీసే అంశాలు.

చిట్లినప్పుడు కనిపించే లక్షణాలు



• జీవితంలో ఎప్పుడూ రానంత అత్యంత బాధతో కూడిన తలనొప్పి
• స్పృహ కోల్పోవడం
• పక్షవాతం / ఫిట్స్ కూడా
• మాట్లాడలేకపోవడం, మూతి వంకరపోవడం

ముందే తెలిస్తే ముప్పు నివారణకు అవకాశం...

అన్యురిజమ్స్ ప్రాణాంతకమే అయినా ముందే తెలిస్తే బాధితుల్ని రక్షించుకునేందుకు అవకాశాలు పెరుగుతాయి. మెదడు సీటీ స్కాన్, మెదడు ఎమ్మారై పరీక్షల ద్వారా తలలోని రక్తనాళాలను పరిశీలించినప్పుడు ఈ సమస్య బయటపడే అవకాశం ఉంది. అందుకే ఫ్యామిలీ హిస్టరీలో ఈ ముప్పు ఉన్నవారు సీటీ, ఎమ్మారై పరీక్షలు చేయించడం ఒకరకంగా నివారణ చర్యలాంటిదే అనుకోవచ్చు. ఈ పరీక్షల్లో సెరిబ్రల్ అన్యురిజమ్స్ ఎక్కువగా ఉన్నట్లు తేలితే... గుండెకు చేసినట్టే మెదడుకూ యాంజియోగ్రామ్ చేస్తారు. 'సెరిబ్రల్ యాంజియో' అనే ఈ పరీక్షతో అన్యురిజమ్స్‌ను ముందుగానే నిర్ధారణ చేయడం ద్వారా ప్రాణాపాయ ప్రమాదాల్ని చాలావరకు నివారించవచ్చు.

గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో పూడిక చేరడం వల్ల అడ్డంకులతో గుండెపోటు వస్తే... అప్పటికే అన్యురిజమ్స్‌కు గురైన రక్తనాళాలు చిట్లడం వల్ల సబర్కనాయిడ్ హ్యామరేజ్ వస్తుంది.

చికిత్సా ప్రత్యామ్నాయాలు


• శస్త్రచికిత్స కాకుండా మందులిస్తూ చేసే చికిత్స (నాన్ సర్జికల్ మెడికల్ థెరపీ) • శస్త్రచికిత్స లేదా క్లిప్పింగ్ • ఎండోవాస్క్యులార్ థెరపీ లేదా కాయిలింగ్ (అడ్జంక్టివ్ డివైస్ లేకుండా చేసే చికిత్స / వీలునుబట్టి డివైస్ వాడటం). వీటి గురించి వివరంగా...

మెడికల్ థెరపీ: రక్తనాళాలు చిట్లకముందు చేసే చికిత్స ఇది. రక్తపోటును అదుపులో ఉంచేందుకు మందులిస్తూ, కొని ఆహారాలు, వ్యాయామాలు సూచిస్తారు. అన్యురిజమ్స్ సైజు తెలుసుకోడానికి నిర్ణీత వ్యవధుల్లో తరచూ ఎమ్మారై / సీటీ స్కాన్/యాంజియోగ్రఫీ) చేయించడం అవసరం.

శస్త్రచికిత్స / క్లిప్పింగ్: పుర్రె తెరవడం ద్వారా చేసే శస్త్రచికిత్స (క్రేనియాటమీ) ద్వారా ఉబ్బిన రక్తనాళాల్ని నేరుగా పరిశీలిస్తూ, పరిస్థితిని అంచనా వేస్తారు. అన్యురిజమ్‌లను గుర్తించి, శస్త్రచికిత్సతో వాటిని జాగ్రత్తగా వేరుచేస్తారు. ఉబ్బిన చోట క్లిప్పింగ్ జరిపాక మళ్లీ మునుపటిలా రక్తప్రసరణ జరిగేలా జాగ్రత్త తీసుకుంటారు.

ఎండోవాస్క్యులార్ కాయిలింగ్: తొడ ప్రాంతంలోని రక్తనాళం నుంచి ఒక పైప్ (క్యాథెటర్)ను ప్రవేశపెట్టి... అందులోంచి మరింత చిన్న పైప్‌లతో మెదడులోని అన్యురిజమ్స్‌కు చేరి, అక్కడ రక్తనాళాన్ని చుట్టలుచుట్టలుగా చుట్టుకుపోయేలా చేస్తారు. దాంతో ఉబ్బిన ప్రాంతానికి రక్తసరఫరా ఆగుతుంది. ఫలితంగా చిట్లడం నివారితమవుతుంది. ప్రస్తుతం ఉన్నవాటిల్లో దీన్ని మేలైన చికిత్సగా పరిగణిస్తున్నారు. ఇందులోనే బెలూన్ కాయిలింగ్ అనే ప్రక్రియలో అన్యురిజమ్ ఉన్న ప్రాంతానికి దగ్గర్లో బెలూన్ లాంటి దాన్ని ఉబ్బేలా చేసి, అటు తర్వాత కాయిలింగ్ చేస్తారు. ఇలా పెద్ద రక్తనాళాల దగ్గరున్న ఉబ్బును చిట్లకుండా రక్షిస్తారు. ఇవిగాక... దాదాపు ఏడేళ్ల నుంచి రక్తప్రవాహపు దిశ మళ్లించడానికి 'ఫ్లో డైవర్టర్ స్టెంట్స్' ఉపయోగిస్తున్నారు. వీటితో అన్యురిజమ్‌లోని రక్తపు దిశను మళ్లించి క్రమంగా ఉబ్బు తగ్గిపోయేలా చేస్తారు.

బాధితుల పరిస్థితిని బట్టి చికిత్సా ప్రత్యామ్నాయాలను డాక్టర్లు ఎంచుకుంటారు.



డాక్టర్ పవన్ కుమార్ పెళ్లూరు
కన్సల్టెంట్ న్యూరో సర్జన్

మీనియర్స్ డిసీజ్ అంటే..!

మన లోపలి చెవి (ఇన్నర్ ఇయర్) వినికిడి సామర్థ్యానికీ, నిటారుగా ఉండేందుకు దోహదం చేస్తుంది. ఇక్కడ సమస్య వస్తే వినికిడి శక్తి తగ్గడంతో పాటు, నిటారుగా నిలబడి ఉండే సామర్థ్యం కూడా తగ్గిపోయి ఒళ్లంతా గిర్రున తిరుగుతూ, తూలి కిందికి పడిపోతామేమోనన్న ఫీలింగ్ కలుగుతుంది. అంతేకాదు... ఏదో ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర నిలబడినప్పుడు వినిపించే హోరు లాంటిది చెవిలోంచి వినబడుతుంటుంది. ఇలా వినికిడి తగ్గడం, తూలి కిందపడిపోయేలా బ్యాలెన్స్ కోల్పోవడం, చెవిలోంచి హోరు వినిపించడం వంటి లక్షణాలతో వ్యక్తమయ్యే మీనియర్స్ డిసీజ్‌పై అవగాహన కోసం ఈ కథనం.

మీనియర్స్ డిసీజ్‌ను 'ఇడియోపథిక్ ఎండోలింఫాటిక్ హైడ్రాప్స్' అని కూడా అంటారు. అది ప్రాణాంతకం కాదుగానీ... చికిత్స అందకపోతే క్రమంగా వినికిడి శక్తి కోల్పోయే అవకాశమూ ఉంది. గతంలో కాస్త అరుదుగా కనిపించే ఈ సమస్య... ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తుండటం వైద్యవర్గాల్లో ఆందోళనను కలిగిస్తోంది.

• **వర్టిగో లక్షణాలు:** పిల్లలు గిరగిరా తిరిగీ, తిరిగీ అకస్మాత్తుగా ఆగినప్పుడు బ్యాలెన్స్ కోల్పోయి తూలికింద పడిపోతామేమో అనిపించినట్లుగా లేదా రంగుల రాట్నంపై నుంచి విసిరివేసినట్లుగా అనుభూతి చెందుతూ ఆందోళన పడుతుంటారు. వర్టిగోలో కనిపించే ఇదే లక్షణం మీనియర్‌లోనూ కనిపిస్తుంది.

• **టిన్నైటస్ లక్షణాలు:** ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరి గుయ్ అనే శబ్దమే కొందరికి చెవుల్లోంచి వినిపిస్తూ, చికాకు కలిగిస్తుంది. టిన్నైటస్‌లోని ఇదే లక్షణం... మీనియర్స్ డిసీజ్‌లోనూ కనిపిస్తుంది.

లక్షణాలు
మీనియర్స్ డిసీజ్‌లో వర్టిగో, టిన్నైటస్, వినికిడిలోపం (డెఫ్‌నెస్) ఈ మూడు లక్షణాలూ కలగలసి ఉంటాయి.

• **వినికిడి తగ్గడం:** లక్షణాలను నిర్లక్ష్యం చేయడం, చికిత్స తీసుకోకపోవడం వల్ల శాశ్వతంగా వినికిడి కోల్పోయి... పర్మనెంట్ డెఫ్‌నెస్ వచ్చే అవకాశం ఉంది. వినికిడి లోపం అన్నది ఒక్కోసారి పెరుగుతూ ఒక్కోసారి తగ్గుతూ ఉంటుంది. కొన్నిసార్లు ఒకేరోజులోనే ఈ పెరగడం తగ్గడం జరుగుతూ ఉంటుంది. చెవి నిండిపోయినట్లుగా ఉండే ఫీలింగ్ చికాకు కలిగిస్తూ ఉంటుంది.

• **నిర్ధారణ పరీక్షలు:** • బాధితులు చెప్పే లక్షణాలతో • ఆడియాలజిస్టుల ఆధ్వర్యంలో వినికిడి సామర్థ్యం పరీక్షలు (ఆడియోమెట్రీ టెస్ట్) , వెస్టిబ్యులార్ టెస్ట్ బ్యాటరీ పరీక్షలతో పాటు డాక్టర్ల ఆధ్వర్యంలో మెదడు ఎమ్మారై, 'ఎలక్ట్రో కాక్లియోగ్రఫీ', 'ఎలక్ట్రో నిస్టాగ్మోగ్రఫీ' వంటి పరీక్షలు మీనియర్స్ డిసీజ్ నిర్ధారణకు తోడ్పడతాయి.



డాక్టర్ ఈ.సీ. వినయ కుమార్
సీనియర్ ఈఎన్‌టి సర్జన్



చికిత్స: • వికారం, వాంతుల వంటి లక్షణాలను తగ్గించేందుకు యాంటీ-నాసియా (యాంటీ-ఎమిటిక్) మెడిసిన్స్ ఇస్తారు • చెవిలోని ఒక రకం ద్రవం పెరగడం వల్ల మీనియర్స్ డిసీజ్ వచ్చే అవకాశం ఉన్నందున దేహంలోని ద్రవాలను బయటకు పంపించేందుకు మూత్రం ఎక్కువగా వచ్చే మందులైన 'డై-యూరెటిక్స్' అనే మందుల్ని వాడతారు • వర్టిగోలో కనిపించే కళ్లు తిరగడం, పడిపోవడం లాంటి లక్షణాలను తగ్గించేందుకు 'వెస్టిబ్యులార్ రీ-హ్యాబిలిటీషన్' అని పిలిచే ఫిజియోథెరపీ లాంటి చికిత్సలను అందిస్తారు. ఇందులో బాధితులతో కొన్ని రకాల వ్యాయామాలు చేయిస్తారు • వినికిడి సామర్థ్యం కోల్పోయిన వారిలో... వారు ఏ మేరకు కోల్పోయారో దాన్ని బట్టి హియరింగ్ ఎయిడ్ మెషిన్‌నూ అమర్చవచ్చు. • పై చికిత్సలేవీ పనిచేయనప్పుడు చాలా అరుదుగా కొందరిలో శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. ఇందులో 'ఎండోలింఫాటిక్ శాక్' అనే ప్రొసీజర్ ద్వారా చెవిలో అత్యధికంగా స్రవించే ద్రవాన్ని డ్రెయిన్ చేస్తారు • ఈ మధ్య అందుబాటులోకి వచ్చిన 'ఇంట్రాటింపానిక్ స్టెరాయిడ్ ఇంజెక్షన్స్' థెరపీ కూడా ఉపయోగపడుతుంది.

• **ఇతర పరీక్షలు:** మెదడులో గడ్డలు, కొన్ని రకాల మెదడు సమస్యలు ఉన్నప్పుడూ ఈ లక్షణాలే కనిపిస్తాయి కాబట్టి... 'మీనియర్స్ ప్రోటోకాల్' కూడా చేసి... సమస్య మెదడుకు సంబంధించింది కాదని రూల్ అవుట్ చేసుకుంటారు.

• **నివారణ / వ్యాధి ఉన్నవారికి చెప్పే జాగ్రత్తలు:** • మీనియర్స్ డిసీజ్ ఉన్నవారిలో కొన్ని రకాల ఆహార నియంత్రణలను సూచిస్తారు. ఇవి కొంతమేరకు నివారణకూ తోడ్పడతాయి • ఆహారంలో ఉప్పు తగ్గించడం • చాక్లెట్లు, కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ, కోలాడ్రింక్స్ వంటి పానీయాలను పరిమితంగా తీసుకోవడం • ఆల్కహాల్, పొగ అలవాట్లకు దూరంగా ఉండటం • చైనా సాల్ట్‌కు దూరంగా ఉండటం.

పెద్దపేగు క్యాన్సర్ నివారణకు... మెడిటిప్

మారిన ఆహారపు అలవాట్లతో గతంలో పాశ్చాత్య దేశాల్లోనే కనిపించిన పెద్దపేగు క్యాన్సర్ ఇప్పుడు మన దేశంలోనూ ఎక్కువగా కనిపిస్తోంది. చిన్న చిన్న జాగ్రత్తలతోనే దీన్ని నివారించవచ్చు. అవి... • కొవ్వులు తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకుంటూ... తాజా ఆకుకూరలను, పండ్లను అందులో భాగం చేయాలి • మాంసాహారాన్ని పరిమితంగా తీసుకోవడంతో పాటు అందులో కొవ్వు మోతాదులు తక్కువగా ఉండే చికెన్, చేపల వంటి వైట్ మీట్‌ను మాత్రమే తీసుకోవాలి. వేటమాంసం, రెడ్‌మీట్ నుంచి దూరంగా ఉండాలి • తేలిగ్గా విరేచనమయ్యేందుకు ఆహారంలో పీచు ఎక్కువగా ఉండే చిరుధాన్యాలూ, కాయధాన్యాలకు ప్రాధాన్యమివ్వాలి • మంచి ఆరోగ్యకరమైన విసర్జక అలవాట్లు కలిగి ఉండాలి. అంటే రోజూ ఒకేవేళకు మల విసర్జనకు వెళ్లడం, అజీర్తి, గ్యాస్ ట్రబుల్ లేకుండా చూసుకోవడం లాంటివి. మలవిసర్జన సాఫీగా జరగాలంటే దేహానికి మంచి కదలికలూ, తగినంత వ్యాయామం ఉండాలి • పొగ, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. ఈ సూచనలు కేవలం పెద్దపేగు (కోలన్) క్యాన్సర్‌ను మాత్రమేగాక అనేక ఇతర క్యాన్సర్లలతోపాటు మరెన్నో జబ్బులనూ నివారిస్తాయి.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 16 సంచిక: 150

SUNDAY Special

ఆదివారం 20-8-2023



వరల్డ్‌కప్ ఆర్చరీలో భారత్‌కు 2 స్వర్ణాలు

కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం సాధించిన ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ జ్యోతి సురేఖ. అంతర్జాతీయ కెరీర్‌లో 50వ పతకం సొంతం.

- వివరాలు 10లో




సంపద కరిగిపోతోంది

అగ్రరాజ్యం అమెరికా సహా ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ దేశాల్లో సంపద హరించుకుపోతూ ఉంటే భారత్‌లో సంపద పెరుగుతోంది.

- వివరాలు 6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్ ఒక ఆదర్శ ప్రయోగశాల

భారత్‌లో విజయవంతమైన పరిష్కారాలను ప్రపంచంలో ఎక్కడైనా సులభంగా అన్వయించవచ్చని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



లద్దాఖ్‌లో బైక్‌పై రాహుల్

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మొదటిసారిగా సరిహద్దులకు సమీపంలోని కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌కు వెళ్లారు.

- వివరాలు 6లో



తైవాన్ చుట్టూ చైనా విన్యాసాలు

డ్రాగన్ దేశం చైనా.. తైవాన్‌కు తీవ్ర హెచ్చరికలు పంపింది. ద్వీపం చుట్టూ శనివారం సైనిక విన్యాసాలకు దిగింది.

- వివరాలు 6లో



వాషింగ్టన్‌లో కార్చిచ్చు బీభత్సం

అమెరికా వాషింగ్టన్‌లోని స్పోకాన్ ప్రాంతంలో మొదలైన కార్చిచ్చు త్వరితగతిన వ్యాపిస్తోంది. ఇప్పటికే 3 వేల ఎకరాలను భస్మం చేసింది.

- వివరాలు 6లో

కమల 'దళం' రెడీ?

40-45 మందితో తొలి జాబితా.. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ప్రకటనకు ఏర్పాట్లు

- ఈ నెల 27న అమిత్ షా పర్యటన తర్వాత ప్రకటించే అవకాశం
- కిషన్‌రెడ్డి, సంజయ్, లక్ష్మణ్, ఈటల, అర్వింద్, రఘునందన్ తదితరులు తొలి జాబితాలోనే..
- ముఖ్యనేతలు, ఒకే అభ్యర్థి ఉన్న 20 సీట్లు, ఇద్దరు అభ్యర్థులున్న మరో 20కిపైగా సీట్లకు ఎంపిక
- ఇతర పార్టీల నుంచి వచ్చేవారి కోసం కొన్నిసీట్లు పెండింగ్‌లో..
- వచ్చే నెల రెండో వారానికల్లా మిగతా అభ్యర్థులపై స్పష్టత



అమిత్‌షా పర్యటన తర్వాత..




ఈ నెల 27న బీజేపీ అగ్రనేత అమిత్ షా రాష్ట్ర పర్యటన తర్వాత 40-45 మంది అభ్యర్థులతో తొలిజాబితా విడుదల చేస్తారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఎన్నికల కసరత్తు ఊపందుకోవడంలో భాగంగా.. సెప్టెంబర్ రెండో వారానికల్లా మరికొందరు అభ్యర్థులను ప్రకటిస్తారని అంటున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి చేరికలను బట్టి సెప్టెంబర్ చివరికల్లా అందరు అభ్యర్థులపై స్పష్టత వస్తుందని పేర్కొంటున్నాయి. పార్టీపరంగా, సంస్థాగతంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో బలహీనంగా ఉన్నందున (బలంగా ఉన్న సీట్లు మినహాయించి).. మిగతా 7 ఉమ్మడి జిల్లాలపై పార్టీనాయకత్వం దృష్టి కేంద్రకరించిందని వెల్లడిస్తున్నాయి.

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడటానికి ముందే మూడో వంతు మందికిపైగా అభ్యర్థులను ప్రకటించేందుకు బీజేపీ సిద్ధమైంది. ముఖ్యనేతలు, బలమైన ఒకే అభ్యర్థి ఉన్న 20 సీట్లతోపాటు ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులున్న మరో 20- 25 సీట్లకు టికెట్లు ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 27న ఖమ్మంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభ ఉన్న నేపథ్యంలో.. ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లో తొలి జాబితాను విడుదల చేయాలని బీజేపీ భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితోపాటు ముఖ్యనేతలు బండి సంజయ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, రఘునందన్‌రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వంటివారి పేర్లు తొలి జాబితాలో ఉండనున్నట్టు తెలిసింది. తర్వాత దశలవారీగా మిగతా అభ్యర్థులను ఖరారు చేయనున్నట్టు సమాచారం.

సర్దుబాటు కోసం కొన్ని సీట్లు..

రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిస్థితులు, మిగతా పార్టీలు కూడా అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు చేపట్టిన నేపథ్యంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో పరిణామాలను బీజేపీ జాగ్రత్తగా పరిశీలిస్తోంది. వివిధ నియోజకవర్గాల్లో ఆయా పార్టీల ముఖ్య నేతలు, గెలిచే, గణనీయంగా ప్రభావం చూపే వారు ఎవరెవరన్న విషయాన్ని ఆరా తీస్తోంది. అందులో గెలిచే అవకాశాలు ఉండీ టికెట్లు దక్కనివారిని బీజేపీలోకి చేర్చుకుని, బరిలోకి దింపే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ క్రమంలో పలుచోట్ల సర్దుబాటుకు వీలుగా టికెట్లను పెండింగ్‌లో పెట్టాలని బీజేపీ నేతలు ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఎవరైనా కీలక నేతలు చేరితే.. వారి కోసం

మిగతా 2వ పేజీలో ▶



అసమ్మతులకు 'చేరికల'తో చెక్!

సర్వేల ఆధారంగానే అభ్యర్థుల జాబితా ఖరారు

సిట్టింగ్‌లకు ప్రాధాన్యత ఇస్తూనే కలిసిరాని వారిపై వేటు

- అసమ్మతికి దిగితే.. విరుగుడుగా స్థానిక నేతల చేరికలపై ఫోకస్
- ఇప్పటికే నియోజకవర్గాల్లో ప్రభావం చూపగల విపక్ష నేతల గుర్తింపు
- ఇండిపెండెంట్లుగా పోటీచేసి గణనీయంగా ఓట్లు పొందినవారిపై దృష్టి
- సామాజిక సమీకరణాలు, స్థానికంగా పరపతి వంటివీ పరిగణనలోకి..
- ఈ క్రమంలోనే కౌశిక్ హరి, ఉప్పల వెంకటేశ్.. త్వరలో మరిన్ని చేరికలు
- ఈ ఆపరేషన్‌ను సమన్వయం చేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను దాదాపు సిద్ధం చేసిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు.. అదే సమయంలో సొంత పార్టీని చక్కదిద్దే చర్యలపైనా దృష్టి పెట్టారు. సిట్టింగ్‌లకు ప్రాధాన్యత ఇస్తూనే.. ప్రజల్లో, స్థానిక పార్టీ శ్రేణుల్లో వ్యతిరేకత, ఆరోపణలున్నవారిని పక్కనపెడుతున్నారు. ఆయా చోట్ల సర్వేలు, నిఘా నివేదికల ఆధారంగా గెలవగలిగిన వారిని ఎంపిక చేస్తున్నారు. ఈ క్రమంలో టికెట్ దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇతర ఆశావహుల నుంచి ఎదురయ్యే అసమ్మతికి చెక్ పెట్టేదిశగా పావులు కదుపుతున్నారు. ఆయా నేతలు పార్టీని వీడినా, అంతర్గతంగా సహకరించకపోయినా నెలకొనే నష్టాన్ని అంచనా వేస్తూ.. దానికి విరుగుడుగా ఇతర పార్టీల నుంచి నేతలను చేర్చుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రభావం చూపగల వారిని ఇప్పటికే గుర్తించినట్టు సమాచారం.

అసమ్మతి నేతలకే గెలుపు బాధ్యతలు

రాష్ట్రవ్యాప్తంగా 40కిపైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ టికెట్ కోసం గట్టిపోటీ ఉండగా.. అందులో కొన్నిచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలకు బదులు ఇతరులకు అవకాశం ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించారు. అభ్యర్థుల జాబితా విడుదల చేశాక టికెట్ దక్కని నేతల నుంచి ఎదురయ్యే ఒత్తిడిని అంచనా వేస్తున్నారు. పార్టీ నిర్ణయం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసే నేతల వివరాలను నిఘా సంస్థల ద్వారా సేకరిస్తున్నారు. టికెట్ ఆశించి, భంగపడిన నేతలను కూడా కలుపుకొనిపోవాలని భావిస్తున్న

మిగతా 2వ పేజీలో ▶

జనగామకు 'పల్లా' వద్దే వద్దు

- పల్లా గోబ్యాక్ అంటూ రోడ్డెక్కిన ముత్తిరెడ్డి, పోచంపల్లి వర్గీయులు
- ఇస్తే ముత్తిరెడ్డికి, లేకపోతే పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వాలంటూ డిమాండ్

2లో

న్యూస్‌రీల్

నేడు సూర్యాపేటకు సీఎం



ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం సూర్యాపేట జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన కలెక్టరేట్ కార్యాలయ సముదాయం, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, వెజ్, నాన్ వెజ్ మార్కెట్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనాలను ఆయన ప్రారంభించనున్నారు.

- వివరాలు 2లో▶

కాంట్రాక్టు ఏఎన్ఎంలకు 30 శాతం వెయిటేజీ



ఎన్‌హెచ్ఎం కింద ఎంపికైన ఏఎన్ఎం-2 (సెకండ్ ఏఎన్ఎం)లకు తాజాగా తలపెట్టిన నియామకాల ప్రక్రియలో 30 శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు చెప్పారు. ఇప్పటివరకు 20% ఇవ్వాలని సర్కారు భావించిందని, కానీ పరిస్థితులను బట్టి మరో 10% మార్కులను వెయిటేజీగా ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

- వివరాలు 14లో▶

26 నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ



ఈనెల 26 నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అదేరోజు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం చెరువులో మంత్రి ఉచిత చేప పిల్లల విడుదలను లాంఛనంగా ప్రారంభిస్తారు.

- వివరాలు 14లో▶

మెడికల్ సీట్ల కేటాయింపుపై నివేదిక ఇవ్వండి

23న సీల్డ్ కవర్‌లో సమర్పించండి

- కొత్త మెడికల్ కాలేజీల్లోని సాఫ్ట్‌వేర్‌ను సవరించండి
- మెడికల్ కాలేజీల్లో రిజర్వేషన్లపై హైకోర్టు విచారణ

14లో

ఇదండీ సంగతి



మీరు స్టీల్ ప్లాంట్ కోసం సిద్ధంగా ఉండాలట.. ఆయన ఆల్‌రెడీ సీఎం పోస్టుకి ఫిక్సయిపోయారట!

ఇప్పటిదాకా చూసింది ట్రైలరే..

త్వరలో ప్రతిపక్షాలకు అసలు సినిమా చూపిస్తాం

- ఇందిరాపార్క్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్
- మతాల మధ్య చిచ్చుపెట్టే దుర్మార్గులు, చిల్లర పార్టీల మోసాలకు గురికావొద్దు
- అదే జరిగితే హైదరాబాద్ నగరం మరో వందేళ్లు వెనక్కి పోతుందని వ్యాఖ్య





మంత్రులు కేటీఆర్, తలసాని సమక్షంలో హైదరాబాద్‌లో స్టీల్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్. చిత్రంలో మేయర్ విజయలక్ష్మి

సాక్షి, హైదరాబాద్/ ముషీరాబాద్: రాష్ట్రంలో ఇప్పటివరకు తాము చూపినది ట్రైలర్ మాత్రమేనని, త్వరలోనే ప్రతిపక్షాలకు అసలు సినిమా చూపిస్తామని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు వ్యాఖ్యానించారు. పచ్చగా ఉన్న హైదరాబాద్‌లో కులమతాల పేరిట చిచ్చు పెట్టాలనుకునే దుర్మార్గులు, చిల్లర పార్టీల ఆటకట్టించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు-వీఎస్టీ జంక్షన్ మధ్య దాదాపు రూ.450 కోట్ల వ్యయంతో

మిగతా 2వ పేజీలో ▶

'కృష్ణా'లో కరువు తీవ్రం!



నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాభావం

పశ్చిమ కనుమల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు ఉన్న అన్ని ప్రధాన జలాశయాలకు శనివారం నాటికి వరద ప్రవాహం దాదాపుగా ఆగిపోయింది.

వివరాలు 5లో

కిక్కెక్కించిన మద్యం దరఖాస్తులు



→ రానున్న రెండేళ్ల కాలానికి రాష్ట్రంలోని వైన్‌షాపులకు లైసెన్సుల మంజూరు కోసం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు అనూహ్య రీతిలో స్పందన కనిపించింది. రాష్ట్రంలోని 2,620 వైన్‌షాపుల కోసం 1,31,954 దరఖాస్తులు వచ్చాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.2,639 కోట్ల ఆదాయం కేవలం దరఖాస్తుల రూపంలోనే లభించింది. ఈ నెల 21న డ్రా తీసి లైసెన్సులు మంజూరు చేయనున్నారు. - 5లో

జగ్గారెడ్డి కాంగ్రెస్‌లో ఉండొద్దా?



→ తాను పార్టీ మారుతున్నానని ఏడాదిన్నరగా కొందరు పని గట్టుకుని ప్రచారం చేస్తున్నారని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి మండిపడ్డారు. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అబద్ధమని చెప్పారు. తనకు రాజకీయ శీల పరీక్షలు అవసరం లేదని.. తన రాజకీయ ప్రయాణం రాహుల్‌గాంధీతోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. - వివరాలు 3లో

ఇక డిక్లరేషన్లతో దూకుడు

ప్రజల్లోకి వెళ్లేందుకు రాష్ట్ర కాంగ్రెస్ సన్నద్ధం

- ఈనెల 26న చేవెళ్లకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే..
- అక్కడే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించనున్న కాంగ్రెస్
- 29న వరంగల్‌లో మైనార్టీ డిక్లరేషన్.. సెప్టెంబర్‌లో బీసీ డిక్లరేషన్
- 6-9 తేదీల మధ్య షాద్‌నగర్‌లో సభ.. రానున్న కర్ణాటక సీఎం
- ప్రియాంకాగాంధీ ఆధ్వర్యంలో మహిళా డిక్లరేషన్ ప్రకటన
- సెప్టెంబర్ 17న ఎన్నికల మేనిఫెస్టో విడుదల.. ఆ సభకు హాజరుకానున్న సోనియా
- రాహుల్‌నూ ఆహ్వానిస్తామన్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాణిక్ రావ్ ఠాక్రే, రేవంత్ రెడ్డి, మధుయాష్కీ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాష్ట్రంలోని అన్ని వర్గాలను ఆకట్టుకోవడమే ధ్యేయంగా డిక్లరేషన్లు ప్రకటించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమైంది. ఇప్పటికే రైతు, యూత్ డిక్లరేషన్లను ప్రకటించిన ఆ పార్టీ.. వచ్చే నెల రోజుల వ్యవధిలో మరిన్ని వర్గాలకు సంబంధించిన డిక్లరేషన్లను ప్రకటించాలని, ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. ఈనెల 26న చేవెళ్ల వేదికగా ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాలను సెప్టెంబర్ 17 నాటికి ముగిస్తామని, ఆ రోజున పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తామని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి.

ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్..

ఈ నెల 26న చేవెళ్లలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు ఈ సభలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించనుంది. దళిత వర్గానికే చెందిన మల్లికార్జున ఖర్గే

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

పంటనష్టంలో తెలంగాణది మూడోస్థానం

కేంద్ర హోంశాఖ పరిధిలోని విపత్తు నిర్వహణ విభాగం వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని విపత్తు నిర్వహణ విభాగం వెల్లడించింది. వరదలు, పిడుగుపాట్లు వంటి కారణాలతో 2,044 మంది మరణించినట్లు తెలిపింది. వరదలతో అత్యధికంగా హరియాణాలో 5,40,975 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా, హిమాచల్‌ప్రదేశ్‌లో 1,89,400 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు నివేదించింది. అత్యధికంగా పంటనష్టం జరిగిన రాష్ట్రాల్లో తెలంగాణ మూడోస్థానంలో ఉందని, మొత్తం 1,51,970 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొంది. తెలంగాణలో 18 మంది మరణించారని, ఇతరత్రా కారణాలతో మరొకరు మృతి చెందారని నివేదికలో వెల్లడించింది. ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు రెండు విపత్తు నిర్వహణ బృందాలను రాష్ట్రంలో సిద్ధంగా ఉంచినట్లు తెలిపింది.

ఏపీలో 22,537 ఎకరాల్లో పంట నష్టం

ఏపీలోని ఐదు జిల్లాల పరిధిలో భారీవర్షాలు, వరదల ప్రభావం ఉందని, వాటి కారణంగా మొత్తంగా 39 మంది మృతి చెందినట్లు విపత్తు నిర్వహణ విభాగం నివేదించింది. మొత్తం 22,537 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు తెలిపింది. విపత్తు నిర్వహణ కోసం రెండు బృందాలను ఏపీలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

మిషన్ అమృత్ సరోవర్ లక్ష్యంలో వెనుకబడ్డ రాష్ట్రం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సహా పలు రాష్ట్రాలు మిషన్ అమృత్ సరోవర్‌లో భాగంగా ప్రతి జిల్లాలో కనీసం 75 అమృత్ సరోవర్‌లను నిర్మించడం / పునరుజ్జీవింపజేసే లక్ష్యాన్ని సాధించడంలో వెనుకబడ్డాయి. తెలంగాణ, పశ్చిమబెంగాల్, పంజాబ్, కేరళ, తమిళనాడు, హరియాణా, బిహార్, రాజస్తాన్‌లోని కొన్ని జిల్లాలు లక్ష్యాన్ని ఇంకా చేరుకోలేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థిరమైన నీటి వనరులను అభివృద్ధి చేసే లక్ష్యంతో గతేడాది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిషన్ అమృత్ సరోవర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

దివ్యాంగ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఈసీ డిప్యూటీ కమిషనర్ మనోజ్ సాహు



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగులను ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు వారు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ మనోజ్ సాహు సూచించారు. దివ్యాంగ ఓటర్ల పట్ల సానుభూతి, సున్నితత్వంతో వ్యవహరించాలని, ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. శాసనసభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మనోజ్ సాహు నేతృత్వంలోని కేంద్ర ఎన్నికల సంఘం బృందం రెండో రోజు శనివారం జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై చర్చించింది. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అర్హులైన ఓటర్లను ఎవరినీ తొలగించరాదని ఈ సమావేశంలో సాహు స్పష్టంచేశారు. ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగం పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. స్థానిక ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా జిల్లాల్లో వినూత్నంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, స్థానిక ఇన్‌ఫ్లూయెన్సర్లతో ఓటర్లలో చైతన్యం పెంచడానికి విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం స్వీప్ డైరెక్టర్ సంతోష్ అజ్మీర తెలిపారు. సమావేశంలో జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, స్వీప్ స్టేట్ నోడల్ అధికారి భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మతం మారిన హిందువులందరినీ స్వధర్మంలోకి ఆహ్వానిస్తున్నాం

విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మతం మారిన హిందువులందరినీ స్వధర్మంలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. సృష్టిలో హిందుత్వం అతి పురాతనమైనదని..అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. శనివారం భాగ్యనగరంలోని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రకరకాల ప్రలోభాలు..అనేక కారణాలు..మాయ మాటలు.. రాజకీయ ఒత్తిళ్ల వల్ల హిందూ ధర్మం నుంచి ఇతర మతాలను ఆశ్రయించిన హిందువులందరినీ 'ఘర్ వాపసి 'ద్వారా హిందూ ధర్మంలోకి తీసుకువస్తామన్నారు. వైద్యం, పేదరికంతో పాటు హిందువుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని క్రైస్తవులు, ముస్లింలు మతమార్పిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

నేడు సూర్యాపేటకు సీఎం కేసీఆర్


కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, మార్కెట్, బీఆర్ఎస్ కార్యాలయ భవనాలు ప్రారంభం

ఆ తర్వాత బహిరంగ సభలో ప్రసంగించనున్న సీఎం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం జిల్లా కేంద్రం సూర్యాపేటలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలో నిర్మించిన కలెక్టరేట్ కార్యాలయ సముదాయం, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, వెజ్, నాన్ వెజ్ మార్కెట్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనాలను ఆయన ప్రారంభిస్తారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను జిల్లాకు తీసుకొచ్చినందున ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతూ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారు. ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న మొదటి సభ కావడంతో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో 100 ఎకరాల్లో పెద్ద ఎత్తున సభకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11:15 గంటలకు సీఎం కేసీఆర్ సూర్యాపేట పట్టణ కేంద్రానికి చేరుకొని, సాయంత్రం 4:50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

జాతీయ రహదారిపై నేడు వాహనాల మళ్లింపు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ బహిరంగసభ నేపథ్యంలో వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను నార్కట్‌పల్లి వద్ద నల్లగొండ వైపు మళ్లిస్తారు. ఖమ్మం వెళ్లే వాహనాలను టేకుమట్ల నుంచి ఖమ్మం రహదారి మీదుగా మళ్లించనున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ మీదుగా నార్కట్‌పల్లి వైపు మళ్లిస్తారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన కలెక్టరేట్ కార్యాలయ సముదాయం

కమల 'దళం' రెడీ?

▶ మొదటి పేజీ తరువాయి

ముందుగా ఎంపిక చేసిన సీట్లలో అభ్యర్థులను మార్చి సర్దుబాటు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

ఓటింగ్ శాతం పెరుగుదలపై ధీమా

బీజేపీ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒక సీటు గెలుపొంది 7 శాతం ఓట్లను సాధించింది. అదే 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఓట్లశాతం ఏకంగా 23.5 శాతానికి పెరగడంతోపాటు నాలుగు ఎంపీ సీట్లు గెలిచింది. తర్వాత దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలుపు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు దక్కించుకోవడంతో ఊపు వచ్చింది. ప్రస్తుతం కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి ప్రజల్లో మరింత ఆదరణ పెరిగిందని, మూడోసారి ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని బీజేపీ ధీమాతో ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలోనూ ఓటింగ్ శాతం పెరుగుతుందని, గణనీయంగా ఎమ్మెల్యే సీట్లు సాధిస్తామని బీజేపీ జాతీయ, రాష్ట్ర ముఖ్యనేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులందరినీ కూడా శాసన సభ ఎన్నికల బరిలో దింపుతున్నట్టు చెప్తున్నారు.

బీజేపీ తరఫున అసెంబ్లీ బరిలో ఉండే అవకాశమున్న నేతలు వీరే

పార్టీలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బీజేపీ తరఫున 20 స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులపై దాదాపు స్పష్టత వచ్చింది. మరో 25 వరకు నియోజకవర్గాల్లో ఇద్దరు, పలుచోట్ల ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో గెలిచే అవకాశం ఎక్కువగా ఉన్న నేతలను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మిగతా చోట్ల అభ్యర్థులపై కసరత్తు కొనసాగుతోంది.

నియోజకవర్గం	అభ్యర్థి
అంబర్‌పేట	జి.కిషన్‌రెడ్డి/ఆయన భార్య కావ్యారెడ్డి
దుబ్బాక	ఎం.రఘునందన్‌రావు
కరీంనగర్	బండి సంజయ్
ఆర్మూర్	ధర్మపురి అర్వింద్
బోథ్	సోయం బాపురావు
రామగుండం	సోమారపు సత్యనారాయణ
నిర్మల్	ఎ.మహేశ్వర్‌రెడ్డి
చెన్నూరు	వివేక్ వెంకటస్వామి
మునుగోడు	కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
మెదక్	విజయశాంతి
తాండూరు / రాజేంద్రనగర్	కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
ఖమ్మం	పొంగులేటి సుధాకర్‌రెడ్డి
గద్వాల	డీకే అరుణ/ ఆమె కుమార్తె
సూర్యాపేట	సంకినేని వెంకటేశ్వర్‌రావు
కల్వకుర్తి	టి.ఆచారి
ఆందోల్	బాబూమోహన్
మహబూబ్‌నగర్	ఏపీ జితేందర్‌రెడ్డి / (లేదా ఆయన కుమారుడు మిథున్‌రెడ్డికి షాద్‌నగర్)
ముషీరాబాద్	బండారు విజయలక్ష్మి / భరత్‌గౌడ్
హుజూరాబాద్	ఈటల రాజేందర్ / ఆయన భార్య జమున
గజ్వేల్	ఈటల రాజేందర్ / మరో అభ్యర్థి
కోరుట్ల	ధర్మపురి అర్వింద్ / జేఎన్ వెంకట్
గోషామహల్	టి.రాజాసింగ్ / ఎం.విక్రమ్‌గౌడ్
పటాన్‌చెరు	నందీశ్వర్‌గౌడ్ / గోదావరి అంజిరెడ్డి
ఖానాపూర్	రమేశ్ రాథోడ్ / మరో అభ్యర్థి
ఇబ్రహీంపట్నం	బూర నర్సయ్యగౌడ్ / టి.వీరేందర్‌గౌడ్
భువనగిరి	గూడూరు నారాయణరెడ్డి / శ్యాంసుందర్‌రావు
ముథోల్	రామారావు పాటిల్ / మోహన్‌రావు పాటిల్
నిజామాబాద్ అర్బన్	యెండల లక్ష్మీనారాయణ / ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
మల్కాజిగిరి	ఆకుల రాజేందర్ / ఎన్.రామచందర్‌రావు
ఉప్పల్	ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ / టి.వీరేందర్‌గౌడ్
కుత్బుల్లాపూర్	కూన శ్రీశైలంగౌడ్ / డాక్టర్ ఎస్.మల్లారెడ్డి
మక్తల్	జలంధర్‌రెడ్డి / కొండయ్య
శేరిలింగంపల్లి	గజ్జల యోగానంద్ / రవికుమార్‌యాదవ్
కూకట్‌పల్లి	వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు / మాధవరం కాంతారావు
ఎల్‌బీనగర్	సామ రంగారెడ్డి / వంగా మధుసూదన్‌రెడ్డి
మహేశ్వరం	అందెల శ్రీరాములుయాదవ్ / ఆకుల శ్రీవాణి
సనత్‌నగర్	మర్రిశశిధర్‌రెడ్డి / ఆకుల విజయ
కొత్తగూడెం	కేవీ రంగాకిరణ్ / కోనేరు చిన్ని
జనగామ	బేజాడి బీరప్ప / దశమంతరెడ్డి
పాలకుర్తి	లేగ రామ్మోహన్‌రెడ్డి / ఎడ్ల సతీశ్‌కుమార్ (జర్నలిస్ట్)
వరంగల్ పశ్చిమ / హనుమకొండ	ఎం.ధర్మారావు / రావుపద్మ / రాకేశ్‌రెడ్డి / రావుల కిషన్
ఖైరతాబాద్	చింతల రామచంద్రారెడ్డి / ఇంద్రసేన్‌రెడ్డి (జస్టిస్ సుభాషణ్‌రెడ్డి కుమారుడు)
సికింద్రాబాద్	జయసుధ / బండ కార్తీకరెడ్డి

క్షేత్రస్థాయిలో బీజేపీ బలాబలాలపై ఆరా

- నియోజకవర్గాలకు తరలివెళ్లిన 119 మంది బీజేపీ ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలు
- వర్క్‌షాపులో పాల్గొన్న ప్రకాశ్ జవదేకర్, కిషన్‌రెడ్డి



వర్క్ షాప్ ప్రారంభోత్సవంలో ప్రకాశ్ జవదేకర్, కిషన్‌రెడ్డి, మురళీధర్‌రావు, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత సారంగి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితులపై ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన 119 బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆరా తీయనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నాయకత్వం అప్పగించిన బాధ్యతల్లో నిమగ్నమవుతారు. వారంతా తమకు కేటాయించిన నియోజకవర్గాలకు శనివారంరాత్రి బయలుదేరివెళ్లారు. 'ఎమ్మెల్యే ప్రవాస్ యోజన'లో భాగంగా తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశం, రాష్ట్రం సాధించిన ప్రగతి, రాష్ట్రానికి, వివిధవర్గాలకు చేకూరినప్రయోజనాలు, కేంద్ర పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీస్తారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై ప్రజల నుంచి సమాచారం సేకరించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని అన్ని స్థాయిల పార్టీ నేతలు, కార్యకర్తలను కలుసుకుని అభిప్రాయాలు తెలుసుకుంటారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమాచారం, వివరాల ఆధారంగా జాతీయ నాయకత్వానికి నివేదికలు సమర్పించనున్నారు. శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, ఒడిశా, అస్సాం, పుదుచ్చేరిలకు చెందిన 119 ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వర్క్‌షాపు నిర్వహించి రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై రాష్ట్ర పార్టీ నాయకులు అవగాహన కల్పించారు. కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్ 119 ఎమ్మెల్యేలకు 18 పాయింట్ల ఆధారంగా చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి తమకు అందిన ఫీడ్‌బ్యాక్‌కు అనుగుణంగా ఈ నెల 28–31 తేదీల మధ్య నాయకత్వానికి నివేదికలు సమర్పిస్తామని ఎమ్మెల్యే వర్క్‌షాపు తెలంగాణ ఇన్‌చార్జి, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత సారంగి తెలిపారు. తెలంగాణలో బీజేపీ సొంతంగా పోరాడి అధికారంలోకి వస్తుందని, బీఆర్ఎస్‌తో పొత్తు లేదా అవగాహనకు ఆస్కారం లేదని ఆమె స్పష్టం చేశారు. వర్క్‌షాపులో పార్టీ నేతలు డీకే అరుణ, మురళీధర్‌రావు, అర్వింద్ మీనన్, నల్లు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ఇప్పటిదాకా చూసింది ట్రైలరే..



ఇందిరాపార్క్ - వీఎస్టీ జంక్షన్ మధ్య నిర్మించిన స్టీల్ వంతెన ఏరియల్ వ్యూ

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మించిన స్టీల్ ఫ్లైఓవర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించి మాట్లాడారు. ''55 ఏళ్ల అధికారం ఇచ్చినా ఏమీ చేయని దుర్మార్గులు.. ఇప్పుడు పదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్నా ఏమీ చేయని అసమర్థులు.. మళ్లీ వస్తున్నారు. మతం పేరిటో, కులం పేరిటో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధిలో ముందుకు పోతున్న మనకు కాళ్లలో కట్టెలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఏడాదిలో వారం పదిరోజులపాటు కర్ఫ్యూ ఉండేది. ఇప్పుడు మతాలు, కులాలకు అతీతంగా అంతా కలసిమెలసి ముందుకు పోతున్నాం, చిల్లరపార్టీలు, నాయకుల మాటలకు మోసపోతే హైదరాబాద్ మళ్లీ వందేళ్ల వెనక్కుపోతుంది..''అని కేటీఆర్ పేర్కొన్నారు. మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించి, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంని చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారం

ఒకప్పుడు అందరం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో సినిమాలు చూసిన వాళ్లమేనని.. ఇక్కడ ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందిపడిన వారమేనని కేటీఆర్ చెప్పారు. ఈ స్టీల్ ఫ్లైఓవర్‌తో చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సీఎం సూచనల మేరకు ఈ ఫ్లైఓవర్‌కు మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేరు పెట్టినట్టు తెలిపారు. కార్మికుల తరఫున పోరాడిన నాయిని పేరు దీనితో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఇందిరాపార్కును అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని.. లోయర్ ట్యాంక్‌బండ్, అప్పర్ ట్యాంక్‌బండ్‌ను కలుపుతూ టూరిస్ట్ ప్రాంతంగా తీర్చిదిద్దుతామని కేటీఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కల్వకుర్తి నేత ఉప్పల వెంకటేశ్

కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఉప్పల వెంకటేశ్, మరికొందరు ఇతర పార్టీల నాయకులు శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్ముకుంటే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్లేనని.. ఢిల్లీ గులాములకు, తెలంగాణ ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న పోరాటంలో ప్రజలు ఆగం కావొద్దని పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తమదని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించాలన్నారు.

జనగామకు 'పల్లా' వద్దే వద్దు

- పల్లా గోబ్యాక్ అంటూ రోడ్డెక్కిన ముత్తిరెడ్డి, పోచంపల్లి వర్గీయులు
- ఇస్తే ముత్తిరెడ్డికి, లేకపోతే పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వాలంటూ డిమాండ్
- పల్లా తనకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారంటూ ముత్తిరెడ్డి కన్నీళ్లు



జనగామ ఆర్టీసీ చౌరస్తాలో నిరసన ర్యాలీలో ముత్తిరెడ్డి, పోచంపల్లి వర్గీయులు

జనగామ: బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే టికెట్ విషయం మరింత వేడెక్కింది. తమ నియోజకవర్గంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి జోక్యం ఏమిటంటూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వర్గాలు రోడ్డెక్కాయి. నియోజకవర్గంలోని 8 మండలాలతోపాటు జనగామ అర్బన్‌కు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు శనివారం 'పల్లా గో బ్యాక్', 'ముత్తిరెడ్డికి మూడోసారి టికెట్ ఇవ్వండి.. లేదంటే పోచంపల్లికి ఇచ్చినా పర్వాలేదు'అంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించాయి. అనంతరం ఆర్టీసీ చౌరస్తాలో హైదరాబాద్-వరంగల్ హైవేపై నిరసనకు దిగాయి. పల్లా రాజేశ్వర్‌రెడ్డి అనుచరులు జనగామ బీఆర్ఎస్ టికెట్ కోసం స్థానిక ప్రజాప్రతినిధులను సంతలో పశువుల్లా కొంటున్నారని ఆరోపించారు. పల్లాకు జనగామతో పనేమిటని, ఆయనకు టికెట్ ఇస్తే తమ పదవులకు రాజీనామా చేస్తామని ప్రకటించారు. ఆందోళనకారులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించినా తర్వాత విరమించుకున్నారు. మొత్తంగా ముత్తిరెడ్డి, పోచంపల్లి వర్గీయుల ఆందోళనతో జనగామలో నాలుగు గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. కార్యక్రమంలో నాయకులు కర్రె శ్రీనివాస్, మసివుర్ రెహమాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, రేఖ, శ్రీనివాస్, మల్లాగారి రాజు, స్వప్నరాజు, శ్రీశైలం, మామిడాల రాజు, రామక్రిష్ణ, ఉడుగుల కిష్టయ్య, ప్రభాకర్, తిప్పారపు విజయ్, నాగరాజు, మిద్దెపాక లెనిన్, జూకంటి కిష్టయ్య, రమేష్, వంగ ప్రణీత్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్, బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు జనగామలో ఏం పని: ముత్తిరెడ్డి

సింహం లాంటి సీఎం కేసీఆర్ పక్కన ఉండి కూడా పల్లా రాజేశ్వర్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి విమర్శించారు. శనివారం జనగామలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''జనగామ టికెట్ కోసం పోచంపల్లి శ్రీనివాసరెడ్డి పోటీపడుతున్నారంటూ ప్రచారం జరిగినప్పుడు ఆయన నా ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి మరీ అది అబద్ధమని చెప్పారు. ఆయన చూపిన సంస్కారానికి నా నమస్కారం. కానీ పల్లా ఎంత ఎత్తులో ఉన్నారో అంతటి స్థాయిలో కుట్రలకు తెరలేపారు. నా వెనుక ఉన్న నాయకులకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు. జనగామను మరో హుజూరాబాద్ చెయ్యాలని చూస్తున్నారు. పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నారు. నా కుటుంబంలో కలహాలు రేపించినది ఎవరో అందరికీ తెలుసు..''అని ముత్తిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యమంలో 2002 నుంచి కేసీఆర్ వెంట సైనికుడిలా పనిచేస్తున్నానని, తనకు తొలి జాబితాలోనే టికెట్ ప్రకటించాలని సీఎంకు దండం పెట్టి విన్నవిస్తున్నానంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉద్రిక్తత

- ఎమ్మెల్యే రాజయ్య అనుచరుల అరెస్టు
- మీదికొండ క్రాస్‌రోడ్డు వద్ద కడియం దిష్టిబొమ్మ దహనం



మీదికొండ క్రాస్‌రోడ్డు వద్ద కడియం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య వర్గీయులు

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వచ్చే ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ ఎమ్మెల్సీ కడియం శ్రీహరికే వస్తుందని విస్తృతంగా ప్రచారం కావడం, ఎమ్మెల్యే రాజయ్యపై కడియం వ్యాఖ్యలు చేయడంపై రాజయ్య అనుచరులు భగ్గుమన్నారు. శనివారం ఇక్కడ కడియం దిష్టిబొమ్మను ఎమ్మెల్యే అనుచరులు దహనం చేయనున్నారని పోలీసులు తెలుసుకొని అప్రమత్తమయ్యారు. జెడ్పీటీసీ మారపాక రవితో పాటు పలువురిని ఉదయం అరెస్టు చేశారు. ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఎమ్మెల్యే అనుచరులను, ప్రజాప్రతినిధులను ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ రాఘవేందర్, ఎస్ఐలు నాగరాజు, హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే తమ్ముడు, ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేశ్‌కుమార్ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి బయటికి వెళ్లకుండా హౌస్‌అరెస్టు చేశారు. ఘన్‌పూర్‌లో అవినీతి పెరిగిందని, గోకుడు, గీకుడుగాళ్లు, భూకబ్జాదారులంటూ కడియం అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని మీదికొండ క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఎమ్మెల్యే అనుచరులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీహరి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు.

హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దు

ఇల్లెందులో సమావేశమైన పలువురు నేతలు.. అధిష్టానానికి విజ్ఞప్తి



ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ ఇంట్లో సమావేశమైన అసమ్మతి నేతలు

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియకు మరోమారు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వొద్దని ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు అధిష్టానాన్ని కోరారు. ఎమ్మెల్యే భర్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బానోతు హరిసింగ్ అరాచకాలు మితిమీరాయని, సెటిల్‌మెంట్లు, భూదందాలేకాక సొంత పార్టీ నేతలపైనే కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో హరిప్రియకు కాకుండా ఎవరికి టికెట్ ఇచ్చినా వారిని గెలిపించుకుంటామని అన్నారు. ఈ మేరకు శనివారంరాత్రి ఇల్లెందులోని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు గృహంలో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల పరిధిలో ఉన్న ఇల్లెందు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నేతలు సమావేశమయ్యారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, ఇల్లెందు, బయ్యారం సొసైటీల చైర్మన్లు మెట్ల కృష్ణ, మూల మధుకర్‌రెడ్డి, మహబూబాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు తండ్రి శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. ఇల్లెందులో ఎమ్మెల్యే భర్త తీరుతో బీఆర్ఎస్‌కు నష్టం చేకూరుతోందని తెలిపారు. గత ఐదేళ్లలో ఇల్లెందు అభివృద్ధి నిధులను ఇతర ప్రాంతాల కాంట్రాక్టర్లకు కట్టబెట్టి కమీషన్లు పొందారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులను పక్కనబెట్టి పీఆర్ శాఖ ఇంజనీర్లతో సుమారు రూ.30 కోట్ల నిధులతో పనులు చేయించాలని ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీని కాపాడుకునేందుకు సీఎంను కలిసే అవకాశం తమకు లేనందున మీడియా ద్వారా ప్రజలు, సీఎం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అభ్యర్థిని మారిస్తే తప్ప ఇల్లెందులో పార్టీ గెలిచే అవకాశం లేదని, అయితే, ఈ విషయంలో సీఎం కేసీఆర్ ఆదేశాలను శిరసా వహిస్తామని స్పష్టం చేశారు.

అసమ్మతులకు 'చేరికల'తో చెక్!

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్.. పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థుల గెలుపు బాధ్యతల్లో వారిని భాగస్వాములను చేయాలని భావిస్తున్నారు.

ప్రత్యేకంగా చేరికలతో..

మరోవైపు గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగల సొంత పార్టీ నేతలు, విపక్షాల నాయకుల వివరాలను బీఆర్ఎస్ ఇప్పటికే సేకరించింది. అసమ్మతులతో పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు.. క్షేత్రస్థాయిలో బలం కలిగిన ఇతర పార్టీల నాయకులను బీఆర్ఎస్‌లో చేర్చుకునే పని మొదలుపెట్టింది. గతంలో స్వతంత్ర అభ్యర్థులుగా లేదా ఇతర చిన్న పార్టీల నుంచి పోటీచేసి గణనీయంగా ఓట్లు సాధించిన నాయకుల డేటాపై ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే స్థానికంగా బలం కలిగిన కౌశిక్ హరి (రామగుండం), ఉప్పల వెంకటేశ్ (కల్వకుర్తి) వంటి నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. ఇలాంటి చేరికల ద్వారా అంతర్గత అసమ్మతికి చెక్ పడుతుందని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి. ఇతర పార్టీల్లో టికెట్ దక్కని నేతలను కూడా చివరి నిమిషంలో బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం ద్వారా కూడా.. విపక్షాల ఎత్తుగడలను దెబ్బకొట్టవచ్చని పార్టీ పెద్దలు భావిస్తున్నారని అంటున్నాయి. ఇతర పార్టీల నుంచి చేరికలకు సంబంధించి జిల్లా మంత్రులు, నమ్మకస్తులైన నేతలకు కేసీఆర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారని వివరిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఈ చేరికల ఆపరేషన్‌ను సమన్వయం చేసే బాధ్యతను మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చూస్తున్నారు.

క్లుప్తంగా...

కోట్లు ఖర్చుచేసినా.. కాంగ్రెస్‌ను ఆపలేరు

టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో కల్వకుంట్ల కుటుంబం వేలాది కోట్లు ఖర్చు చేసినా.. కాంగ్రెస్ పార్టీ ప్రభంజనాన్ని ఆపలేదని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం 'తిరగబడదాం–తరిమి కొడదాం' కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి కాంగ్రెస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ తోడు దొంగలని, ఆ పార్టీలది ఫెవికాల్ బంధమని విమర్శలు గుప్పించారు. తొమ్మిదేళ్లలో చేయని రుణమాఫీని ఎన్నికలు దగ్గర కొస్తుండటంతో హడావుడిగా చేశారన్నారు. హైదరాబాద్ చుట్టూ ప్రభుత్వ ఆస్తులను అమ్మగా వచ్చిన డబ్బుతో రైతు రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. రూ.లక్ష రుణమాఫీలో వడ్డీకే రూ.90 వేలు పోతే మిగిలేది రూ.10 వేలే అన్నారు. మహిళల ఓట్ల కోసం గృహలక్ష్మి పేరుతో రూ.3 లక్షల పథకాన్ని తీసుకొచ్చారని పొంగులేటి దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అర్హులైన వారందరికీ పోడు భూముల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఏఐసీసీ కార్యదర్శులు చిన్నారెడ్డి, సంపత్‌కుమార్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, నాయకులు జూపల్లి కృష్ణారావు, మల్లు రవి పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ గెలిస్తే.. ధరణిలో ఆస్తులు మాయం

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



జనగామ: కేసీఆర్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే.. ధరణిలో ఉన్న మన ఆస్తులు మాయమైపోతాయని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం జనగామ జిల్లాలోని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవంలో కోమటిరెడ్డి మాట్లాడుతూ..భవిష్యత్తులో మన ఆస్తులు కాపాడుకోవాలంటే కేసీఆర్‌ను ఇంటికి పంపించాలన్నారు. కేసీఆర్ చేసిన రుణమాఫీ వడ్డీకి కూడా సరిపోవడం లేదని, రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని, అందుకే కవితను జైలులో పెట్టలేదని ఆరోపించారు. మద్యం దుకాణాల టెండర్‌తో పాటు దోచుకున్న లక్షలాది రూపాయల సొమ్ముతో కేసీఆర్ మరోసారి గద్దెనెక్కే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు కూడా కేసీఆర్‌ను ఇంటికి పంపించేందుకు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు.

ఎన్నికలకు బీజేపీ సిద్ధమవుతోంది: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ అన్నిరకాలుగా సిద్ధమవుతోందని, తొమ్మిదేళ్లుగా రాష్ట్రానికి పట్టిన పీడను పారదోలేందుకు ప్రజలు రెడీగా ఉన్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. తెలంగాణలో అభివృద్ధి కావాలంటే బీజేపీ అధికారానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సీఎం కేసీఆర్‌కి ఎన్నికలు వస్తేనే పథకాలు గుర్తుకు వస్తాయని, భూములమ్మి ప్రభుత్వ సొమ్ముతో ఎన్నికలకు వెళ్లాలని చూస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన 'ఎమ్మెల్యే ప్రవాస్ యోజన వర్క్‌షాప్'సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణప్రజల్ని దోచుకోవడమే బీఆర్ఎస్ ప్రభుత్వం చూపించిన ట్రైలర్ అని ధ్వజమెత్తారు. కల్వకుంట్ల కుటుంబం కుర్చీ కోసం ఏదైనా చేస్తుందని, వారి కుట్రలను ప్రజలు గమనించాలని సూచించారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన వారు మతం పేరుతో గెలవాలని చూస్తున్నారన్నారు. అభివృద్ధి చేశామనే నమ్మకం ఉంటే సీఎం, మంత్రులు పోలీసుల్లేకుండా ప్రజల్లోకి రావాలని సవాల్ విసిరారు.

యువత మద్దతు సాధిస్తే కేసీఆర్ సర్కార్‌కు ఓటమే

బీజేపీ నేత మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్న యువత మద్దతు సాధిస్తే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సర్కార్‌ను బీజేపీ ఓడించడం ఖాయమని ఆ పార్టీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. అదేవిధంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇతర హామీల అమల్లో కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తే తప్పక విజయం సాధించవచ్చని చెప్పారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠి సందర్భంగా వెలిబుచ్చిన అభిప్రాయాలను కొన్ని మీడియా, సోషల్ మీడియా మాధ్యమాలు (సాక్షి కాదు) వక్రీకరించాయని అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తాను చేసిన వ్యాఖ్యలపై స్పష్టతనిచ్చారు. దేశవ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ పెరుగుతోందని, తెలంగాణలోనూ రాజకీయంగా బలమైన పాత్రను పోషించడంతో పాటు అధికారంలోకి వస్తుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేసినా అది బీఆర్ఎస్‌కే అన్న భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు.

'తిరగబడదాం.. తరిమికొడదాం'తో ప్రజల్లోకి...

- బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై నెలరోజుల కార్యాచరణ
- ఖమ్మం తరహాలోనే చేవెళ్ల సభనూ విజయవంతం చేయాలి
- టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ గ్యారంటీ కార్డు స్కీమ్‌లను ఇంటింటికీ తీసుకెళ్లాలి: ఠాక్రే



కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, ఠాక్రే మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, అజారుద్దీన్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఇందులో భాగంగా రానున్న నెల రోజుల పాటు 'తిరగబడదాం.. తరిమి కొడదాం' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న నెలరోజుల పాటు రాష్ట్రంలోని గ్రామగ్రామాన కాంగ్రెస్ నేతలు తిరగాలని, ప్రతి ఇంటి తలుపూ తట్టి కాంగ్రెస్ పార్టీ ఆయా వర్గాలకు చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. శనివారం గాంధీభవన్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు మన్సూర్ అలీఖాన్, శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్, పార్టీ ముఖ్య నేతలు పొన్నం ప్రభాకర్, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా తిరగబడదాం.. తరిమికొడదాం కార్యక్రమ నిర్వహణతో పాటు చేవెళ్లలో ఈనెల 26న నిర్వహించనున్న బహిరంగసభ విజయవంతంపై నేతలు చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, చేవెళ్ల ప్రజాగర్జన సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని, ఈ సభలోనే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. ఖమ్మం తరహాలోనే ఈ సభను విజయవంతం చేయడం కోసం పార్టీ నేతలు, కేడర్ పనిచేయాలని కోరారు. ఇందుకోసం ఈనెల 21 నుంచి 25 వరకు నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సెప్టెంబర్ 17న పార్టీ మేనిఫెస్టో విడుదల చేస్తామని, అప్పటివరకు బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ చేయనున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడుతూ, తిరగబడదాం... తరిమికొడదాం కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన డిక్లరేషన్‌లలోని అంశాలను, చార్జిషీట్‌లను విస్తృతంగా ప్రచారం చేయాల ని కోరారు. కర్ణాటక తరహాలోనే కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డు స్కీంలను కూడా ప్రతి ఇంటికి చేర్చే బాధ్యతను కాంగ్రెస్ కేడర్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, తిరగబడదాం.. తరిమికొడదాం కార్యక్రమానికి పార్లమెంటరీ స్థానాల వారీగా ఇన్‌చార్జులను నియమించినట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

జగ్గారెడ్డి కాంగ్రెస్‌లో ఉండొద్దా?

- పార్టీ మారుతున్నానని దుష్ప్రచారం
- ఈ కల్చర్ టీడీపీ నుంచే వచ్చింది: ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్య
- నేను కన్నెర్ర చేస్తే ఉండగలరా? నడిరోడ్డుపై బట్టలిప్పి నిలబెడతా..
- నాకు రాజకీయ శీలపరీక్ష అవసరం లేదు.. రాహుల్ వెంటే నా ప్రయాణం



సాక్షి, హైదరాబాద్: తాను పార్టీ మారుతున్నట్టు ఏడాదిన్నరగా కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి మండిపడ్డారు. తాను బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అబద్ధమన్నారు. తనకు రాజకీయ శీల పరీక్షలు అవసరం లేదని.. తన రాజకీయ ప్రయాణం రాహుల్ గాంధీతోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీ మీడియా హాల్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. 'నేను పార్టీ మారుతున్నానని ప్రచారం చేయడం కొందరికి ఆనందం కలిగిస్తోంది. జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉండొద్దా? నా వ్యక్తిత్వంపై ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారు? సోషల్ మీడియాలో ప్రచారానికి ఎవరు, ఎన్ని డబ్బులు ఇస్తున్నారు? నేను కన్నెర్ర చేస్తే ఈ దుష్ప్రచారం చేస్తున్న వారు ఉంటారా?'అని పేర్కొన్నారు.

దుష్ప్రచారం టీడీపీ కల్చర్

ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే నడిరోడ్డుపై బట్టలు విప్పి నిలబెడతానని జగ్గారెడ్డి హెచ్చరించారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తెలుగుదేశం పార్టీ సంస్కృతి అని, అక్కడి నుంచే ఇది కాంగ్రెస్‌లోకి వచ్చిందని వ్యాఖ్యానించారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమం, సమావేశంలో పాల్గొంటున్నానని.. అయినా అబద్ధపు ప్రచారం చేస్తుండటం బాధ కలిగిస్తుందన్నారు. ఇప్పటికైనా ఆ మూర్ఖులు, దద్దమ్మలు తప్పుడు ప్రచారం మానేయాలన్నారు.

రాహుల్‌ను సంగారెడ్డికి రమ్మంటా..

సంగారెడ్డి మీదుగా రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర వెళితే సంతోషపడ్డానని, ఆర్థిక ఇబ్బందులున్నా యాత్రను విజయవంతం చేశానని జగ్గారెడ్డి చెప్పారు. తెలంగాణలో కేసీఆర్‌పై తిరగబడిన మొదటి నాయకుడిని తానేనని.. 2018 ఎన్నికల సమయంలో తనపై కేసులు పెట్టి, జైలుకు పంపారని, అయినా కొట్లాడి గెలిచానని వివరించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు తనకు రాహుల్‌గాంధీ 20నిమిషాల పాటు ప్రత్యేకంగా సమయం ఇచ్చారని, పార్టీ విషయాలన్నింటినీ ఆయనకు వివరించానని, దీనికి త్వరలో ఫలితం ఉంటుందని జగ్గారెడ్డి చెప్పారు. రాహుల్‌తో సంగారెడ్డిలో త్వరలోనే ఓ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా మర్రి శశిధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్సీ కె.దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. సభ్యులుగా కార్పొరేటర్ సరళ కేతినేని, ప్రేమ్‌రాజ్ యాదవ్, న్యాయవాది కె.ఆంథోనిరెడ్డి, ఎం.లక్ష్మణ్, ఎడెల్లి అజయ్‌కుమార్, పొన్నా వెంకటరమణ, పవన్, భరద్వాజ్‌లను నియమించారు. ఈమేరకు శనివారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియామకాలు చేపట్టినట్లు బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్‌కు 70 సీట్లు ఖాయం

- బీజేపీ అసలు పోటీలోనే లేదు
- బీఆర్ఎస్‌పై, ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాలు రావడం ఖాయమని టీపీసీసీ మాజీ చీఫ్, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, ఎమ్మెల్యేలపై ఇంకా ఎక్కువ వ్యతిరేకత ఉందని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ తెలంగాణలో అసలు బీజేపీ పోటీలోనే లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులంతా జనంలోనే ఉండాలని, ప్రతి ఇల్లూ తిరగాలని చెప్పారు. కర్ణాటక ఎన్నికల్లో 90 శాతం మైనార్టీలు కాంగ్రెస్ పార్టీ వైపు నిలిచారని, ఇక్కడ కూడా మైనార్టీలు తమవైపు వస్తే కాంగ్రెస్ విజయం మరింత సులువవుతుందన్నారు. తెలంగాణలోని ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని మైనార్టీలు కాంగ్రెస్ వైపు వస్తారని చెప్పారు. భారత్‌జోడో యాత్రతో తెలంగాణ ప్రజల్లో రాహుల్‌గాంధీపై అభిమానం పెరిగిందని, ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఎంత కష్టపడితే అంత మంచిదని ఉత్తమ్ చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ ఓట్ల కోసం ఏం చేద్దాం?

- నేడు ఖర్గేతో భేటీ కానున్న తెలంగాణ దళిత, గిరిజన నేతలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో దళిత, గిరిజన ఓటుబ్యాంకును తమ వైపునకు తిప్పుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 26న చేవెళ్లకు రానున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించాలని ఇప్పటికే టీపీసీసీ నిర్ణయించింది. దీనిలో పేర్కొనాల్సిన అంశాలతోపాటు ఎస్సీ, ఎస్టీలను ఆకట్టుకోవడానికి ఏఐసీసీ స్థాయిలో ఏం చేయాలి? పీసీసీకి ఎలాంటి సహకారం అవసరం? రాష్ట్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ నేతలు చేయాల్సిన కసరత్తు ఏంటి? అనే విషయాలపై చర్చించేందుకు తెలంగాణకు చెందిన 25 మంది ముఖ్యనేతలు నేడు(ఆదివారం) ఖర్గేతో భేటీ కానున్నారు. ఉదయం 11 గంటలకు ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ నేతృత్వంలోని ఎస్సీ, ఎస్టీ నేతలు శనివారమే ఢిల్లీ వెళ్లారు. ఖర్గేను కలవనున్నవారిలో టీపీసీసీ ముఖ్య నేతలు దామోదర రాజనర్సింహ, సంపత్ కుమార్, సంభాని చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్, మల్లు రవి, ప్రీతం, గోమాస శ్రీనివాస్, అద్దంకి దయాకర్, గంగారాం, మేడిపల్లి సత్యం, బలరాంనాయక్, సీతక్క, పొదెం వీరయ్య, బాలూనాయక్, శంకర్‌నాయక్, కొమరం కోటేశ్, ధన్వంతి, రాములునాయక్, చందా లింగయ్య, భరత్ చౌహాన్, ఎడ్మ తిరుపతి తదితరులున్నారు.

48 అసెంబ్లీ సీట్లు కావాలి

- కాంగ్రెస్ ఓబీసీ నేతల సమావేశంలో తీర్మానం
- స్క్రీనింగ్ కమిటీలో బీసీ నేతకు అవకాశమివ్వాలి
- గాంధీభవన్‌లో భేటీ అయిన తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 56 శాతం జనాభా ఉన్న వెనుకబడిన వర్గాల (బీసీ)కు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 48 సీట్లు కేటాయించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఓబీసీల భేటీ పేరుతో శనివారం గాంధీభవన్‌లో సమావేశమైన తెలంగాణ బీసీ నేతలు ఈ మేరకు తీర్మానం చేశారు. 'రాష్ట్రంలో 56 శాతం ఓబీసీ ప్రజలున్న దృష్ట్యా 88 జనరల్ సీట్లలో 48 సీట్లను ఓబీసీ అభ్యర్థులకు కేటాయించాలి. ఆర్థిక అంశాల కారణంతో ఓబీసీల అభ్యర్థిత్వాన్ని తిరస్కరించవద్దు. బీసీలకు కేటాయించే సీట్లను ముందుగానే గుర్తించి వారి గెలుపు కోసం పార్టీ అన్ని రకాలుగా సహకరించాలి'అంటూ తీర్మానాన్ని ఆమోదించారు. ఏఐసీసీ ఓబీసీ సెల్ జాతీయ సమన్వయకర్త కత్తి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ మాజీ సభ్యులు మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, పొన్నం ప్రభాకర్, సురేశ్ షెట్కార్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరకు సుధాకర్, జయప్రకాశ్‌లతో పాటు దాదాపు 60 మంది నేతలు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం అనే అంశంపైనే చర్చించారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం ఓబీసీలకు వారి జనాభాకు అనుగుణంగా తెలంగాణలోనూ సీట్లు కేటాయించాలని, న్యాయమైన వాటాకు బీసీలను దూరం చేయవద్దని తీర్మానించారు. అదే విధంగా టికెట్ల కేటాయింపులో కీలకపాత్ర పోషించే స్క్రీనింగ్ కమిటీలో బీసీ నేతకు అవకాశం కల్పించాలని.. మధుయాష్కీగౌడ్, వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్‌లలో ఒకరిని స్క్రీనింగ్ కమిటీలో సభ్యునిగా నియమించి రాష్ట్రంలోని ఓబీసీల్లో విశ్వాసం కల్పించాలని కూడా తీర్మానించారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యంపై చర్చించేందుకు వెంటనే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో తెలంగాణకు చెందిన బీసీ నాయకులు సమావేశమయ్యేలా టీపీసీసీ చర్యలు తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న బీసీ నేతలు డిమాండ్ చేశారు.

స్తంభించిన రైతుల బ్యాంకు ఖాతాలకూ రుణమాఫీ

- 'సాక్షి' కథనానికి స్పందించిన ప్రభుత్వం
- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- స్పష్టం చేసిన వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: బ్యాంకు ఖాతాల స్తంభనతో మూడు లక్షలమంది రైతుల రుణ మాఫీ సొమ్ము వెనక్కి అని శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. స్తంభించిన రైతుల బ్యాంకుఖాతాలకు కూడా రుణమాఫీ లభిస్తుందని స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 11 నాటికి ప్రతి కుటుంబానికి రూ.లక్ష వరకు రుణ మాఫీ చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని తెలిపింది. ఈ మేరకు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం రైతులఖాతాలకు ఈ నిధుల విడుదల ప్రక్రియ కొనసాగుతుందని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిర్దేశిత సమయంలో రుణమాఫీ ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. ఇప్పటివరకు ప్రభుత్వం 16.65 లక్షలమంది రైతులఖాతాలకు రూ.8089.74 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. రుణమాఫీ పథకం కింద అర్హులైన రైతుల డేటాబేస్ 2020 సంవత్సరంలో తయారు చేశారని, బ్యాంకుల విలీన ప్రక్రియ మూలంగా రైతుల ఖాతాల వివరాలు మారడంతో కొన్ని సమస్యలు ఏర్పడ్డాయని, బ్యాంకింగ్ వ్యవస్థల ఖాతాలు మార్పులు, చేర్పులు తరచుగా జరుగుతుంటాయని వివరించారు. రైతుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని, బ్యాంకు ఖాతాలు మూసుకుపోయినా, ఖాతా నంబర్ మారినా రుణమాఫీ కావాల్సిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. స్తంభించిన, ఫెయిలైన ఖాతాలున్న రైతులు కూడా పంటరుణ మొత్తాన్ని అందుకుంటారని తెలిపారు. వాస్తవ లబ్ధిదారులు రుణమాఫీ మొత్తాలు పొందేలా ప్రభుత్వం పనిచేస్తుందని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

త్వరలో రూ. లక్షకుపైగా ఉన్న రుణాలు మాఫీ

- కాంగ్రెస్‌కు లీడర్లు లేరు.. బీజేపీకి క్యాడర్ లేదు: హరీశ్‌రావు



మెదక్: త్వరలో రూ.లక్షకుపైగా ఉన్న రైతు రుణాలను సైతం మాఫీ చేస్తామని మంత్రి హరీశ్ రావు తెలిపారు. శనివారం ఆయన మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు రూ.99,999వరకు రుణాలన్నీ మాఫీ అయ్యాయని అన్నారు. బ్యాంకు అకౌంట్లు వినియోగంలో లేకపోవడంతో కొంతమందికి ఇబ్బంది అవుతున్నట్లు తెలిసిందన్నారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల కార్యదర్శులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో లీడర్లు లేరని, బీజేపీకి క్యాడర్ లేదని, ఆ రెండు పార్టీలకు ఎన్నికలు వస్తేనే ప్రజలు గుర్తుకొస్తారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అభ్యర్థుల దరఖాస్తులు అమ్ముతోందని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే రేపు రాష్ట్రాన్ని కూడా అమ్మేస్తుందని అన్నారు. కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 35 -40 స్థానాల్లో అభ్యర్థులే దొరకని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయిందని, ఎలక్షన్లలో డిపాజిట్లు దక్కించుకోవడం కోసమే ఆ పార్టీ ఆరాటపడుతోందన్నారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా గతంలోకంటే ఈసారి తమకు ఎక్కువ సీట్లు వస్తాయన్నారు. ఇంటి ముందు అభివృద్ధి.. కంటి ముందు అభ్యర్థి నినాదంతో ముందుకు పోతామని ఆయన తెలిపారు. హరీశ్ వెంట ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ఇక డిక్లరేషన్లతో దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

దీనిని విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించి ఖర్గేతో చర్చించేందుకు రాష్ట కాంగ్రెస్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ నేతలు ఇప్పటికే ఢిల్లీ వెళ్లారు.

వరుసగా సభలతో..

చేవెళ్ల తర్వాత ఈనెల 29న వరంగల్‌లో సభ నిర్వహించి అక్కడ మైనార్టీ డిక్లరేషన్ విడుదల చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ సభకు ఏఐసీసీ నుంచి ఓ మైనార్టీ నేతను ఆహ్వానించనున్నారు. ఈ డిక్లరేషన్ రూపకల్పనకు సంబంధించి పార్టీ మైనార్టీ నేతలతో ఇప్పటికే రెండు కమిటీలను కూడా ఏర్పాటు చేసుకుంది. తర్వాత సెప్టెంబర్ 6 నుంచి 9వ తేదీ మధ్య షాద్‌నగర్‌లో బీసీ గర్జన సభ నిర్వహిస్తామని.. ఆ సభకు బీసీ వర్గాలకు చెందిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హాజరవుతారని మాజీ ఎంపీ వి.హనుమంతరావు శనివారం గాంధీభవన్‌లో వెల్లడించారు.

ప్రియాంక గాంధీ సమక్షంలో..

బీసీ డిక్లరేషన్ అనంతరం మహిళా డిక్లరేషన్ ప్రకటించాలని.. ఈ మేరకు నిర్వహించే సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీని ఆహ్వానించాలని టీపీసీసీ నిర్ణయించింది. ప్రియాంక ఆధ్వర్యంలోనే రాష్ట్రంలోని మహిళా లోకానికి హామీల జల్లు కురిపించాలని భావిస్తోంది. అయితే ఇందుకు సంబంధించిన వేదిక, తేదీ ఖరారు కావాల్సి ఉంది.

రాష్ట్రానికి సోనియా, రాహుల్..

డిక్లరేషన్లు అన్నీ పూర్తయ్యాక.. సెప్టెంబర్ 17న ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ సమక్షంలో టీపీసీసీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించనున్నారు. శనివారం జరిగిన పార్టీ సమావేశంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మరోసారి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న సోనియాగాంధీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో జరిగే సభలకు రాహుల్‌గాంధీని కూడా ఆహ్వానిస్తామన్నారు. సెప్టెంబర్ 17 తర్వాతి రోజు నుంచి రాష్ట్ర ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళతామని, ఈ మేరకు కేడర్ సిద్ధంగా ఉండాలని చెప్పారు. మొత్తమ్మీద అన్ని వర్గాలను ఆకట్టుకునేలా వచ్చే నెల రోజుల పాటు డిక్లరేషన్లు, సభలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవడం గమనార్హం.

నీతిమంతుల మార్గము యెహోవాకు తెలియును.
దుష్టుల మార్గము నాశనమునకు నడుపును.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.చవితి రా.8.52 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** హస్త రా.2.11 వరకు, తదుపరి చిత్త. **వర్జ్యం:** ఉ.9.21 నుండి 11.03 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.40 నుండి 5.30 వరకు, **అమృతఘడియలు:** రా.7.40 నుండి 9.02 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.20
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

వివేక్ దేవ్‌రాయ్ (పీఎం అడ్వైజర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

భారత రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరం ఎంతైనా ఉందని 'మింట్'లో నా వ్యాసం వచ్చిన వారానికి మోదీజీ నుంచి నాకు పిలుపు వచ్చింది! ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్మన్‌గా నేను ఆయనకు అడ్వైజర్‌ని.

ఆగస్టు 14న స్వాతంత్య్ర దినోత్సవానికి ముందు రోజు ఆ వ్యాసం వచ్చింది. 'ఆ వ్యాసానికీ కౌన్సిల్‌కూ, ఆ వ్యాసానికీ భారత ప్రభుత్వానికీ ఎలాంటి సంబంధమూ లేదు' అని ఆగస్టు 17న ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ ట్వీట్ చేసిన రెండు రోజులకు మోదీజీ నుంచి నాకు పిలుపు వచ్చింది.

"భలే ఉంది వివేక్‌జీ.." అని నవ్వారు మోదీజీ.

"దేని గురించి అంటున్నారు మోదీజీ?" అని అడిగాను. ఆయన మళ్లీ నవ్వారు.

"మీరు రాసిన వ్యాసం గురించే 'భలే ఉంది' అన్నాను వివేక్‌జీ. అయితే 'భలే ఉంది' అని పూర్తిగా మీ వ్యాసం గురించి మాత్రమే నేను అనలేదు.." అన్నారు మోదీజీ.

ఆయన మాటలు ఆయన శక్తి మేరకు పొయెటిక్‌గా ఉంటాయి. ఎదురుగా ఉన్నది



ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్మనా, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరా అని చూసుకోరు.

"వివేక్‌జీ! రాజ్యాంగాన్ని మార్చాలని వ్యాసం రాసిందీ మీరే! ఆ వ్యాసానికీ అడ్వైజరీ కౌన్సిల్‌కీ, ఆ వ్యాసానికీ భారత ప్రభుత్వానికీ సంబంధం లేదని ట్వీట్ పెట్టించిందీ మీరే! అందుకే అంటున్నాను.. 'భలే ఉంది కదాని..'" అన్నారు మోదీజీ నవ్వుతూ.

"మోదీజీ! అవి నా వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. అందుకే కౌన్సిల్ పేరిట అలా ట్వీట్ పెట్టించాను" అన్నాను.

"నేను వ్యాసం చదవలేదు వివేక్‌జీ! వ్యాసంపై వచ్చిన ట్వీట్ మాత్రం చూశాను. అయినా వ్యాసం వ్యక్తిగతమైనది అని ట్వీట్‌తో చెప్పించడం ఎందుకు?! దేశభక్తితో రాసిన వ్యాసం దేశ ప్రజలది అవుతుంది తప్ప వ్యక్తిగతం అవుతుందా? మరీ అంత వివరణ ఇవ్వక్కర్లేదు. ఇంతకీ ఏం రాశారు ఆ వ్యాసంలో?" అని అడిగారు మోదీజీ.

"దేశంలో ఎవరేం మాట్లాడుకున్నా రాజ్యాంగమే వారి ప్రారంభం, రాజ్యాంగమే వారి ముగింపు అని రాశాను మోదీజీ.."

"కరెక్టే కదా! ఇంకా ఏం రాశారు?"

"రాజ్యాంగానికి ఏవో ఒకటీ రెండు సవరణలు సరిపోవు అని రాశాను మోదీజీ."

"ఉన్నమాటే కదా! ఇంకా?"

"మళ్లీ వెనక్కెళ్లి రాజ్యాంగం మొత్తాన్ని కొత్తగా తిరగ రాయాలి అన్నాను మోదీజీ."

"అదీ నిజమే కదా!"

"భారత రాజ్యాంగ పీఠికలోకి ప్రవేశించి.. అందులోని సోషలిస్టు, సెక్యులర్, డెమొక్రాటిక్, జస్టిస్, లిబర్టీ, ఈక్వాలిటీ అనే మాటలకు ఈనాటి అర్థం ఏంటని ప్రశ్నించాను మోదీజీ!"

"వండర్‌ఫుల్.."

"భారత ప్రజలమైన మనం.. మనకై మనమే ఒక కొత్త రాజ్యాంగాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చాను మోదీజీ.."

"మార్వెలస్.. సెక్యులర్.. స్పెక్టాక్యులర్.." అన్నారు మోదీజీ.

అక్కడితో నేను ఆగిపోయాను.

"వివేక్‌జీ! మీరిలాంటివే మంచి మంచివి రాస్తుండండి. రాజ్యాంగంపై ఏదైనా రాయడం రాజ్యాంగ విరుద్ధం కదా అని ఎవరైనా అంటే ఒకటే చెప్పండి..." అని ఆగారు మోదీజీ.

ఆయనేం చెబుతారా అని నేనూ ఆగాను.

"వివేక్‌జీ! దేశభక్తిని వ్యాసంగానో, ప్రసంగంగానో ప్రదర్శించే అవకాశం రాజ్యాంగ పరిధిలో ఉండవలసిన వాళ్లకు లభించదు..." అని, అక్కడితో ఆగిపోయారు.

ఆయన చెప్పదలచుకున్నదేమిటో నేను గ్రహించగలిగాను.


ఎకనమిక్ అడ్వైజరీ కౌన్సిల్ అన్నది నాన్-కాన్‌స్టిట్యూషనల్. నాన్ పర్మినెంట్. ఈరోజు ఉంటుంది. రేపు పోతుంది. ఈలోపు అభిప్రాయాలు ప్రజలకు ఎక్కేస్తాయి.

"అర్థమైంది మోదీజీ" అన్నాను.

ఆయన నవ్వారు.

అడ్వైజర్‌లకే అడ్వైజర్ మోదీజీ!

చంద్రస్వామి తాయెత్తు విజన్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

తర్కంతో కొట్టలేనప్పుడు తాయెత్తుల మహిమను చూపాలి. పేదలు, బాధితులు, దగాపడిన తమ్ముళ్ల కంటిపాపల్లో కాంతి కిరణం మెరిసినప్పుడల్లా పెత్తందారీ హేతువులోంచి ఓ బేతాళుడు నిద్రలేస్తాడు. ఓం హ్రీం అంటూ ఆవులిస్తాడు. నయా పెత్తందారీవర్గపు ఉంపుడు సిద్ధాంతకర్త నారా చంద్రబాబు నాయుడులోంచి తాజా తేనెపూత విజన్‌తోపాటు ఓ బేతాళుడు కూడా బయటికొచ్చాడు. మహిళా లోకంపై మంత్ర ప్రయోగం మొదలుపెట్టాడు. ఆడబిడ్డలందరికీ ఆయన మంత్రించిన రాఖీలు ఇస్తాడట! వాటిని 45 రోజులు పూజగదిలో పెట్టుకొని దేవుణ్ణి ప్రార్థిస్తూ చంద్రబాబును తలుచుకోవాలట! అనంతరం చేతికి కట్టుకోవాలి. అప్పుడు వారికి అష్టసిరులు ఒనగూరుతాయట! మంత్రదండం సాయంతో నారా చంద్రస్వామి ఈ రకంగా మహిళా సాధికారత సాధిస్తారన్న మాట.. నిత్యానంద స్వామి కైలాసాన్ని సృష్టించినట్టు!

ఆగస్టు పదిహేనో తేదీనాడు చంద్రబాబు 'విజన్- 2047' పేరుతో విశాఖపట్టణంలో ఒక కాగితాల కట్టను విడుదల చేశారు. దాన్ని తన ఆలోచనగా చెప్పుకున్నారు. మామూలుగా పంద్రాగస్టు కార్యక్రమాలను కవర్ చేసేటప్పుడు తొలి ప్రాధాన్యాన్ని ప్రధానమంత్రికిస్తూ అదే స్థాయిలో రెండో ప్రాధాన్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికివ్వడం ప్రాంతీయ మీడియాలో ఒక సంప్రదాయం. ఆంధ్రప్రదేశ్ యెల్లో మీడియా మాత్రం ముఖ్యమంత్రిని పక్కకునెట్టి చంద్రబాబు విజన్ డాక్యుమెంట్‌కు అగ్రస్థానాన్ని ఇచ్చింది. ఇంతకూ ఇందులో ఏమంది? 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్య్రం సిద్ధించి వందేళ్లు నిండు తాయి. అప్పటికి దేశం ఎలా ఉండాలి అనే ఆలోచనతో ఏడాది కింద కేంద్ర ప్రభుత్వం 'విజన్ – 2047'ను రూపొందించింది. ఆ ఏడాది కిందటి ఆలోచనలోంచి ఓ పిడికెడు మాదాకబళాన్ని తీసుకొచ్చి కొంచెం వెచ్చచేసి బాబు వడ్డించారు. పోనీ దాన్ని రాష్ట్రానికి వర్తింపజేస్తూ అనుసృజన చేసినా బాగుండేది. కానీ, 'దేశ్ కీ నేతా' హోదాకు ఇంచు కూడా తగ్గేందుకు బాబు సిద్ధపడలేదు. బహుశా 'రాజ్య (రాష్ట్ర) కీ నేతా' హోదా మరోసారి దక్కే అవకాశం లేదని గట్టిగా నమ్మారేమో!

ఇంకో పాతికేళ్లలో దేశాన్ని అగ్రరాజ్యంగా మార్చడం తన లక్ష్యమని చెప్పుకున్నారు. ఏ హోదాతోనో చెప్పలేదు. 'ఆప్ కౌన్ హై' అని అడిగే అవసరం ఎవరికీ లేదు. తనకు యాభై అయిదేళ్లు నిండకముందే నాలుగు శతాబ్దాల పైచిలుకు వయసుతో హైదరాబాద్‌ను సృష్టించిన వ్యక్తికి ఏదైనా సాధ్యమేనని సరిపెట్టుకోవాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోలార్ పవర్, రోబోటిక్స్ వగైరా తాజా పదజాలాన్ని ఆయన విజన్‌లో విరివిగా ఉపయోగించారు. అబ్బో మా బాబుగారికి చాలా విషయాలు తెలుసునని అనుయాయులు మురిసిపోవడానికి తప్ప సామాజిక చింతన ఏ కోశానా అందులో లేదు. ఇంటర్‌లో బైపీసీ చదివితే ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగవచ్చనే ఒక గొప్ప ఉపదేశాన్ని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అనుగ్రహించారు.

ప్రధాని నరేంద్రమోదీ చెబుతున్న విజన్‌కు తాను కూడా ఇలా కోరస్ పాడితే ఆయన మెప్పు పొందవచ్చన్న తహతహ ఒక కారణం కావచ్చు. తనను గొప్ప విజనరీగా భజన చేస్తున్న యెల్లో మీడియాలో ఆత్మవిశ్వాసం నింపడం మరో కారణం కావచ్చు. ఈ రెండు అవసరాల కోసం చంద్రబాబు పంద్రాగస్టు సందర్భాన్ని ఉపయోగించుకున్నారు. అంతే తప్ప దాని మీద ఆయనకు పెద్దగా విశ్వాసం లేదు. ఎందుకంటే తన మొదటి విజన్ (2020) ఆర్థికంగా తనకు లబ్ధి చేకూర్చినా, రాజకీయంగా చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఇక తెలుగు సమాజానికైతే ఆ విజన్ సృష్టించిన విధ్వంసం మరిచిపోలేని ఒక మహా విషాదం.

చంద్రబాబు తన 'విజన్-2020' సారాంశంతో ఒక సిద్ధాంత గ్రంథాన్ని ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ప్రచురించారు. తెలుగులో దాని పేరు 'మనసులో మాట'. దాని పేరును బట్టే ఆ పుస్తకంలోని అభిప్రాయాలు చంద్రబాబుకు స్వాభావికమైనవిగా, ఆయన నమ్మకాలుగా భావించాలి. ఉచిత పథకాలను ఈ పుస్తకంలో ఈసడించుకున్నారు. ఉచిత విద్యుత్‌ను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు బుద్ధిగా మసలుకోవాలని (అప్పుడాయన అధికారంలో ఉన్నారు), ప్రభుత్వాన్ని గుడ్డిగా వ్యతిరేకించకూడదని సుద్దులు చెప్పారు. ఉద్యోగాలు పర్మనెంటయితే వారికి బాధ్యత ఉండదని, అందువల్ల కాంట్రాక్టు పద్ధతిలోనే ఉద్యోగాలు భర్తీ చేయాలని అభిప్రాయపడ్డారు. ఆ పద్ధతికి శ్రీకారం కూడా చుట్టారు. విద్య, వైద్యం ఏదీ ఉచితంగా అందుబాటులో ఉంచకూడదని గట్టిగా వాదించారు. ఆస్పత్రుల్లో సర్వీసు ఛార్జీల వసూలు ప్రారంభించారు. పేదవాడికి జ్వరం వచ్చినా డబ్బులు చెల్లించనిదే మందుబిళ్ల కూడా దొరకని దుర్మార్గ పరిస్థితి ఏర్పడింది. సర్కారు బడులను పాడుబెట్టి చదువు'కొనలేని' ఒక తరాన్ని మొత్తం విద్యకు దూరం చేశారు.

> ఆగస్టు పదిహేనో తేదీనాడు చంద్రబాబు 'విజన్-2047' పేరుతో విశాఖపట్టణంలో ఒక కాగితాల కట్టను విడుదల చేశారు. దాన్ని తన ఆలోచనగా చెప్పుకున్నారు... ప్రధాని నరేంద్రమోదీ చెబుతున్న విజన్‌కు తాను కూడా ఇలా కోరస్ పాడితే ఆయన మెప్పు పొందవచ్చన్న తహ తహ ఒక కారణం కావచ్చు. తనను గొప్ప విజనరీగా భజన చేస్తున్న యెల్లో మీడియాలో ఆత్మవిశ్వాసం నింపడం మరో కారణం కావచ్చు. ఈ రెండు అవసరాల కోసం చంద్రబాబు పంద్రాగస్టు సందర్భాన్ని ఉపయోగించుకున్నారు. అంతే తప్ప దాని మీద ఆయనకు పెద్దగా విశ్వాసం లేదు. ఎందుకంటే తన మొదటి విజన్ (2020) ఆర్థికంగా తనకు లబ్ధి చేకూర్చినా, రాజకీయంగా చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఇక తెలుగు సమాజానికైతే ఆ విజన్ సృష్టించిన విధ్వంసం మరిచి పోలేని ఒక మహా విషాదం.
>
> చంద్రబాబు తన 'విజన్-2020' సారాంశంతో ఒక సిద్ధాంత గ్రంథాన్ని ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ప్రచురించారు. తెలుగులో దాని పేరు 'మనసులో మాట'. దాని పేరును బట్టే ఆ పుస్తకంలోని అభిప్రాయాలు చంద్రబాబుకు స్వాభావికమైనవిగా, ఆయన నమ్మకాలుగా భావించాలి. ఉచిత పథకాలను ఈ పుస్తకంలో ఈసడించుకున్నారు. ఉచిత విద్యుత్‌ను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. ప్రతిపక్షాలు బుద్ధిగా మసలుకోవాలని (అప్పుడాయన అధికారంలో ఉన్నారు), ప్రభుత్వాన్ని గుడ్డిగా వ్యతిరేకించకూడదని సుద్దులు చెప్పారు.

మధ్యతరగతి ప్రజలు సైతం చదువుల ఖర్చులు భరించలేక అప్పుల ఊబిలోకి దిగబడిపోయారు. వ్యవసాయం దండగ అనే సిద్ధాంతాన్ని వంటబట్టించుకొని రైతాంగంలో అదే అభిప్రాయం వ్యాప్తి చెందేలా చేశారు. రైతు కూలీలు భూబంధం నుంచి బయటపడితేనే సంపన్నుల పనులకు చౌకగా శ్రమశక్తి లభిస్తుందన్న ఉద్దేశంతో ఈ కుట్రకు పాల్పడ్డారు. ఆయన కోరుకున్నట్టుగానే లక్షలాది రైతు కూలీలు పొలం బంధాన్ని తెంచుకున్నారు. పొట్టకూటి కోసం వలస బాటలు పట్టారు. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో కూలీ తల్లులు చంటిబిడ్డల నోటికి పాలపీకలు పెట్టిన కల్లు సీసాలను అందించారు. కల్లు మత్తులో ఆ బిడ్డ నిద్రపోయి తల్లి కోసం ఏడ్వదని వారు అలా తల పోసేవారు. మాటలకందని ఆ మహాదైన్యం అప్పుడు ఎక్కడ చూసినా కనిపించేది. వలసబాట పట్టకుండా మొండికేసి వ్యవసాయం చేసిన వారు బాబు విధానాల ఫలితంగా అప్పుల పాలై ఆత్మహత్యలను ఆశ్రయించడం మొదలుపెట్టారు. బిడ్డలు వలసపోగా మిగిలిన అవ్వాతాతలు అంబలి కేంద్రాల దగ్గర బారులు తీరి నిలబడిన దృశ్యాలు ఇప్పటికీ గుర్తే!

ఈ దుస్థితికే ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న 'పల్లె కన్నీరు పెడుతుందో' అనే పాటలో అద్దంపట్టిన సంగతి తెలిసిందే. ఈ కన్నీటికి కారణం చంద్రబాబు విజన్. ఆ కన్నీటిపై ఐటీ పన్నీరు చల్లి 'ఇదీ చంద్రబాబు విజన్' అని ఆయన అనుకూలవర్గం ఇప్పటికీ ప్రచారం చేస్తున్నది. తాను ప్రైవేట్ రంగంలో ఇంజనీరింగ్ కళాశాలలను ప్రారంభించడం వల్లనే ఐటీ నిపుణులు పెరిగారని ఆయన ఇప్పటికీ చెప్పుకుంటారు. కానీ అంతకంటే ఐదేళ్లు ముందుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలను ప్రకటిస్తే వాటికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమాలు నడిపిన వ్యక్తి చంద్రబాబు. హైటెక్ సిటీ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే ప్రణాళిక సిద్ధమైందని చంద్రబాబే స్వయంగా 'మనసులో మాట' పుస్తకంలో రాసుకున్నారు. రెడీగా ఉన్న ప్రణాళికను అమలు చేయడంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ కోసం ఆయన ఆలస్యం చేశారు. ఇదీ జరిగిన వాస్తవం. ఈ వాస్తవాలను యెల్లో మీడియా మసిపూసి మారేడుకాయలు చేసింది. ఒక సామాజిక విధ్వంస కుడికి విజనరీ ముసుగువేసి చరిత్రలో నిలబెట్టింది. ఇది చరిత్రలో జరిగిన ఒక ద్రోహం.

బాబు విజన్‌తో కన్నీరు పెట్టిన పల్లెసీమలు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మళ్లీ చిగురించడం మొదలైంది. రైతు మళ్లీ నాగలి పట్టాడు. వైద్యం పేదలకు చేరువైంది. జన సంక్షేమ విజన్‌కు ప్రాధాన్యం లభించింది. పదేళ్లు అధికారానికి దూరమైన చంద్రబాబు రాష్ట్ర విభజన తర్వాత బీజేపీ – పవన్ పొత్తులతో వెంట్రుకవాసి విజయాన్ని సాధించగలిగాడు. ఈ గెలుపు కోసం తన మనసులోని మాటను దాచిపెట్టాడు. సంక్షేమ ఎజెండాను ఎత్తుకోవడమే కాదు అలవిగాని హామీలతో తన ఎన్నికల మేనిఫెస్టోను నింపేశారు. గెలిచిన తర్వాత రాజధాని పేరుతో భూదోపిడీకి, పోలవరాన్ని ఏటీఎమ్‌గా వాడేందుకు పరిమితమయ్యారు. అదిగో అల్లదిగో అంటూ రాజధాని గ్రాఫిక్స్‌ను ప్రచారంలో పెడితే, 'ఇది కదా విజన్' అంటూ యెల్లో మీడియా పరవశించిపోయింది. కానీ ప్రజలు స్పష్టమైన తీర్పును ఇచ్చారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎటువంటి తడబాటూ, శషభిషలూ లేని స్పష్టమైన పేదల అనుకూల ఎజెండాను తలకెత్తుకున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పురోగతి కోసం, అన్ని వర్గాల్లోని మహిళల సాధికారత కోసం, పరిపాలనలో పారదర్శకత కోసం, అధికార వికేంద్రీకరణ కోసం ఒక ఉద్యమాన్నే ఈ ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకోసం అడ్డువస్తున్న పెత్తందారీ వ్యవస్థపై జగన్ ప్రభుత్వం యుద్ధాన్ని ప్రకటించింది. వ్యవస్థలోని అన్ని పార్శ్వాల్లో ఈ పెత్తందారీ వ్యవస్థ ఊడలు దించి బలోపేతమై ఉన్నది. ఇంతవరకూ దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ఆ వ్యవస్థపై బహిరంగ యుద్ధాన్ని ప్రకటించడానికి సాహసించలేదు. పెత్తందారీ వ్యవస్థతో తలపడటం, ఓడించడం ద్వారానే పేదల విముక్తి సాధ్యమని నమ్మిన జగన్ ప్రభుత్వం అందుకు బరిగీసి నిలబడి ఉన్నది.

> వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎటువంటి తడబాటూ, శషభిషలూ లేని స్పష్టమైన పేదల అనుకూల ఎజెండాను తలకెత్తుకున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పురోగతి కోసం, అన్ని వర్గాల్లోని మహిళల సాధికారత కోసం, పరిపా లనలో పారదర్శకత కోసం, అధికార వికేంద్రీకరణ కోసం ఒక ఉద్యమాన్నే ఈ ప్రభుత్వం ప్రారంభించింది. ఇందుకోసం అడ్డువస్తున్న పెత్తందారీ వ్యవస్థపై జగన్ ప్రభుత్వం యుద్ధాన్ని ప్రకటించింది. వ్యవస్థలోని అన్ని పార్శ్వాల్లో ఈ పెత్తందారీ వ్యవస్థ ఊడలు దించి బలోపేతమై ఉన్నది. ఇంతవరకూ దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమూ ఆ వ్యవస్థపై బహిరంగ యుద్ధాన్ని ప్రకటించడానికి సాహసించలేదు. పెత్తందారీ వ్యవస్థతో తలపడటం, ఓడించడం ద్వారానే పేదల విముక్తి సాధ్యమని నమ్మిన జగన్ ప్రభుత్వం అందుకు బరిగీసి నిలబడి ఉన్నది.
>
> పెత్తందారీ వ్యవస్థ తన సహస్ర బాహువులతో జగన్ ప్రభుత్వంపై విషం చల్లుతున్నది. దశకంఠాలతో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నది. తమ ఎన్నికల మేనిఫెస్టోను గడప గడపకూ పంపిణీ చేస్తూ తాము ఎన్ని హామీలను నెరవేర్చామో పరిశీలించి పరిపాలనకు మార్కులు వేయాలని ప్రజలను కోరుతున్న ఏకైక ప్రభుత్వం జగన్ సర్కార్. ఎన్నికల మేనిఫెస్టోను కనబడకుండా మాయం చేసి, వెబ్‌సైట్‌లోంచి కూడా తొలగించిన తెలుగుదేశం ప్రభుత్వం ఎక్కడ? మేనిఫెస్టోకు పటంకట్టి ఊరేగిస్తూ 'మేం చేయని పనేమిటో చెప్పండని పిలుపునిస్తున్న జగన్ ప్రభుత్వం ఎక్కడ?


పెత్తందారీ వ్యవస్థ తన సహస్ర బాహువులతో జగన్ ప్రభుత్వంపై విషం చల్లుతున్నది. దశకంఠాలతో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నది. తమ ఎన్నికల మేనిఫెస్టోను గడప గడపకూ పంపిణీ చేస్తూ తాము ఎన్ని హామీలను నెరవేర్చామో పరిశీలించి పరిపాలనకు మార్కులు వేయాలని ప్రజలను కోరుతున్న ఏకైక ప్రభుత్వం జగన్ సర్కార్. ఎన్నికల మేనిఫెస్టోను కనబడకుండా మాయం చేసి, వెబ్‌సైట్‌లోంచి కూడా తొలగించిన తెలుగుదేశం ప్రభుత్వం ఎక్కడ? మేనిఫెస్టోకు పటంకట్టి ఊరేగిస్తూ 'మేం చేయని పనేమిటో చెప్పండ'ని పిలుపునిస్తున్న జగన్ ప్రభుత్వం ఎక్కడ? ప్రజాక్షేత్రంలో ద్వంద్వ యుద్ధానికి తలపడటం సాధ్యమయ్యే పనేనా? కాదు కనుకనే మాయోపాయాలు, దుష్ప్రచారాలు, కుతంత్రాలు వేయి పడగలెత్తి బుసకొడుతున్నాయి. బాబుకు వేసిన విజనరీ ముసుగు జారిపోకుండా మొన్న ప్రకటించిన ఎంగిలి విజన్ ఒక పడగ. తాయెత్తు మహిమలు ప్రచారం చేయడం, మూఢనమ్మకాలను వ్యాపింపజేయడం ఇంకో పడగ. భారత రాజ్యాంగం 51వ అధికరణం ప్రకారం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందింపజేయడం పౌరుల ప్రాథమిక విధి. అందుకు విరుద్ధంగా ఒక బాధ్యత గల రాజకీయ నాయకుడే మూఢ నమ్మకాలను రెచ్చగొట్టడం రాజ్యాంగ ద్రోహమవుతుంది. పైగా వాటికి ఆయన రాఖీలని పేరు పెట్టారు. మంత్రించి ఇచ్చేవి తాయెత్తులవుతాయి గానీ రాఖీలెట్లా అవుతాయి? అయినా తమ సాధికారతకు కట్టుబడిన వాళ్లకు, తమకు రక్షణగా నిలబడిన వాళ్లకు మహిళలే స్వయంగా రక్షాబంధనాలు కడతారు తప్ప మంత్రగాళ్లకు కాదు గదా!

vardhelli1959@gmail.com

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

వేడికొద్దీ వానలు

విశ్లేషణ



డా॥ కె.బి. గోపాలం

ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వర్షపాతం మామూలు కన్నా తక్కువగా ఉంటుందని సూచనలు వచ్చాయి. ఈ సూచనలు మొత్తం దేశానికి వర్తిస్తాయని చెప్పుకోవాలి. మన దేశంలో కేంద్ర ప్రభుత్వం వారి వాతావరణ శాఖ మాత్రమే కాక స్కైమెట్ అనే ఒక ప్రైవేట్ సంస్థ కూడా వాతావరణం గురించి పరిశోధనలు చేసి సూచనలు అందిస్తూ ఉంటుంది. ఈ సంస్థవారు నిజానికి ఈ సంవత్సరం వర్షపాతం దేశం మొత్తం మీద మామూలుగా 94 శాతం మాత్రమే ఉంటుందని ప్రకటించారు. మళ్లీ ఈ అవకాశం 40 శాతం ఉంటుందని కూడా అన్నారు.

వాన రాకడ, ప్రాణం పోకడ చెప్పలేము అన్న మాట ఇక్కడ బహుశా గుర్తు చేసుకోవాలేమో? ఉత్తర భారత దేశం, దేశంలోని మధ్య ప్రాంతాలలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. మామూలుగానే ప్రపంచమంతటా వాతావరణం వేడెక్కుతోంది. హిందూ మహాసముద్రంలో డైపోల్ అనే పరిస్థితి ఒక పక్కన, అనుకున్న దానికన్నా ముందే వచ్చిన ఎల్ నినోలు మరోపక్కన ఇందుకు కారణం అని చెబుతున్నారు.

తూర్పు ఉష్ణమండల ప్రాంతంలో ఉన్న శాంతి మహాసముద్రం అనే పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రత సగటు కన్నా అర డిగ్రీ ఎక్కువయినందుకు ఎల్ నినో వస్తుంది. అన్నట్టు ఈ మాటలోనే చివరి అక్షరానికి 'య' ఒత్తు ఇచ్చినట్టు పలకాలట. మాటకు చిన్న బాబు అని అర్థం. ఈ పరిస్థితి ముందు అనుకున్న దానికన్నా రెండు నెలలు ముందే వచ్చేసింది. అంతకుముందు మూడు సంవత్సరాల పాటు లా మీనా అనే పరిస్థితి. అంటే ఇందుకు వ్యతిరేకమైన పరిస్థితి ఉండేది. సముద్రం పైభాగంలో నీళ్లు వేడెక్కడం, చల్లబడడం అనే ఈ రెండు పరిస్థితులు మూడు నుంచి ఏడేళ్లకు ఒకసారి మారుతుంటాయి.

ఒక పక్కన మానవ కార్యక్రమాల వల్ల వాతావరణం వేడెక్కుతున్నది. దానికి తోడుగా ఈ పరిస్థితులు కూడా వచ్చేసరికి మొత్తం ప్రభావం చాలా గట్టిగా ఉంటుందని



చెబుతున్నారు నిపుణులు. పగడపు కొండలన్నీ పాడైపోతాయి. అనుకోని పద్ధతిలో వరదలు వస్తాయి. లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగే పరిస్థితులు వస్తాయి. ఎల్ నినో లేకుండానే వాతావరణ పరిస్థితి దారుణంగా ఉంది, ఇక ఇది కూడా తోడైతే ఏమవుతుందో అంటున్నారు పరిశోధకులు పెడ్రో డి నేజియో.

2015 – 16 ప్రాంతంలో ఇటువంటి పరిస్థితి బలంగా వచ్చింది. పసిఫిక్ సముద్రంలో పెద్ద ఎత్తున వేడి చేరుకున్నది. ఇందులో గ్లోబల్ వార్మింగ్ ప్రభావం కూడా కొంత ఉంది. ఇప్పుడిక సముద్రం మీద మూత తీసివేసినట్లే అంటారు యూఎస్ సంస్థ 'ఎన్ఓఏఏ' పరిశోధకులు మైఖేల్. సముద్రోపరితలంలో చేరిన వేడి ప్రభావం ఇప్పటికే ప్రపంచం మీద ప్రభావం చూపుతున్నది. 2024 సంవత్సరంలో మొట్టమొదటిసారిగా ప్రపంచ సగటు ఉష్ణోగ్రత ఒకటిన్నర డిగ్రీలు ఎక్కువయ్యే అవకాశం నిండుగా ఉంటుంది అంటున్నారు ఈయన.

సాధారణంగా ఈ వేడి కారణంగా తూర్పు వ్యాపార పవనాల మీద ప్రభావం ఉంటుంది. కనుక వేడి మరింత పెరుగుతుంది. ఇప్పటివరకు ఆ గాలుల వేగంలో అంతగా మార్పు కనిపించలేదు అని పరిశీలకులు గమనించారు. ప్రస్తుతం వచ్చిన పరిస్థితి వచ్చే ఫిబ్రవరి దాకా బలంగా కొనసాగుతుంది. కనుక సముద్రం మీద నుంచి వచ్చే వ్యాపార పవనాలను అక్కడి వేడి ప్రభావితం చేస్తుంది. సెప్టెంబర్ కల్లా ఈ పరిస్థితి గురించి మరింత మంచి అవగాహన అందుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ఎల్ నినో బలంగా ఉన్నా లేకున్నా వరదలు, ఉత్పాతాలు మాత్రం తప్పవు.

ఎల్ నినో వల్ల మంచి కూడా జరిగే అవకాశం ఉందంటున్నారు. ఈ పరిస్థితి కారణంగా ఆఫ్రికా లోని కరవు ప్రాంతాలలో వర్షాలు వస్తాయి. అక్కడి ఆకలిగా ఉన్న జనాలకు తిండి దొరుకుతుంది. మొత్తం మీద మాత్రం ప్రభావాలు వ్యతి రేకంగా మాత్రమే ఉంటాయనీ, ఆర్థిక వ్యవస్థ మీద దాని ప్రభావం ఉండక తప్పదనీ పరిశోధకులు అంటున్నారు. ప్రపంచం మొత్తం మీద ఉత్పత్తులలో ఐదు శాతం తగ్గింపు కనిపించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అందరూ తెలివి తెచ్చుకుని, వాతావరణం వేడెక్కకుండా ఉండే ఏర్పాట్ల మీద దృష్టి పెట్టాలి.

వ్యాసకర్త సైన్స్ విషయాల రచయిత, అనువాదకుడు
మొబైల్: 98490 62055

చేతిలో ఉన్నది... శూన్యం!

1. అంతిమ సందేశం

పూర్వం జపాన్‌లో వెదురుబద్దలతో, కాగితంతో చేసిన, లోపల కొవ్వొత్తి వెలిగించి పెట్టిన లాంతర్లను వాడేవారు. ఓ గుడ్డివాడు రాత్రిపూట స్నేహితుణ్ణి కలిసి తిరిగి ఇంటికి వెళ్తున్నప్పుడు, ఆ స్నేహితుడు అతడికి లాంతరు పట్టుకెళ్లమని ఇచ్చాడు.

''లాంతరు అవసరం నాకు లేదు. పగలు, రాత్రి రెండూ ఒకటే నాకు'' అన్నాడు గుడ్డివాడు.

''దారి తెలుసుకోవటానికి నీకు లాంతరు అవసరం లేదని నాకు తెలుసు. అయినా, నీ దగ్గర లాంతరు లేకపోతే, ఎవరో ఒకరు నీ మీద పడవచ్చు. అందువల్ల నీవు తప్పకుండా దాన్ని తీసుకువెళ్ళాలి'' అన్నాడు స్నేహితుడు.

జ్యోతిర్మయం

గుడ్డివాడు లాంతరుతో బయలు దేరాడు. ఎక్కువ దూరం పోకముందే ఒకతను సూటిగా వచ్చి ఇతన్ని ఢీకొట్టాడు. ''ఎటు నడుస్తున్నావో చూసుకొని నడువు. ఈ లాంతరు కనపడటం లేదా?'' అని ఢీకొట్టిన అతనితో పెద్దగా అరచి చెప్పాడు.

''నీ కొవ్వొత్తి ఆరిపోయింది సోదరా!'' అన్నాడు ఆగంతకుడు.

2. నీళ్ళు లేవు, చంద్రుడు లేడు

బుక్కో అనే గురువు దగ్గర చియెనొ అనే బౌద్ధ సన్యాసిని చాలాకాలం జెన్ అధ్యయనం చేసింది గానీ ఫలితం పొందలేకపోయింది.

అంతిమంగా, ఓ వెన్నెల రాత్రి ఆమె పాత మట్టి కుండలో నీళ్ళు పట్టుకొని తెస్తోంది. దారిన నడుస్తూ వస్తున్న ఆమె మట్టికుండలో ప్రతిఫలించిన చంద్రుణ్ణి చూస్తోంది. హఠాత్తుగా, మట్టి కుండ జారి కిందపడి ముక్కలైంది. నీళ్ళు నేలపాలైనవి. చంద్ర బింబం కనుమరుగైంది. ఆ క్షణమే చియెనొ విముక్తి పొందింది.

ఈ పవిత్ర సంఘటన జ్ఞాపకార్థం ఆమె ఈ కవిత అల్లింది.

'పాత మట్టికుండను కాపాడ్డానికి
పలు విధాలుగా ప్రయత్నించాను
హఠాత్తుగా జారిపడి
మట్టికుండ ముక్కలైంది
కుండలో నీళ్ళు లేవు
నీళ్ళలో చంద్రుడు లేడు
చేతిలో ఉన్నది
శూన్యం!'

– దీవి సుబ్బారావు

క్లుప్తంగా...

ఆ బాలికపై గ్యాంగ్‌రేప్ 'దిశ' కంటే ఘోరం



కరీంనగర్‌టౌన్: పెద్దపల్లి జిల్లాలో మధ్యప్రదేశ్‌కు చెందిన బాలికపై జరిగిన గ్యాంగ్ రేప్ 'దిశ' కేసు కంటే ఘోరమైందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. కేసును నీరుగార్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. తనను నలుగురు యువకులు గ్యాంగ్‌రేప్ చేశారని బాధితురాలు చెప్పిన ఆడియో బయటకు వచ్చినా పట్టించుకోని పోలీసులు అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎంవో, మంత్రి పేషీ నుంచి వచ్చిన ఆదేశాలతోనే కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్యాంగ్‌రేప్ విషయాన్ని మధ్యప్రదేశ్ సీఎం దృష్టికి తీసుకెళ తానని చెప్పారు. తెలంగాణలో హిందూ అమ్మాయిలను చంపినా.. రేప్ చేసినా పట్టించుకోరా..? మతంతో సంబంధం లేకుండా మానవత్వంతో ఆలోచించలేరా..? అని ప్రశ్నించారు. తప్పుడు సమాచారం, వీడియోలను విడుదల చేసి కేసును మూసేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం దివాళా

'కేసీఆర్ పాలనలో తెలంగాణ దివాళా తీసింది. ఆదాయం కోసం భూములను తెగన మ్ముతుండు. గడువు ముగియక ముందే మద్యం టెండర్లు పిలిచి దరఖాస్తుల పేరుతోనే రూ.2,400 కోట్లు వసూలు చేసిండు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో డిపాజిట్లు కూడా రావు. దీనికి ఉపఎన్నికల ఫలితాలే నిదర్శనం'అని సంజయ్ అన్నారు. తాను ఎంపీగానో, ఎమ్మెల్యేగానో పోటీ చేస్తాననే చర్చే పార్టీలో జరగలేదని, ఈ విషయంలో కేంద్ర నాయకత్వం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 60 సీట్లు ఇవ్వాలి



జాజుల

మన్సూరాబాద్: బీసీల జనాభా దామాషా ప్రకారం రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పార్టీ బీసీలకు 60 సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం విస్తృతస్థాయి సమావేశం మన్సూరాబాద్ చింతలకుంటలోని ప్రణవి గార్డెన్స్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బైరీ రవికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మీడియాతో మాట్లాడారు. సబ్బండ కులాలకు రాజ్యాధికారం అనే నినాదంతో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10 సరూర్‌నగర్ స్టేడియంలో 5 లక్షల మందితో బీసీల సింహగర్జన సభను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సభా ప్రాంగణానికి ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రాంగణంగా నామకరణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 10 డిమాండ్లపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

'ఏలేటి' దీక్షతో ఉద్రిక్తత

- క్షీణిస్తున్న మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం
- రోడ్డెక్కిన బీజేపీ శ్రేణులు, రైతులు



ఏలేటికి సంఘీభావం తెలుపుతున్న వివేక్

నిర్మల్: మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్‌ను పూర్తిగా రద్దు చేయాలన్న డిమాండ్‌తో నిర్మల్‌లో బీజేపీ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. జిల్లాకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష నాలుగో రోజుకు చేరింది. మాస్టర్‌ప్లాన్ బాధిత రైతులతోపాటు మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, సీనియర్ నేత అల్జాపూర్ శ్రీనివాస్ తదితరులు ఏలేటికి సంఘీభావం తెలిపారు. ఆమరణదీక్షపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహించిన బీజేపీ శ్రేణులు శనివారం సాయంత్రం రోడ్డెక్కాయి. బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే రాస్తారోకో చేపట్టాయి. ఈక్రమంలో ఉభయుల వాగ్వాదం లాఠీచార్జికి దారితీసింది. దీంతో నాయకులను అదుపులోకి తీసుకుని టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్షీణిస్తున్న 'ఏలేటి'ఆరోగ్యం..

మాస్టర్‌ప్లాన్ రద్దు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి నాలుగురోజులు దాటడంతో మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆరోగ్యం క్షీణిస్తోంది. గంటగంటకూ వైద్యులు ఆయనను పరీక్షిస్తున్నారు. ఆక్సిజన్, షుగర్ లెవల్స్, ఈసీజీ, బీపీ తదితర పరీక్షలు చేస్తున్నారు.

కిషన్‌రెడ్డి, ఈటల ఖండన

సాక్షి, హైదరాబాద్: నిర్మల్‌లో బీజేపీ కార్యకర్తలపై పోలీసులతో కేసీఆర్ సర్కారు దాడి చేయించడాన్ని ఖండిస్తున్నామని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆరోగ్యం క్షీణిస్తున్నా స్పందించకపోవడం దారుణమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిర్మల్‌లో బీజేపీ కార్యకర్తలపై పోలీసు లాఠీచార్జి చేయడాన్ని ఈటల రాజేందర్ తప్పుబట్టారు. రైతులను తీవ్రంగా నష్టపరిచి.. అధికార పార్టీ నేతలకు లాభం చేకూర్చేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించడాన్ని ఖండించారు.

'కృష్ణా'లో కరువు తీవ్రం!

- పరీవాహక ప్రాంతాల్లో వర్షాభావం
- ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు కానరాని వరద
- శ్రీశైలంలో తరిగిపోతున్న నిల్వలు
- తాగు, సాగునీటికి తప్పని కష్టాలు



శ్రీశైలం ప్రాజెక్టు (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ కనుమల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టి నుంచి శ్రీశైలం వరకు ఉన్న అన్ని ప్రధాన జలాశయాలకు శనివారం నాటికి వరద ప్రవాహం దాదాపుగా ఆగిపోయింది. ఆల్మట్టిలోకి కేవలం 900 క్యూసెక్కులు చేరుతుండగా, దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్‌లోకి ఎలాంటి వరద రావడం లేదు. జూరాల రిజర్వాయర్‌కు 3,000 క్యూసెక్కులు, తుంగభద్ర డ్యామ్‌లోకి 587 క్యూసెక్కులు చేరుతుండగా, శ్రీశైలానికి ఎలాంటి వరద రావడం లేదు. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల రిజర్వాయర్లు గత జూలై నెలాఖరు నాటికి నిండగా, తర్వాత కురిసే వర్షాలతో వచ్చే వరదను నేరుగా శ్రీశైలం జలాశయానికి విడుదల చేయాల్సి ఉంది. కాగా, ఆగస్టు ప్రారంభం నుంచి తీవ్ర వర్షాభావం నెలకొని ఉండటంతో శ్రీశైలానికి ఎగువన ఉన్న జలాశయాలకు ఎలాంటి వరద రాలేదు. శ్రీశైలం జలాశయం నిండడానికి మరో 108 టీఎంసీల వరద రావాల్సి ఉంది. శ్రీశైలం గరిష్ట నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 107.194 టీఎంసీల నిల్వలు మాత్రమే ఉన్నాయి. మరోవైపు శ్రీశైలం నుంచి జలవిద్యుదుత్పత్తి ద్వారా తెలంగాణ దిగువకు నీళ్లను విడుదల చేస్తుండటం, పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ కాల్వలకు నీళ్లను తరలిస్తుండటంతో జలాశయంలో నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. నాగార్జునసాగర్‌కు సైతం ఎలాంటి ప్రవాహం రావడం లేదు. సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా 150.19 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. జలాశయం నిండడానికి మరో 161 టీఎంసీల వరద రావాల్సి ఉంది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు ఇలానే కొనసాగితే రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సాగు, తాగునీటి సమస్యలు ఉత్పన్నం కానున్నాయి. ఉన్న నిల్వలను రెండు రాష్ట్రాలు పోటాపోటీగా వినియోగించుకుంటే వేసవిలో తాగునీటికి కటకటలాడాల్సి వస్తుందని ఇటీవల రెండు రాష్ట్రాలకు కృష్ణా బోర్డు హెచ్చరిక జారీ చేసింది.

త్రిసభ్య కమిటీ భేటీని వాయిదా వేయాలి

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి రెండు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి ఈ నెల 21న నిర్వహించ తలపెట్టిన త్రిసభ్య కమిటీ సమావేశాన్ని 22 లేదా 23వ తేదీలకు వాయిదా వేయాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)ను తెలంగాణ రాష్ట్రం కోరింది. శ్రీశైలం జలాశయం నుంచి తెలుగు గంగ/ చెన్నై తాగునీటి అవసరాలకు 5 టీఎంసీలు, శ్రీశైలం కుడిగట్టు కాల్వ/గాలేరు నగరి సుజల స్రవంతి అవసరాలకు 4 టీఎంసీలు, కేసీ కాల్వకు 2.5 టీఎంసీలు, హంద్రీ నీవా సుజల స్రవంతికి 4.5 టీఎంసీలు కలుపుకుని 16 టీఎంసీలను కేటాయించాలని ఇటీవల ఏపీ ప్రభుత్వం కృష్ణా బోర్డును కోరింది. తెలంగాణ రాష్ట్ర అవసరాలను సైతం తెలియజేయాలని కృష్ణా బోర్డు ఇక్కడి ప్రభుత్వానికి లేఖ రాసింది. అయితే, 21న తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ ఇతర సమావేశాల్లో పాల్గొనాల్సి ఉండడంతో త్రిసభ్య కమిటీ సమావేశాన్ని మరో తేదీకి వాయిదా వేయాలని కోరారు.

గోదావరిలో చుక్కనీటినీ వదులుకోం

- సీడబ్ల్యూసీ నీటిలభ్యత నివేదికపై తెలంగాణ అభ్యంతరం
- తెలంగాణ వాటాలో 28.847 టీఎంసీలను తక్కువగా చూపారు
- గోదావరి బోర్డుకు లేఖ రాసిన తెలంగాణ ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గోదావరిలో తమ వాటా 967 టీఎంసీల్లో చుక్కనీటిని కూడా వదులుకోబోమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. గోదావరిలో నీటిలభ్యతను తెల్పుతూ ఇటీవల కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) గోదావరి బోర్డుకు సమర్పించిన నివేదికపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాళేశ్వరం వద్ద గోదావరిలో ప్రాణహిత నది కలిసేచోట నుంచి గోదావరి నది సముద్రంలో కలిసేవరకు ఉన్న జీ–10 సబ్ బేసిన్‌లోని తెలంగాణ వాటాలో 28.847 టీఎంసీలను సీడబ్ల్యూసీ తక్కువగా చూపించిందని తప్పుబట్టింది. ఈ మేరకు తెలంగాణ నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ తాజాగా గోదావరి బోర్డు చైర్మన్ ఎంకే సిన్హాకు లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో 1,486 టీఎంసీలకుగాను తెలంగాణ ప్రాజెక్టులకు 968 టీఎంసీలు, ఏపీ ప్రాజెక్టులకు 518 టీఎంసీలు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. జీ–10 సబ్ బేసిన్‌లో ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు 287.189 టీఎంసీలు అవసరమని, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు మరో 126.642 టీఎంసీలు కావాలని, భవిష్యత్తులో చేపట్టనున్న ప్రాజెక్టులకు 8.887 టీఎంసీలు, విద్యుదుత్పత్తి అవసరాలకు 12.2 టీఎంసీలు అవసరమని తెల్పిచెప్పారు. జీ–10 సబ్ బేసిన్‌లో మొత్తం 434.918 టీఎంసీల కేటాయింపులు అవసరమని, సీడబ్ల్యూసీ నివేదికలో 406.07 టీఎంసీలను మాత్రమే చూపించిందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు వద్ద నీటిలభ్యత సీడబ్ల్యూసీ 498.07 టీఎంసీలని నిర్ధారించగా, సీడబ్ల్యూసీ పరిధిలోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ(టీఏసీ) అనుమతుల ప్రకారం గోదావరి డెల్టా, పోలవరం అవసరాలకు 484.5 టీఎంసీలు అవసరమని గుర్తుచేశారు. పోలవరం దిగువ 45.83 టీఎంసీల లభ్యత ఉందని, పోలవరం అవసరాలకు 438 టీఎంసీలు సరిపోతాయని స్పష్టం చేశారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో శ్రీచైతన్య జయభేరి

సాక్షి, హైదరాబాద్: ఇటీవల ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులు జయభేరి మోగించారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌తో పాటు మంచి సెలక్షన్స్ సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీలో ఇంటర్/డిగ్రీల్లో ఇంటిగ్రేటెడ్ కోర్సు చదివిన భానుశ్రీ లక్ష్మీ గ్రూప్–1 మొదటి ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారని వెల్లడించారు. బోడెల సుజిత అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా, గోపిశెట్టి మనోహర్ ఆర్టీవోగా, వెల్లపనేని జ్యోతి ఎంపీడీవోగా, శ్రీసాయి హర్ష ఎంపీడీవోగా, బి.రమ్యకీర్తన మున్సిపల్ కమిషనర్‌గా సెలక్షన్స్ సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు టాపర్స్‌గా నిలవడం చాలా గర్వంగా ఉందని విజేతలు, వారి తల్లిదండ్రులకు ఆమె అభినందనలు తెలిపారు.

మానవీయ కోణంలో సంక్షేమానికి పెద్దపీట

- తొమ్మిదేళ్లలో మైనారిటీల కోసం రూ.15 వేల కోట్ల ఖర్చు
- మైనారిటీలకు రూ.లక్ష చెక్కుల పంపిణీలో మంత్రి కొప్పుల ఈశ్వర్



లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న మంత్రులు


సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ మానవీయ కోణంలో ఆలోచించి అన్నివర్గాలను పేదరికం నుంచి బయటపడేసేందుకు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. అన్ని కులాలు, మతాలను గౌరవిస్తూ.. వారికి సమానంగా సంక్షేమాన్ని అందించడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. శనివారం ఎల్బీ స్టేడియంలో మైనారిటీలకు రూ. లక్ష ఆర్థిక సాయం అందించే పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగిస్తూ ముస్లిం, క్రైస్తవ మైనారిటీల అభ్యున్నతి కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో మైనారిటీల సంక్షేమం కోసం సుమారు రూ.15 వేల కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. మైనారిటీ నిరుద్యోగ యువత ఆర్థికాభివృద్ధికి వంద శాతం సబ్సిడీ కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఈ పథకం కింద రాష్ట్రం మొత్తం మీద 27 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించారు. తొలివిడతగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు పది వేల మందికి రూ.లక్ష చొప్పున అందిస్తున్నామని తెలిపారు.

మైనారిటీలకు కార్పొరేట్ స్థాయి విద్య..

మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. సుమారు 204 మైనారిటీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి అందరికీ విద్య అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రస్తుతం లక్షకు పైగా విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తున్నామని చెప్పారు. హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్యేలు అబ్దుల్ అహ్మద్ బిన్ బలాలా, జాఫర్ హుస్సేన్, కాలేరు వెంకటేశ్, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్ ఇషాక్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తివేత

- గడ్డెన్నవాగు ప్రాజెక్టుకూ వరద
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీరు

కడెం/భైంసా: అల్పపీడన ద్రోణి ప్రభావంతో నిర్మల్ జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రోజంతా వాన కురిసింది. దీంతో కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతోంది. కడెం ప్రాజెక్టుకు శనివారం రాత్రి 48,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అప్రమత్తమైన అధికారులు నాలుగు గేట్లను ఎత్తి 37,900 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 692.100 అడుగుల నీటిమట్టం ఉంది. అలాగే, గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి 3,200 క్యూసెక్కుల వరద వస్తోంది. ఇప్పటికే ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తుండటంతో అధికారులు ఒక గేటు ఎత్తి 6,838 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రెండు ప్రాజెక్టుల పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పొలాల్లోకి ఎవరూ వెళ్లొద్దని.. పశువులు, గొర్రెలు సుద్దవాగు ప్రాంతంలో ఉంటే వాటిని వెనక్కి తీసుకెళ్లాలని ఆదేశించారు.

ఎద్దుతోక పట్టుకుని వాగు దాటాడు

- తండ్రి సాహసాన్ని తలచుకుని ఎమ్మెల్యే సిందే భావోద్వేగం
- చదువుకున్న రోజులను గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే



నిజాంసాగర్: ఇంజనీరింగ్ చదువుకున్న రోజులను గుర్తు చేసుకుని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సిందే భావోద్వేగానికి గురయ్యారు. నాలుగు దశాబ్దాల క్రితం తన చదువు కోసం తండ్రి పడిన కష్టాన్ని తలచుకుని కంటతడి పెట్టారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో శనివారం జరిగిన బీసీబంధు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సిందే మాట్లాడారు. ఇంజనీరింగ్‌లో చేరేందుకు రూ.391 చెల్లించాల్సి ఉందని తన తండ్రికి హైదరాబాద్ నుంచి ఉత్తరం రాశానని, వాటి కోసం ఫలానా తేదీన జుక్కల్‌కు వస్తానని, అక్కడికి తెచ్చి ఇవ్వాలని కోరానని తెలిపారు. అప్పట్లో హైదరాబాద్–జుక్కల్ మధ్య రోజుకు ఒక్క బస్సే నడిచేదని, ఉత్తరంలో చెప్పినట్టు బస్సులో జుక్కల్‌కు వెళ్లానని, అయితే వాగులు ఉధృతంగా పారుతున్నందున తన తండ్రి సమయానికి జుక్కల్ చేరుకోలేకపోయారని పేర్కొన్నారు. దీంతో నిరాశ చెంది అదే బస్సులో హైదరాబాద్‌కు తిరిగివచ్చి, తెలిసినవారి వద్ద అప్పు తీసుకుని ఫీజు చెల్లించానన్నారు. అయితే తనకు రూ.500 ఇచ్చేందుకు తన తండ్రి స్వగ్రామం దోన్‌గాం నుంచి వచ్చి, ఎద్దుతోక పట్టుకుని జుక్కల్ వాగు దాటాడని తర్వాత తెలిసిందన్నారు. తనకోసం తండ్రి చేసిన సాహసాన్ని తలచుకుని ఆయన భావోద్వేగానికి గురయ్యారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అడగకుండానే బీసీబంధు పేరిట బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తున్నారని చెప్పారు.

కిక్కెక్కించిన మద్యం దరఖాస్తులు

- లక్షా 30 వేలు దాటిన దరఖాస్తులు
- క్రితం సారితో పోలిస్తే దాదాపు రెట్టింపు
- లెక్కలు తేల్చిన ఎక్సైజ్ శాఖ
- శంషాబాద్, సరూర్‌నగర్‌లలో 10 వేలు దాటిన వైనం
- దరఖాస్తులతోనే ప్రభుత్వానికి రూ.2,639 కోట్ల ఆదాయం...
- ఈ నెల 21వ తేదీన లైసెన్సుల కోసం లాటరీలు



సాక్షి, హైదరాబాద్: ఖజానాకు 'మద్యం దరఖాస్తుల'రూపంలో కాసుల వర్షం కురిసింది. రానున్న రెండేళ్ల కాలానికి గాను రాష్ట్రంలోని వైన్‌షాపులకు లైసెన్సుల మంజూరు కోసం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియకు అనూహ్య రీతిలో స్పందన కనిపించింది. శుక్రవారం దరఖాస్తుల ప్రక్రియ ముగియగా, శనివారం మధ్యాహ్నానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న లెక్కలను ఎక్సైజ్ శాఖ తేల్చింది. ఈ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 2,620 వైన్‌షాపుల లైసెన్సుల కోసం ఏకంగా 1,31,954 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం కొనసాగుతున్న లైసెన్సుల కోసం 68,691 దరఖాస్తులు రాగా, ఈసారి గతం కంటే 63,263 దరఖాస్తులు ఎక్కువగా రావడం గమనార్హం. గత రెండేళ్లతో పోలిస్తే రానున్న రెండేళ్ల కాలానికి గాను దరఖాస్తుల సంఖ్య దాదాపు రెట్టింపయింది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.2,639 కోట్ల ఆదాయం కేవలం దరఖాస్తుల రూపంలోనే లభించింది. ఈ దరఖాస్తుల నుంచి జిల్లా స్థాయిలో కలెక్టర్ల పర్యవేక్షణలో ఈనెల 21న డ్రా తీసి లైసెన్సులు మంజూరు చేయనున్నారు.

హైదరాబాద్ శివార్లలో భారీగా..

భారీస్థాయిలో మద్యం విక్రయాలు జరుగుతున్న జిల్లాల్లోని వైన్‌షాపులను దక్కించుకునేందుకు ఆశావహులు పెద్ద ఎత్తున పోటీ పడినట్లు గణాంకాలు చెపుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ శివార్లలోని షాపుల కోసం వ్యాపారులు భారీ స్థాయిలో దరఖాస్తులు దాఖలు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సరూర్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలోని 134 షాపులకు ఏకంగా 10,908 దరఖాస్తులు రాగా, శంషాబాద్‌లోని 100 షాపులకు 10,811 దరఖాస్తులు వచ్చాయి. ఇవే షాపులకు గత రెండేళ్ల లైసెన్సుల కోసం వచ్చిన దరఖాస్తులతో పోలిస్తే ఈసారి రెట్టింపు సంఖ్యలో రావడం గమనార్హం. సరూర్‌నగర్ పరిధిలోని షాపులకు గత రెండేళ్ల కాలానికి 4,102, శంషాబాద్‌లో 4,122 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక మరో ఏడు జిల్లాల్లో దరఖాస్తుల సంఖ్య 5 వేలు దాటింది. ఖమ్మం (7,207), కొత్తగూడెం (5,057), సంగారెడ్డి (6,156), నల్లగొండ (7,058), మల్కాజ్‌గిరి (6,722), మేడ్చల్ (7,017), వరంగల్ అర్బన్ (5,858)లో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఇక, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో మాత్రమే వెయ్యి కంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. కాగా, క్రితం సారి 10 రోజుల పాటు నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో మొత్తం కలిపి 68 వేల పైచిలుకు దరఖాస్తులు రాగా, ఈసారి చివరి ఒక్కరోజే 56,980 దరఖాస్తులు రావడం గమనార్హం. ఈసారి చివరి నాలుగు రోజుల్లోనే భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈనెల 15న సెలవు దినాన్ని మినహాయిస్తే 14,16,17, 18 తేదీల్లో కలిపి 1.10 లక్షల దరఖాస్తులు రావడం గమనార్హం. ఆదిలాబాద్‌లో 979, ఆసిఫాబాద్‌లో 967 దరఖాస్తులు వచ్చాయి. ఇక, తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన జిల్లాల జాబితాలో నిర్మల్ (1,019), గద్వాల (1,179), వనపర్తి (1,329) ఉన్నాయి. ఈ దరఖాస్తుల సరళిని బట్టి రాష్ట్రంలోని రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర వ్యాపార రంగ సంస్థల యజమానులతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన లిక్కర్ వ్యాపారులు కూడా దరఖాస్తు చేసి ఉంటారని ఎక్సైజ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

సౌర పడవలతో చేపలవేట

- రాష్ట్ర మత్స్యకారులకు సౌరశక్తి పడవలు
- తెప్పల వేటతో ప్రమాదాల నివారణకు యోచన
- ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ రవీందర్



సాక్షి, హైదరాబాద్: చేపల వేటలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక విధానాలను ప్రవేశ పెట్టేందుకు తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య ప్రయత్నాలను ఆరంభించింది. రాష్ట్రంలోని భారీ జలాశయాల్లో చేపలు పట్టేందుకు మత్స్యకారులకు అవసరమైన యంత్ర సామగ్రిని సమకూర్చేందుకు మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా తెప్పలతో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులకు సౌరశక్తితో నడిచే పడవలు అందజేయాలని నిర్ణయించింది. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటికే ఉనికిలో ఉన్న సుమారు వందకుపైగా జలాశయాల్లో.. దాదాపు లక్ష మందికి పైగా మత్స్యకారులకు తెప్పలతో చేపల వేట జీవనాధారంగా ఉంది. లోతైన నీటిలో తెప్పలపై అనేక మంది మత్స్యకారులు ప్రమాదాలకు గురవుతుంటే.. మరికొందరు మృతి చెందుతున్నారు. తెప్పపై నుంచి వల వేయడం, తెడ్డు సాయంతో పడవ ముందుకు నడపడంలో అనేక ఇబ్బందులొస్తున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. వీటిన్నింటిని గుర్తించి మత్స్యకారుల మేలు కోసం ఇకపై సౌరశక్తి పడవలు సమకూర్చాలని రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య నిర్ణయించింది.

మరబోట్లతో అధిక వ్యయం: చేపల వేటకు ఉపయోగించే డీజిల్, పెట్రోల్ మరబోట్ల వినియోగం ఖర్చుతో కూడుకున్నదని ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ చెప్పారు. ఇంధన ఖర్చులు లేని పర్యావరణహితమైన మార్గాలను పరిశీలించినట్టు తెలిపారు. కేరళలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీతో తెలంగాణకు సౌరశక్తి పడవులను తీసుకొస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని 'బిట్స్ పిలాని'సంస్థ నిపుణులతో శనివారం చర్చలు జరిపామని పేర్కొన్నారు. సహకారం అందించేందుకు బిట్స్ పిలాని శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ మోరపాకల శ్రీనివాస్, ప్రొఫెసర్ సంతాను కోలే తదితరులు హామీ ఇచ్చారని రవీందర్ తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్ర జలాశయాలన్నింటిలోనూ సౌరశక్తితో నడిచే పడవులను ప్రవేశపెడతామని రవీందర్ వెల్లడించారు.

3న పద్మశాలీ రాజకీయ శంఖారావం

కాచిగూడ (హైదరాబాద్): పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం సాధించే దిశగా ముందుకు సాగాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు అధ్యక్షతన 33 జిల్లాల సంఘ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ తెలంగాణలో పద్మశాలీల జనాభా 50 లక్షలకు పైగా ఉందని, జనాభా ప్రాతిపదికన పద్మశాలీలకు సీట్లు కేటాయించిన ప్రధాన రాజకీయ పార్టీలకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. పద్మశాలీల రాజకీయ శక్తిని ప్రదర్శించేందుకు సెప్టెంబర్ 3న సరూర్‌నగర్ స్టేడియంలో పద్మశాలీ శంఖారావం పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శంఖారావం ప్రచార పోస్టర్, కరపత్రాలు, పద్మశాలీ పాటలు, జెండాలను, ప్రచార సామగ్రిని స్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్, గడ్డం జగన్నాథం, వనం విశ్వనాథం, యర్రమాద వెంకన్న నేత పాల్గొన్నారు.



కందగట్ల స్వామి

క్లుప్తంగా...

అది నేరమా? కాదా?

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: టీనేజర్లు పరస్పర అంగీకారంతో లైంగిక చర్యలో పాల్గొనడం నేరంగా పరిగణించరాదన్న అంశంపై అభిప్రాయం తెలపాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరింది. పరస్పర సమ్మతితో 16–18 మధ్య వయస్కులు లైంగిక చర్యలో పాల్గొంటే అత్యాచార నేరంగా పరిగణిస్తున్నారని, దీనిని రద్దు చేయాలంటూ న్యాయవాది హర్ష్ విభోరె సింఘాల్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) వేశారు. దీనిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం విచారించింది. అభిప్రాయం తెలపాలంటూ కేంద్ర న్యాయ, హోం శాఖలతోపాటు జాతీయ మహిళా కమిషన్ వంటి సంస్థలకు నోటీసులు పంపింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఆప్ 'గ్యారంటీ కార్డు'

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ కోటలో పాగా వేయడానికి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రయత్నాలు ప్రారంభించింది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ శనివారం రాయ్‌పూర్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల కోసం 10 ఉచిత హామీ పథకాలను ప్రకటించారు. గృహాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు నిరుద్యోగులకు రూ.3,000 భృతి, స్కూలు విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, నిరుపేద మహిళలకు నెలకి రూ.1,000, తదితర 10 హామీలతో గ్యారంటీ కార్డును విడుదల చేశారు. త్వరలో రైతులకు హామీ ప్రకటిస్తామని చెప్పారు. ఆప్ మొదటి సారిగా 2018 ఎన్నికల్లో మొత్తం 90 స్థానాలకుగాను 85 స్థానాల్లో పోటీకి దిగి అన్ని చోట్లా డిపాజిట్లు కోల్పోయింది.

చైనీయుడనుకుని సిక్కిం వాసిపై దాడి

బనశంకరి: సిక్కిం రాష్ట్రానికి చెందిన వ్యక్తిని చైనా పౌరునిగా భావించిన కొందరు దుండగులు అతన్ని తీవ్రంగా కొట్టారు. ఈ సంఘటన ఆగస్టు 16న బెంగళూరులోని ఎలక్ట్రానిక్‌సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పశ్చిమ సిక్కింలోని రించే స్పాంగ్‌కు చెందిన దినేశ్ సుబ్బా (31) ఏడు నెలలుగా బెంగళూరులోని ఒక రెస్టారెంటులో పనిచేస్తున్నాడు. 15వ తేదీ రాత్రి స్నేహితుల రూంలో పార్టీ చేసుకుని తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా ముగ్గురు దుండగులు అడ్డుకున్నారు. చైనా వాడికి ఇక్కడేం పని అని దూషిస్తూ ఇనుప రాడ్‌తో కొట్టారు. తీవ్రంగా గాయపడిన దినేశ్ సుబ్బా రోడ్డుపై పడి ఉండగా స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

అమెరికా, జపాన్, చైనాలు నష్టాల బాటలో
భారత్‌తో పాటు బ్రెజిల్, రష్యాలు పురోగమనంలో
తలసరిలో స్విట్జర్లాండ్ సాగసరి

సంపద కరిగిపోతోంది



➤ అగ్రరాజ్యం అమెరికా సహా ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాయి. అధిక ధరలు, డాలర్‌తో పోల్చి చూస్తే వివిధ దేశాల కరెన్సీలు పడిపోవడం, భౌగోళిక రాజకీయాలు, వాతావరణ మార్పులు వంటి వెన్నో దేశాల ఆర్థిక వ్యవస్థని కుంగదీస్తున్నాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా సంపద క్షీణించడం ప్రారంభమైంది. 2008 ఆర్థిక మాంద్యం తర్వాత మళ్లీ 2022లో ఆర్థిక సంక్షోభాన్ని ప్రపంచ దేశాలు ఎదుర్కొన్నట్టుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ (యూబీఎస్) రూపొందించిన గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ 2023లో వెల్లడైంది. ప్రపంచ దేశాల్లో అమెరికా అత్యధికంగా సంపదని కోల్పోతే ఆ తర్వాత స్థానంలో జపాన్ ఉంది. 2021లో ప్రపంచ దేశాల సంపద 466.2 ట్రిలియన్ డాలర్లు ఉండగా 2022 నాటికి 2.4% తగ్గి 454.5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇక సంపద తగ్గిపోవడంలో అమెరికా ముందుంది. ఏడాదిలో 5.9 ట్రిలియన్ డాలర్ల సంపదను అగ్రరాజ్యం కోల్పోయింది. ఆ తర్వాత స్థానంలో జపాన్ నిలిచింది. 2021తో పోల్చి చూస్తే ఆ దేశం 2.5 ట్రిలియన్ డాలర్ల సంపదను కోల్పోయింది.

– నేషనల్ డెస్క్, సాక్షి

ప్రాంతాల వారీగా ఇలా..

➤ అత్యంత సంపన్న దేశాలున్న ఉత్తర అమెరికా, యూరప్‌లు భారీగా నష్టపోయాయి. 2022లో ఈ దేశాల్లో 10.9 ట్రిలియన్ డాలర్ల నష్టం జరిగింది.
➤ ఆసియా పసిఫిక్ దేశాల్లో 2.1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం జరిగింది.
➤ లాటిన్ అమెరికాలో 2.4 ట్రిలియన్ డాలర్ల సంపద పెరిగింది.
➤ 2022లో భారీగా సంపద హరించుకుపోయిన దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉంటే ఆ తర్వాత జపాన్, చైనా, కెనడా, ఆస్ట్రేలియా ఉన్నాయి.
➤ సంపద భారీగా పెరిగిన దేశాల్లో భారత్, బ్రెజిల్, మెక్సికో, రష్యా నిలిచాయి.
➤ తలసరి ఆదాయంలో స్విట్జర్లాండ్ మొదటి స్థానంలో ఉంటే, అమెరికా, ఆస్ట్రేలియా, డెన్మార్క్ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

భారత్‌లో పెరుగుతున్న సంపద


➤ ప్రపంచ దేశాల్లో సంపద హరించుకుపోతూ ఉంటే భారత్‌లో మాత్రం సంపద పెరుగుతోంది. 2021తో పోల్చి చూస్తే మన దేశ సంపద 675 బిలియన్ డాలర్లు అంటే 4.6% పెరిగింది. 2022 నాటికి 15.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. చైనా వంటి దేశాల్లో కూడా సంపద హరించుకుపోతూ ఉంటే భారత్‌లో మాత్రం పెరగడం విశేషం. దేశంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు అపర కుబేరులుగా మారారు. 2000 నుంచి 2022 వరకు ఏడాదికి 15% మిలియనీర్లు పెరుగుతూ వస్తున్నారు. ఉక్రెయిన్‌తో ఏడాదిన్నరగా యుద్ధం చేస్తున్నప్పటికీ రష్యా సంపద కూడా పెరగడం గమనార్హం.


స్థిరంగా సంపద పెరుగుదల..

➤ భారత్‌లో సంపద పెరుగుదల 20 ఏళ్లుగా స్థిరంగా కొనసాగుతోంది. మధ్య తరగతికి చెందిన వ్యక్తుల సంపద ఏడాదికి 5.9% చొప్పున పెరుగుతోంది. ఒకప్పుడు చైనాలో మధ్యతరగతి సంపద అధికంగా పెరుగుతూ ఉండేది. ఇప్పుడు భారత్ చైనా స్థానాన్ని ఆక్రమించింది. మిలియనీర్లు మన దేశంలో ఏకంగా 15% పెరుగుతూ వస్తున్నారు. మొత్తమ్మీద మిలియనీర్లు అమెరికాలోనే ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా కోట్లకు పడగలెత్తిన వారు 5.9 కోట్ల మంది ఉంటే వారిలో 2.3 కోట్ల మంది అంటే 40% అమెరికాలోనే ఉన్నారు. 2027 నాటికి భారత్, చైనా, బ్రెజిల్, యూకే, దక్షిణ కొరియాలో కూడా కోటీశ్వరుల సంఖ్య పెరుగుతుందని గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ అంచనా. 2022–27 మధ్య చైనాలో కోటీశ్వరులు 26%, భారత్‌లో 11% పెరుగుతారు.

2022లో భారత్‌లో పెరిగిన సంపద 675 బిలియన్ డాలర్లు

వివిధ దేశాల్లో సంపదలో మార్పులు (ట్రిలియన్ డాలర్లలో)





మైనారిటీ స్కాలర్‌షిప్.. భారీ కుంభకోణం

- 53 శాతం విద్యా సంస్థలు బోగస్‌వే
- అయిదేళ్లలో రూ.144.83 కోట్లు పక్కదారి
- సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశం



న్యూఢిల్లీ: మైనారిటీల్లోని పేద కుటుంబాల పిల్లలకు అందాల్సిన ఉపకార వేతనాలు భారీగా పక్కదారి పట్టాయి. అనర్హులు వాటిని కాజేశారు. ఏళ్లుగా అనేక రాష్ట్రాల్లో జరుగుతున్న ఈ దందాకు వివిధ స్థాయిల్లో నోడల్ అధికారులు కొమ్ముకాశారు. స్కాలర్‌షిప్ పథకానికి ఆమోదం పొందిన విద్యా సంస్థల్లో 53 శాతం నకిలీవని తాజాగా తేలింది. అయిదేళ్లలో రూ.144.83 కోట్లు అనర్హులు జేబుల్లో వేసినట్లు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంతర్గత విచారణలో వెల్లడైంది. దీంతో, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఈ కేసును సీబీఐకి అప్పగించారు. ఈ అక్రమాలపై కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ జూలై 10వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ శాఖ అంతర్గత విచారణ జరిపిన 1,572 విద్యా సంస్థల్లో 830 వరకు బోగస్‌వేనని గుర్తించారు. ప్రస్తుతానికి 830 విద్యాసంస్థల బ్యాంకు అకౌంట్లను సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నకిలీ ఆధార్ కార్డులు, కేవైసీ పత్రాలతో లబ్ధిదారులకు బోగస్ అకౌంట్లను బ్యాంకులు ఎలా ఇచ్చాయనే దానిపైనా దృష్టి సారించనుంది.

రాష్ట్రాల వారీగా అక్రమాలు..

ఛత్తీస్‌గఢ్: రాష్ట్రంలోని పరిశీలన జరిపిన మొత్తం 62 విద్యాసంస్థలూ బోగస్‌వే.
రాజస్తాన్: పరిశీలన జరిపిన 128 విద్యాసంస్థల్లో 99 నకిలీవి.
అస్సాం: రాష్ట్రంలోని స్కాలర్‌షిప్ అందుకుంటున్న మొత్తం విద్యా సంస్థల్లో 68శాతం ఉత్తుత్తివే.
కర్ణాటక: కర్ణాటకలోని 64 శాతం విద్యాసంస్థలు బోగస్‌వి.
ఉత్తరప్రదేశ్: 44 శాతం విద్యాసంస్థలు నకిలీవి.
పశ్చిమబెంగాల్: 39 శాతం సంస్థలు నకిలీవి.

పక్కదారి పలు విధాలు

- కేరళలోని మలప్పురంలో ఒక బ్యాంకు శాఖలో 66 వేల స్కాలర్‌షిప్పులు పంపిణీ అయ్యాయి. ఇక్కడ రిజిస్టరయిన మైనారిటీ విద్యార్థుల కంటే ఉపకారవేతనాలు తీసుకున్న వారి సంఖ్యే ఎక్కువ.
- జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్‌కు చెందిన ఒక కాలేజీలో 5 వేల మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 7 వేల మంది స్కాలర్‌షిప్పులు అందుకున్నారు. తొమ్మిదో తరగతి చదువుకుంటున్న 22 మంది విద్యార్థులకు ఒకే మొబైల్ నంబర్ ఒక్క తండ్రి పేరుతోనే రిజిస్టరయి ఉంది. మరో విద్యాసంస్థకు అనుబంధంగా హాస్టల్ లేకున్నా విద్యార్థులందరూ స్కాలర్‌షిప్ పొందారు.
- అస్సాంలో.. ఒక బ్యాంక్ బ్రాంచిలో 66 వేల మంది స్కాలర్‌షిప్ లబ్ధిదారులున్నారు. సంబంధిత మదర్సాకు వెళ్లి పరిశీలనకు యత్నించగా నిర్వాహకులు అధికారులను బెదిరింపులకు గురిచేశారు.
- పంజాబ్‌లో.. స్కూల్‌లో పేరు నమోదు చేయించుకోని మైనారిటీ విద్యార్థులు సైతం ఉపకారవేతనాలు అందుకున్నారు.

తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు

బీజింగ్: చైనా, తైవాన్‌ల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. తైవాన్ ఉపాధ్యక్షుడు విలియం లాయ్ చెంగ్–తె ఇటీవల పరాగ్వే పర్యటనకు వెళ్లి తిరిగి వస్తూ శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్ నగరాల్లో ఆగారు. దీంతో డ్రాగన్ దేశం తైవాన్‌కు తీవ్ర హెచ్చరికలు పంపింది. ద్వీపం చుట్టూ శనివారం సైనిక విన్యాసాలకు దిగింది. వేర్పాటువాదులు, విదేశీ శక్తుల కవ్వింపు చర్యలకు ప్రతిగానే తాము ఈ మిలటరీ డ్రిల్స్ చేపట్టినట్టుగా చైనా రక్షణ శాఖ వెల్లడించింది. యుద్ధ విమానాలు, నౌకల్ని కూడా మోహరించింది. దీనికి సంబంధించిన వీడియో కూడా విడుదల చేసింది. తైవాన్‌ను శాశ్వతంగా స్వతంత్ర దేశంగా ప్రకటించుకునే ప్రయత్నాల్లో భాగంగానే ఉపాధ్యక్షుడు విలియం అమెరికాలోని న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కోల్లో పర్యటించారు. తైవాన్ తమ దేశంలో భాగమని అంటున్న చైనా విలియం లాయ్ పర్యటనకి హెచ్చరికగా ఇదంతా చేస్తోంది. మరోవైపు చైనా యుద్ధ విమానాలు తమ గగనతలంలోకి రావడంపై తైవాన్ మండిపడింది. శనివారం ఉదయం నుంచి పదుల సంఖ్యలో యుద్ధ విమానాలు రావడం కవ్వింపు చర్యలకి దిగడమేనని తైవాన్ రక్షణ శాఖ పేర్కొంది. తమ దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి ఎంతకైనా తెగిస్తామని స్పష్టం చేసింది.

భారత్ ఒక ఆదర్శ ప్రయోగశాల

- ఇక్కడ విజయవంతమైన పరిష్కారాలను ఎక్కడైనా అన్వయించడం సులువు
- జీ20 భేటీలో ప్రధానమంత్రి మోదీ వర్చువల్ ప్రసంగం



న్యూఢిల్లీ/బెంగళూరు: భారతదేశం విభిన్న సమస్యల పరిష్కారాల కోసం ఆదర్శవంతమైన ఒక ప్రయోగశాల అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడ విజయవంతమైన పరిష్కారాలను ప్రపంచంలో ఎక్కడైనా సులభంగా అన్వయించవచ్చని నొక్కి చెప్పారు. బెంగళూరులో శనివారం జరిగిన జీ20 డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ మంత్రుల సమావేశంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. భారత్‌లోని డిజిటల్ మౌలిక వసతులతో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు సురక్షితమైన పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రపంచంతో తన అనుభవాన్ని పంచుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రకటించారు. 'భారత్ ఎంతో వైవిధ్యం కలిగిన దేశం. మాకు డజన్ల కొద్దీ భాషలు, వందలాదిగా మాండలికాలు ఉన్నాయి. ప్రపంచంలోని ప్రతి మతానికి, అసంఖ్యాక సాంస్కృతిక వారసత్వాలకు భారత్ నిలయం. ప్రాచీన సంప్రదాయాల నుంచి లేటెస్ట్ టెక్నాలజీ వరకు, ప్రతి ఒక్కరికీ అవసరమైనవి భారత్‌లో ఉన్నాయి. అనేక సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనేందుకు భారత్ ఒక ఆదర్శ ప్రయోగశాల. ఇక్కడ విజయవంతమైన పరిష్కారాన్ని ప్రపంచంలో ఎక్కడైనా సులువుగా అన్వయించుకోవచ్చు'అని ప్రధాని చెప్పారు. డిజిటల్ సాంకేతికతలో అన్ని దేశాలను భాగస్వాములను చేసేలా వర్చువల్ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన రోడ్ మ్యాప్ రూపొందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ ఎకానమీ విస్తరించే కొద్దీ భద్రతా పరమైన సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జీ20 దేశాల మధ్య ఏకాభిప్రాయంతో విశ్వసనీయమైన, సురక్షితమైన విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సురక్షిత, సమ్మిళిత, శ్రేయస్కరమైన గ్లోబల్ డిజిటల్ భవిష్యత్తు కోసం జీ20 దేశాలకు ఇప్పుడు ఒక మంచి అవకాశం వచ్చిందని చెప్పారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థికంగా, సాంకేతికతపరంగా భారత్ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. భాషల అనువాదం కోసం 'భాషిణి'అనే కృత్రిమ మేధను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

జన్‌ధన్ ఖాతాలు 50 కోట్లు

జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు 50 కోట్లు దాటిపోవడం కీలక మైలురాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందులో సగానికి పైగా ఖాతాలు మహిళలవేనని చెప్పారు. జన్‌ధన్ బ్యాంకు ఖాతాల సంఖ్య 50 కోట్ల మార్కు దాటిందని, ఇందులో 56 శాతం మహిళలకు చెందినవేనని శుక్రవారం ఆర్థిక శాఖ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం 2014లో జన్‌ధన్ ఖాతాల కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ప్రచారం కోసం జీ20ని వాడుకుంటోంది: కాంగ్రెస్

న్యూఢిల్లీ: దేశంలో త్వరలో జరిగే జీ20 సమావేశాన్ని కేంద్రప్రభుత్వం ఎన్నికల ప్రచారం కోసం వాడుకుంటోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. వాస్తవ అంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలా చేస్తోందని విమర్శించింది. 1999లో అవతరించిన జీ20లో 19 దేశాలు, ఈయూ సభ్యులుగా ఉన్నాయి. ఇప్పటి వరకు 17 దేశాల్లో సమావేశాలు జరిగాయి. ఈసారి భారత్ వంతు వచ్చింది. కానీ, ఇప్పటి వరకు ఏదేశంలోనూ లేని విధంగా కేంద్రం దీనిని ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటోంది'అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. జీ20 శిఖరాగ్ర సమావేశాలు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరగనున్నాయి.

మస్కిటో రిపెల్లెంట్‌తో మంటలు.. ఊపిరాడక నలుగురు మృతి

చెన్నై: మస్కిటో రిపెల్లెంట్‌తో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పొగతో ఊపిరాడక ఒక వృద్ధురాలు, ఆమె ముగ్గురు మనవరాళ్లు మృతి చెందారు. తమిళనాడు రాష్ట్రం మనాలీలో ఈ విషాదం చోటుచేసుకుంది. మత్తూర్‌కు చెందిన సంతానలక్ష్మి(65), 8 నుంచి 10 వయస్సున్న తన మనవరాళ్లు సంధ్య, ప్రియ రక్షిత, పవిత్రతో కలిసి శుక్రవారం రాత్రి తన ఇంట్లో నిద్రించారు. మస్కిటో రిపెల్లెంట్‌ను వెలిగించి, తాము పడుకున్న నైలాన్ చాపకు సమీపంలో ఉంచారు. అయితే, రిపెల్లెంట్ ప్రమాదవశాత్తు చాపకు అంటుకుని, మంటలు వ్యాపించాయి. శనివారం ఉదయం చుట్టుపక్కల వారు పొగను గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి, ఇంట్లో పరిశీలించగా నలుగురూ విగతజీవులై కనిపించారు. మస్కిటో రిపెల్లెంట్ పొగ కారణంగా ఊపిరాడక వారు మృతి చెంది ఉంటారని పోలీసులు తెలిపారు. కాగా, చిన్నారుల తండ్రి అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చేరడంతో తల్లి కూడా అక్కడే ఉండిపోయింది. దీంతో, వారు ముగ్గురూ బామ్మ వద్దకు నిద్రించేందుకు వచ్చినట్లు తెలిసిందన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె రహిత వసతి విలువకు సవరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంపెనీలు తమ ఉద్యోగులకు కల్పిస్తున్న అద్దె రహిత వసతి విలువను ఆదాయపు పన్ను శాఖ సవరించింది. సెప్టెంబర్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాకుండా ఇతరులకు ఇవి వర్తిస్తాయి. 40 లక్షలకుపైగా జనాభా కలిగిన నగరాల్లో అన్‌ఫర్నిష్డ్ వసతి కల్పిస్తే మరియు ఆ వసతి కంపెనీ యాజమాన్యంలో ఉంటే.. ఇక నుంచి వసతి విలువను ఉద్యోగి జీతంలో 10 శాతంగా మూల్యాంకనం చేస్తారు. గతంలో ఇది 15 శాతం ఉంది. 15–40 లక్షల మధ్య జనాభా కలిగిన నగరాలైతే 10 శాతంగా ఉన్న విలువను 7.5 శాతానికి చేర్చారు. అద్దె రహిత వసతిని పొందుతున్న ఉద్యోగులకు పన్ను తగ్గుతుందని ఆంబర్ కార్పొరేట్ సర్వీసెస్ కన్సల్టెంట్ అరుణ్ లాల్ తెలిపారు. ఉదాహరణకు ఒక ఉద్యోగి నెలకు బేసిక్+డీఏ రూ.1,00,000 అందుకుంటే.. అతని వేతనాన్ని పాత పద్ధతిలో రూ.1,15,000లుగా లెక్కించేవారు. తాజా సవరణ ప్రకారం ఇది రూ.1,10,000 అవుతుంది.

9 మంది సైనికులు వీరమరణం

లేహ్: లద్దాఖ్‌లో జరిగిన ప్రమాదంలో 9 మంది సైనికులు వీరమరణం పొందారు. లేహ్ నుంచి నియోమా వెళ్తున్న ఆర్మీ వాహనం సాయంత్రం 4.45 గంటల సమయంలో కియారి సమీపంలో లోయలో పడిపోయింది. ప్రమాద సమయంలో ఆ వాహనంలో 10 మంది జవాన్లున్నారని లేహ్ సీనియర్ ఎస్పీ పీడీ నిత్య తెలిపారు. వాహనంపై డ్రైవర్ అదుపు కోల్పోవడంతో ఘటన జరిగిందని చెప్పారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని తీవ్రంగా గాయపడిన 10 మంది సైనికులను ఆర్మీ ఆస్పత్రికి తరలించారన్నారు. 9 మంది జవాన్లు చనిపోగా ఒకరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారని చెప్పారు.

'హెవీ డ్రాప్ సిస్టమ్' ప్రయోగం విజయవంతం



న్యూఢిల్లీ: యుద్ధ క్షేత్రంలో రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భారత వాయుసేన కీలక విజయం సాధించింది. తాజాగా హెవీ డ్రాప్ సిస్టమ్ ట్రయల్స్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఐఏఎఫ్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా సరుకు రవాణా యుద్ధ విమానం ద్వారా పారాచ్యూట్లతో రక్షణ సామగ్రిని కిందికి జార విడిచామన్నారు. హెవీ డ్రాప్ వ్యవస్థ ద్వారా సైనిక వాహనాలు, పరికరాలు, భారీ బరువుండే వాటిని సరిహద్దులకు అత్యంత సమీపంలోని యుద్ధక్షేత్రాలకు చేరవేయవచ్చని వివరించారు. ఆగ్రాలోని ఏరియల్ డెలివరీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ దీనిని రూపొందించిందని చెప్పారు.



లద్దాఖ్‌లో బైక్‌పై రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మొదటిసారిగా సరిహద్దులకు సమీపంలోని కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఆయన మోటార్ బైక్‌పై పాంగోంగ్ సరస్సు వద్దకు చేరుకున్నారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలను ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ..'పాంగోంగ్ లేక్‌కు వెళ్తున్నాం. ప్రపంచంలోనే అత్యంత అందమైన ప్రదేశాల్లో ఒకటని మా నాన్న రాజీవ్ గాంధీ తరచూ చెప్పేవారు'అని పేర్కొన్నారు. తమ నేత రాహుల్ గాంధీ శనివారం పాంగోంగ్ లేక్‌కు వెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. రాహుల్ బైక్ నడుపుతున్న కొన్ని ఫొటోలను అధికారిక ఎక్స్(పూర్వపు ట్విట్టర్)లో షేర్ చేసింది. లద్దాఖ్‌లో యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో రాహుల్ ముచ్చటించారనీ, అక్కడి వారితో కలిసి ఫుట్‌బాల్ ఆడారని పేర్కొంది. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని పాంగోంగ్ సరస్సు వద్ద ఈ నెల 20న ఆయన పూజలు చేయనున్నారని తెలిపింది.

వాషింగ్టన్‌లో కార్చిచ్చు బీభత్సం

వాషింగ్టన్: అమెరికా, కెనడాలను కార్చిచ్చులు ఇంకా వెంటాడుతున్నాయి. రోజుకో ప్రాంతంలో కార్చిచ్చులు రేగుతూ ఆందోళన పెంచుతున్నాయి. తాజాగా వాషింగ్టన్‌లోని స్పోకాన్ ప్రాంతంలో మొదలైన కార్చిచ్చు త్వరితగతిన వ్యాపిస్తోంది. కొద్ది గంటల్లో 3 వేల ఎకరాలను భస్మం చేసింది. దీంతో భారీగా ఆస్తి నష్టం ఏర్పడింది. చాలా ఇళ్లు బూడిదగా మారాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. శనివారం వాషింగ్టన్‌ను మంటలు కమ్మేయడంతో రెడ్ ఫ్లాగ్ వార్నింగ్ జారీ చేశారు. అత్యంత తీవ్ర పరిస్థితులు ఉన్నప్పుడు ఈ వార్నింగ్ జారీ చేస్తుంటారు.

కెనడాలో 200 కార్చిచ్చులు

కెనడా దేశంలోనూ కార్చిచ్చులు శరవేగంగా వ్యాపిస్తున్నాయి. వాయవ్య కెనడా ప్రాంతంలో 200కుపైగా కార్చిచ్చు ఘటనలు సంభవించాయి. ఈ ఘటనల్లో అగ్ని దావానలంగా వేగంగా పరిసరాలకు వ్యాపించంతో వేలాది మందిని విమానాల్లో సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నారు.

ఉసురు తీసింది ఆమే!

- ఏడుగురు పసికందుల్ని చంపిన నర్సుని దోషిగా తేల్చిన కోర్టు
- ఇంగ్లండ్ ఆస్పత్రిలో 2016లో దారుణ ఘటన
- నర్సుని పట్టించిన భారత సంతతి వైద్యుడు



2018లో లూసీ అరెస్టయినప్పటి ఫొటో

లండన్: ఇంకా కళ్లు తెరవని ఏడుగురి పసిపాపలను నర్సు లూసీ లెట్బీ అత్యంత కిరాతకంగా ఉసురు తీసిన ఘటన అందరినీ కలిచివేస్తోంది. బ్రిటన్ చరిత్రలో మెడికల్ సీరియల్ కిల్లర్‌గా మిగిలిన నర్సుని మాంచెస్టర్ క్రౌన్ కోర్టు దోషిగా తేల్చడంతో ఆ నర్సు చేసిన దుర్మార్గాలపై చర్చ జరుగుతోంది. 2016లో నర్సు లూసీ తాను పని చేసే కౌంటెస్ ఆఫ్ చెస్టర్ ఆస్పత్రిలో ఈ దారుణాలకు దిగింది. ఆమె చంపిన పసిపిల్లల్లో ఒక రోజు వయసున్న పసికందు సైతం ఉంది. మరో ఆరుగురు శిశువుల్ని చంపడానికి ప్రయత్నించింది. ఇంకా లోకం చూడని పసిపిల్లల్ని ఎందుకు చంపిందన్న దానిపై సరైన కారణాలు వెల్లడి కాకపోయినప్పటికీ ఆమె థ్రిల్ కోసమే చంపిందని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. దాదాపుగా 10 నెలల పాటు ఈ కేసు విచారణ జరిగింది. పసివాళ్లని చంపి, వారి ఆరోగ్యం విషమిస్తోందంటూ లూసీయే తోటి నర్సుల్ని అప్రమత్తం చేసేదని ప్రాసిక్యూటర్స్ కోర్టుకు తెలిపారు. "పసికందులకి హాని చేసి ఆ తర్వాత జరిగే విషయాలన్నీ ఆమె గమనించేది. ఏం జరుగుతోందో చూస్తూ ఎంజాయ్ చేసేది. పసిపిల్లల ప్రాణాలు పోతాయని తెలిసి కూడా ఆమె ఆనందంలో ఉండేది" అని కోర్టుకు చెప్పారు. లూసీ ఇల్లును పోలీసులు తనిఖీ చేసినప్పుడు ఆమె రాసుకున్న కొన్ని కాగితాలు దొరికాయి. అందులో "నేను చెడ్డదాన్ని. ఇదంతా నేనే చేశాను"అని అందులో రాసి ఉంది. పిల్లలకి ఇన్సులిన్ ఇవ్వడం, శిశువుల రక్తనాళాల్లో గాలిని నింపడం, నాసోగ్యాస్ట్రిక్ గొట్టాల ద్వారా అధికంగా కడుపులోకి పాలు, నీళ్లు నింపడం వంటివి చేసి దారుణంగా ప్రాణాలు తీసేది.

పెళ్లయిన డాక్టర్‌తో వివాహేతర సంబంధం

లూసీకి తాను పని చేసే ఆస్పత్రిలో ఒక పెళ్లయిన డాక్టర్‌తో వివాహేతర సంబంధం ఉండేది. వారిద్దరూ ఫోన్లలో తరచూ ప్రేమ సంభాషణలు చేసేవారని , బయట కూడా తరచూ కలుసుకునేవారని పోలీసులు విచారణలో వెల్లడైంది. లూసీయే పసిపిల్లల్ని చంపుతోందన్న అనుమానంతో ఆమెను 2016 జూలైలో విధుల నుంచి తొలగించిన తర్వాత కూడా వారిద్దరూ కలిసి ప్రయాణాలు చేశారు. ఆ వైద్యుడిని ఆకర్షించడం కోసమే ఆమె పిల్లలకు హాని చేసిందన్న అనుమానాలు కూడా అప్పట్లో వచ్చాయి.

పిల్లలు పుట్టరన్న నైరాశ్యం

లూసీ తనకు పెళ్లయి పిల్లలు పుట్టరన్న నిరాశలో ఉండేదని ఆమె ఇంట్లో దొరికిన కాగితాల ద్వారా తెలిసింది. "నేను చాలా చెడ్డదాన్ని. వాళ్లని నేనే చంపేశాను. ఎందుకంటే వాళ్లని చూసుకునేటంత మంచితనం నాకు లేదు". "నాకు ఎప్పటికీ పెళ్లి కాదు. పిల్లలు పుట్టరు. ఒక కుటుంబం అంటే ఏంటో ఎప్పటికీ నాకు తెలీదు."ఇలా ఆమె రాతలు సాగాయి. మానసికంగా ఎంతో వేదన అనుభవిస్తూ నిరాశలో ఆమె ఈ దారుణాలకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలింది.

భారత సంతతి వైద్యుడి ఘనత

కౌంటెస్ ఆఫ్ చెస్టర్‌లో పనిచేసే భారతీయ సంతతికి చెందిన డాక్టర్ రవి జయరాం ఫిర్యాదు చేయడంతో నర్సు లూసీ చేసిన దారుణాలు వెలుగులోకి వచ్చాయి. పసికందుల ఉసురు తీసింది ఆమేనని తేలడంతో డాక్టర్ రవిని అందరూ ప్రశంసిస్తున్నారు. కోర్టు తీర్పు అనంతరం డాక్టర్ రవి మీడియాతో మాట్లాడారు. "2015లో ఒక రోజు నేను నవజాత శిశువుల వార్డు ముందు నుంచి వెళుతూ ఉంటే పిల్లల్ని ఉంచే ఇంక్యుబేటర్ పక్కన లూసీ అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించింది. అప్పుడే లూసీపై అనుమానం వచ్చి ఆస్పత్రి యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. అయితే వారు ప్రాణాలు రక్షించే నర్సుపై ఇలాంటి ఆరోపణలు తగవంటూ ఆమెకు క్షమాపణ చెప్పించారు. ఆ తర్వాత మిగిలిన వైద్యులకి కూడా అనుమానం రావడంతో అందరం కలిసి పోలీసులకు వెళ్లి ఫిర్యాదు చేశాము. పోలీసులు పసికందుల మరణాలను విచారించి లూసీని అదుపులోనికి తీసుకున్నారు''అని డాక్టర్ జయరాం చెప్పారు.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 20 । ఆగస్టు । 2023



సభా వేదికపై ప్రసంగిస్తున్న కేటీఆర్

కన్నతండ్రే కాలయముడై..

భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రి

- స్కూలు నుంచి తీసుకెళ్లి.. బ్లేడ్‌తో గొంతు కోసిన వైనం
- రక్తపు మడుగులో విలవిల్లాడిన చిన్నారి
- నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహాన్ని పడేసేందుకు యత్నం
- ఓఆర్‌ఆర్‌పై తిరుగుతూ.. పోలీసులకు చిక్కిన నిందితుడు


-8లో▸
వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ భీంరెడ్డి

న్యూస్‌రీల్

రూ.30 లక్షల విలువైన బంగారం పట్టివేత



శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. శనివారం ఉదయం బ్యాంకాక్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేశారు. అందులో ఉన్న పవర్ సరఫరా చేసే యంత్రాన్ని విప్పి చూడగా 510 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలింపు: ఒకరి అరెస్టు



నాంపల్లి: భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 18వ తేదీన లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు (11020)లో తనిఖీలు చేస్తుండగా ఎస్–7 కోచ్‌లో ఒడిశా రాష్ట్రం కేంద్రపాడ జిల్లాకు చెందిన చిరంజీబ్ సహానీ రెండు సూట్ కేసుల్లో సుమారు 50 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. రైల్వే ఎస్పీ షేక్ సలీమా ఆదేశాలతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉక్కు వంతెనను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్



ఉక్కు ఉత్సాహం

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. సాంస్కృతిక కళా బృందాల ప్రదర్శనలతో ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం లభించింది. రూ.450 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇందిరాపార్కు– వీఎస్‌టీ ఉక్కు వంతెన (నాయిని నర్సింహారెడ్డి ఫ్లైఓవర్)ను శనివారం మంత్రి కేటీఆర్ ప్రారంభించిన సందర్భంగా ఇక్కడ పండగ వాతావరణాన్ని తలపించింది. నగర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, రాజ్యసభ సభ్యుడు కె. కేశవరావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ వాణీదేవి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మంత్రి కేటీఆర్‌కు తలసాని తనయుడు సాయి కిరణ్ గదను బహూకరించగా.. దానిని కేటీఆర్ సరదాగా కేశవరావుకు ఇవ్వడంతో సభలో నవ్వులు విరబూశాయి


ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

అమ్మ కడుపు చల్లగా..

గాంధీ ఆస్పత్రిలో తల్లీబిడ్డల ఆరోగ్య కేంద్రం నేడు ప్రారంభం




ప్రారంభానికి సిద్ధమైన ఎంసీహెచ్ భవనం

- అందుబాటులోకి 200 సూపర్ స్పెషాలిటీ పడకలు
- ఆధునిక సదుపాయాలు, ఆత్యాధునిక వైద్య యంత్రాలు
- రాష్ట్రంలో హైరిస్క్ ప్రసవాలకు కేంద్ర బిందువు
- తగ్గనున్న మాతాశిశు మరణాలు

గాంధీ ఆస్పత్రి: మహిళకు మాతృత్వం దేవుడిచ్చిన వరం. నవమాసాలు మోసిన శిశువు పురిట్లోనే మృతి చెందితే ఆ తల్లి పడే ఆవేదన వర్ణనాతీతం. మరి కొన్ని ఘటనల్లో శిశువు పుట్టిన వెంటనే తల్లి మరణిస్తోంది. హైరిస్క్ ప్రసవాలకు కేంద్రబిందువుగా నిలిచి తల్లీబిడ్డలను అక్కున చేర్చుకునేందుకు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఆదివారం నుంచి అందుబాటులోకి రానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో (మ్యాచింగ్ గ్రాంట్) రూ. 60 కోట్ల వ్యయంతో నిర్మించిన మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్)లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణ, ఆధునిక వసతులు, ఆత్యాధునిక వైద్యయంత్రాలతో గర్భిణులు, బాలింతలు, శిశువులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. నేటి ఉదయం మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌తో కలిసి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఎంసీహెచ్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు.


అత్యాధునిక ఆపరేషన్ థియేటర్

మాతాశిశువులకు అభయహస్తం..

గ్రౌండ్ ప్లస్ ఏడు అంతస్తుల్లో నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రంలో రెండు వందల పడకలు అదనంగా అందుబాటులోకి వస్తాయి. సుమారు రూ.10 కోట్లతో ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, వైద్య యంత్రాలను సమకూర్చారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడతారు. నవజాత శిశువుల కోసం మదర్ మిల్క్ బ్యాంకు, కంగారు మదర్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఆస్పత్రి ప్రధాన భవనంలో కొనసాగుతున్న గైనకాలజీ, పీడియాట్రిక్ విభాగాలను ఎంసీహెచ్ భవనంలోకి తరలించి, తల్లీ బిడ్డలకు ఒకేచోట మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తారు. న్యూరాలజీ, యూరాలజీ వార్డులను అదనంగా ఏర్పాటు చేశారు. గైనకాలజీ, పీడియాట్రిక్, అనస్థీషియా వంటి అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు నిరంతం అందుబాటులో ఉంటారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో నెలకు సుమారు 800 ప్రసవాలు జరుగుతుండగా, ప్రస్తుతం రెట్టింపు అవుతాయని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

అయిదో అంతస్తులో ఫెర్టిలిటీ సెంటర్..

పిల్లల కోసం తల్లడిల్లే వారికి ఎంసీహెచ్ భవనంలోని అయిదో అంతస్తులో ఫర్టిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అత్యాధునిక వైద్య యంత్రాలను సమకూర్చారు. ప్రైవేటు ఫర్టిలిటీ సెంటర్లు లక్షలాది రూపాయలు దోచుకుంటున్నాయని, గాంధీ ప్రభుత్వ ఫర్టిలిటీ సెంటర్‌లో పైసా ఖర్చు లేకుండా మాతృత్వపు రుచి చూపిస్తామని వైద్యులు స్పష్టం చేశారు.

ఆధునిక హంగులతో డైట్ క్యాంటిన్ భవనం

గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.2.75 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో నిర్మించిన డైట్ క్యాంటిన్ భవనాన్ని మంత్రి హరీష్‌రావు ప్రారంభిస్తారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్న రోగులతో పాటు సేవలు అందిస్తున్న వైద్యులకు డైట్ క్యాంటిన్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను సరఫరా చేస్తారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో రెండు దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న డైట్ క్యాంటిన్ సమస్య పరిష్కారం కానుంది.

అంతస్తుల వారీగా అందించే వైద్యసేవలు
గ్రౌండ్ ఫ్లోర్: ఓపీ, ప్రసూతి విభాగాలు, రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్
మొదటి అంతస్తు: హై డిపెండెన్సీ యూనిట్, లేబర్ డెలివరీ రికవరీ విభాగం
రెండో అంతస్తు: ఐసోలేషన్ గదులు, లేబర్ డెలివరీ విభాగం
మూడవ అంతస్తు: పేయింగ్ రూమ్స్, యాంటినెటల్ వార్డు
నాలుగో అంతస్తు: పేయింగ్ రూమ్స్, పోస్టునెటల్ వార్డు
ఐదో అంతస్తు: ఫర్టిలిటీ సెంటర్, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఐసీయు, కంగారు మదర్ రూమ్ (కేఎంసీ)
ఆరో అంతస్తు: ఎంఐసీయూ, పోస్టు ఆపరేటివ్ వార్డు
ఏడవ అంతస్తు: సీఎస్ఎస్‌డీ, పోస్ట్ ఆపరేటివ్ వార్డులు, ఆపరేషన్ థియేటర్లు


ప్రసూతి వార్డు

తెలంగాణకు మణిమకుటం ఎంసీహెచ్

మదర్ చైల్డ్ హెల్త్ కేర్ (ఎంసీహెచ్) ఆరోగ్య కేంద్రం తెలంగాణకు మణిమకుటం. రాష్ట్రవ్యాప్తంగా హైరిస్క్ ప్రసవాలను ఇక్కడే నిర్వహించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడేందుకు కృషి చేస్తాం. ఎంసీహెచ్‌తో గాంధీలో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుల నేతృత్వంలో తెలంగాణలో ప్రభుత్వ వైద్యం ఎంతో అభివృద్ధి చెంది, సామాన్య ప్రజల నమ్మకాన్ని సాధించింది. మంత్రి హరీష్‌రావు ప్రత్యేక చొరవతో ఎంసీహెచ్, డైట్ క్యాంటిన్ భవన నిర్మాణం పూర్తయ్యాయి.

– రాజారావు, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్

ట్రాన్స్‌జెండర్ల వేషంలో బలవంతపు వసూళ్లు

- పోలీసుల అదుపులో 19 మంది
- నిందితులందరూ పురుషులే

కంటోన్మెంట్: ట్రాన్స్‌జెండర్లుగా నటిస్తూ.. ప్రజలను వేధిస్తూ.. బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ముఠాను నార్త్‌జోన్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నార్త్‌జోన్ పరిధిలోని గోపాలపురం, మారేడుపల్లి, మహంకాళి, రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్‌ల పరిధిలో ట్రాన్స్‌జెండర్ల పేరిట బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న 19 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్ జంక్షన్లు, పబ్లిక్ ప్లేసెస్‌లో బెగ్గింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిపారు.

వాళ్లు అడిగిన వెంటనే డబ్బులు ఇవ్వకుంటే కార్లపై ఉమ్మివేయడం, దాడి చేయడం, దుర్భాషలాడటం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. రాజేశ్ యాదవ్, అనిత అనే వ్యక్తులు నాయకులుగా బెగ్గింగ్ ముఠాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన మొత్తం 19 మంది మగవారే అయినప్పటికీ ట్రాన్స్‌జెండర్‌లకు వేషం మార్చుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరిలో ఇద్దరు ఆపరేషన్ చేయించుకుని మరీ ట్రాన్స్‌జెండర్‌లుగా మారినట్లు తేలిందన్నారు. ఉదయం పూట బెగ్గింగ్‌తో పాటు సూర్యాస్తమయం తర్వాత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించామన్నారు. ఇటీవల ఓ ప్రైవేటు ఫంక్షన్‌కు వెళ్లి నిర్వాహకుల నుంచి రూ.లక్ష డిమాండ్ చేశారు. వారు అడిగిన డబ్బు ఇవ్వనందుకు వేధింపులతో పాటు, బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ ద్వారా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠాలో మరికొందరు కూడా ఉండే అవకాశమున్నందున, ఈ కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. త్వరలోనే బెగ్గింగ్ ముఠాల గుట్టు రట్టు చేస్తామన్నారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకు దాడులు కొనసాగిస్తామన్నారు. సమావేశంలో ఏసీపీలు సుధీర్, రవీందర్, వివిధ పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ చందనా దీప్తి



రెండో రోజూ.. అదే జోరు

తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జీహెచ్ఎంసీ కార్మికులు చేపట్టిన ఆందోళన రెండోరోజుకు చేరుకుంది. శనివారం కార్మికులు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గృహమస్తు!

డబుల్ బెడ్రూం ఇళ్ల అందజేతకు ముహూర్తం ఖరారు

- సెప్టెంబరు 2 నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు
- ఈ నెల 24న కలెక్టరేట్‌లో డ్రా పద్ధతిన లబ్ధిదారుల ఎంపిక
- ఒక్కో నియోజకవర్గానికి 500 ఇళ్ల చొప్పున కేటాయింపు
- తొలి విడతలో 12 వేల మందికి ఇచ్చే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: ఎట్టకేలకు నగరంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. సెప్టెంబరు 2 నుంచి వీటిని కేటాయించనున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 24న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ర్యాండోమైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి డ్రా పద్ధతి నిర్వహించనున్నారు. తొలి విడత కింద నియోజకవర్గానికి 500 మంది చొప్పున 24 అసెంబ్లీ నియోజవర్గాలకు కలిపి మొత్తం 12 వేలమంది లబ్ధిదారులను డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారికి సుమాఉరు 8 ప్రాంతాల్లో ఇళ్లను కేటాయిస్తారు. వీటిలో జనరల్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రిజర్వేషన్ దామాషా ప్రకారం ఎంపిక చేస్తారు. ఒక్కో కేటగిరీలో వికలాంగులకు అయిదు శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారు.

దరఖాస్తులు 7 లక్షలపైనే..

గ్రేటర్ పరిధిలో మొత్తం మీద డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం సుమారు 7.09 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. ఆరు నెలల క్రితం సుమారు 3.60 లక్షల దరఖాస్తుదారులను అధికారులు ఫోన్లలో సంప్రదించి స్థానిక కమ్యూనిటీ హాళ్లకు రప్పించి సంబంధిత పత్రాలను సేకరించారు. వీటిలో ఇటీవల సుమారు లక్ష దరఖాస్తులపై జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు క్షేత్ర విచారణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయిన దరఖాస్తుల్లోనే డ్రా పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.



శివార్లలోనే ఇళ్లు..

నగర శివార్లలోనే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు అధికంగా చేపట్టారు. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 9,453 ఇళ్లు ఉండగా.. మేడ్చల్ జిల్లాలో 38,419, రంగారెడ్డి జిల్లాలో 23,908, సంగారెడ్డి జిల్లాలో 28,220 ఇళ్లున్నాయి. వీటిలో పాత ఇళ్లు, గుడిసెలను కూల్చి అక్కడే కొత్తగా నిర్మించిన వాటిని మాత్రం ఇప్పటికే పంపిణీ చేశారు. నగరంలో లక్ష ఇళ్ల నిర్మాణానికి సరిపడా స్థలాలు లేకపోవడంతో శివారు ప్రాంతాల్లో ఎక్కువగా నిర్మించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నగరంలో ఉంటున్న వారికి కూడా శివారు ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించనున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత: మంత్రి తలసాని


మాట్లాడుతున్న మంత్రి తలసాని

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, హరీష్, అమయ్ కుమార్, హౌసింగ్ సీఈ సురేష్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రోడ్లు, డ్రైనేజీ, వాటర్, విద్యుత్ వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించి పేదలకు అందజేస్తోందని చెప్పారు.

ఇళ్ల నిర్మాణ పరిస్థితి ఇలా..

గ్రేటర్ పరిధిలో సుమారు 111 ప్రాంతాల్లో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఇప్పటి వరకు 75 వేల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటికే 29 లొకేషన్ (ఇన్ సీటు) పేదల పాత గృహాలు తొలగించి నిర్మించిన కొత్త ఇళ్లలో సుమారు 5,660 ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వాస్తవంగా మొత్తం పాత గృహాలు తొలగించిన (ఇన్ సీటు) 40 ప్రాంతాల్లో 8,898 గృహాలు, 71 ఖాళీ స్థలాల్లో 91,102 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించి పనులు చేపట్టారు. ఇప్పటికే 42 ప్రాంతాల్లో ఇళ్లను పూర్తి చేశారు. మిగతా ప్రాంతాల్లో పనులు కొనసాగుతుండగా రెండు చోట్ల 2,026 గృహాల పనులు నిలిచిపోయాయి.

నిమ్స్‌లో రోగుల సౌకర్యార్థం బ్యాటరీ కార్లు

లక్డీకాపూల్ : నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో ట్రాఫిక్ సమస్యతో పాటు శబ్ద, వాయు కాలుష్యానికి చెక్ పెట్టేందుకు బ్యాటరీ కార్లను ప్రవేశపెట్టినట్టు ఆస్పత్రి సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. రోగుల సౌకర్యార్థం వీటిని ఉపయోగించనున్నామన్నారు. శనివారం నాలుగు బ్యాటరీ వాహనాలకు ఆయన మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిమ్స్ బ్రాంచ్ సమకూర్చిన బ్యాటరీ కార్లతో పాటు అవసరమైతే మరిన్నింటిని అందుబాటులోకి తీసుకురానున్నామని, ఇందుకు పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి, డాక్టర్ ఎస్. లక్ష్మీ భాస్కర్, నెఫ్రాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ స్వర్ణలత, డాక్టర్ సాయిబాబా, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్, మీడియా ఇన్‌చార్జి సత్య గౌడ్, డిప్యూటీ రిజిస్ట్రార్ పి. రాజ్ కుమార్, ఔట్‌సోర్సింగ్ విభాగం సూపర్‌వైజర్ రాము తదితరులు పాల్గొన్నారు.



కన్నతండ్రే కాలయముడై..

భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రి

హస్తినాపురం/ అబ్దుల్లాపూర్‌మెట్: కన్న తండ్రే కాలయముడయ్యాడు. భార్యపై ఉన్న కోపంతో సొంత కూతురినే హతమార్చాడు. చదువుకునేందుకు స్కూలుకు వెళ్లిన చిన్నారిని.. కారులో ఎక్కించి వెంట తెచ్చిన బ్లేడుతో గొంతు కోశాడు. బీహెచ్‌ఈఎల్ పరిధిలో చోటు చేసుకున్న ఈ అమానవీయ ఘటన శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో వెలుగు చూసింది. కన్నపేగు తెంచుకు పుట్టిన బిడ్డ కళ్లముందు విగతజీవిగా కన్పించడంతో ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపించింది.

మూడేళ్ల క్రితం అమెరికా నుంచి వచ్చి..

చందానగర్‌కు చెందిన చంద్రశేఖర్(40)కి బీహెచ్‌ఈఎల్‌కు చెందిన హిమబిందుతో 2011లో వివాహమైంది. ఇద్దరు కొంత కాలం అమెరికాలో ఉన్నారు. వీరికి ఎనిమిదేళ్ల కుమార్తె మోక్షజ ఉంది. మూడేళ్ల క్రితం వీరు అమెరికా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. అప్పటికే వీరిద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. దీంతో ఇరువురు వేర్వేరుగా ఉంటున్నారు. హిమబిందు తన కుమార్తె మోక్షజతో కలిసి బీహెచ్‌ఈఎల్‌లోని తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. స్థానికంగా ఉన్న జ్యోతి విద్యాలయంలో కుమార్తెను నాలుగో తరగతి చదివిస్తుంది. చంద్రశేఖర్ చందానగర్‌లో ఒంటరిగా ఉంటున్నాడు. కూతురు చదువుతున్న స్కూలుకు ఆయన అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్లేవాడు. భార్యతో నెల కొన్న విభేధాలతో ఇటీవల ఓ సైకోలా మారాడు.

వారం రోజుల క్రితమే పన్నాగం

ఎలాగైనా తల్లీకూతుళ్లను హతమార్చాలని చంద్రశేఖర్ పన్నాగం పన్నాడు. ఆ మేరకు వారం రోజుల క్రితం చందానగర్‌లో పదునైన పెన్సిల్‌చాకుతో పాటు పేపర్ కట్టర్ కత్తి(బ్లేడ్)ని కొనుగోలు చేసి కారులో పెట్టుకున్నాడు. అదును కోసం ఎదురు చూశాడు. శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయంలో తన కూతురు చదువుతున్న స్కూల్‌కు వెళ్లి..ఆమెను బయటికి తీసుకొచ్చాడు. కారులో ఎక్కించుకుని వెంట తెచ్చుకున్న పదునైన బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేశాడు. చిన్నారి మోక్షజ రక్తపు మడుగులో గిలగిల కొట్టుకుని ప్రాణాలను వదిలిపెట్టింది. మృతదేహాన్ని నిర్మానుష్య ప్రదేశంలో పడేసేందుకు యత్నించాడు. మృతదేహాన్ని కారులో ఉంచి రాత్రి 10.30 గంటల సమయంలో కోహెడ శివారుకు చేరుకున్నాడు. ఔటర్‌పై అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పాటు ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. మృతదేహాన్ని తరలిస్తున్న కారుకు ముందు భాగంలోనే మరో కారు టైర్ పేలడంతో నిలిచిపోయింది. వారు కారును నిలిపి టైరుమారుస్తుండగా... అటువైపు వచ్చిన చంద్రశేఖర్ మీద అనుమానం వచ్చింది. (ఏపీ28డీడబ్ల్యు4667) వెనుక సీటులో 8 ఏళ్ల ఓ బాలిక అతి కిరాతకంగా హత్యకు గురై ఉండటం, కారులోంచి రక్తం కారుతుండాన్ని చూసి వెంటనే వారు డయల్ 100కి సమాచారం అందజేశారు.


హంతకుడు చంద్రశేఖర్


మోక్షజ (ఫైల్)

నిందితుడు అరెస్ట్..రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారును పరిశీలించగా కారు డిక్కీలో బాలిక మృతదేహం లభించింది. నిందితుడు చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. భార్యపై కోపంతోనే తాను బిడ్డను చంపాల్సి వచ్చిందని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ భీంరెడ్డి శనివారం వనస్థలిపురం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, కరుణాకర్‌రెడ్డిలు ఉన్నారు.

భార్యపై కక్షతో అత్తింటివారిపై విషప్రయోగం

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- ఒకరి మృతి..పలువురికి అస్వస్థత
- ఆరుగురు నిందితుల రిమాండ్

మియాపూర్: భార్యా భర్తల మధ్య జరిగిన గొడవలు ఓ నిండు ప్రాణాన్ని తీశాయి. పోలీసులకు ఫిర్యాదు చేసి తనను జైలుకు పంపిందనే కక్షతో భర్త ఏకంగా భార్య తరపు బంధువులపై విషప్రయోగం చేయించాడు. దీంతో ఓ మహిళ మృతిచెందగా..మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కుట్రకు పాల్పడిన ఆరుగురు వ్యక్తులను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం సీఐ ప్రేమ్‌కుమార్ తెల్పిన వివరాల ప్రకారం..మియపూర్‌కు చెందిన హన్మంత్‌రావు, ఉమామహేశ్వరి దంపతుల కుమార్తె శిరీషకు గుంటూరుకు చెందిన అజిత్‌తో 2018 జూన్ 23న వివాహం జరిపించారు. పెళ్లైన కొద్దిరోజులకు ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యంలోనే అజిత్ ఉద్యోగం నిమిత్తం యూకేకు వెళ్లిపోయాడు. కొన్నాళ్లకు శిరీష కూడా కుమార్తెతో కలిసి యూకేకు వెళ్లింది. అక్కడా వీరిద్దరి మధ్య గొడవలు జరిగాయి. భర్తపై శిరీష యూకే పోలీసులకు ఫిర్యాదు చేయగా అజిత్‌ను జైలుకు పంపారు. ఇదిలా ఉండగానే శిరీష సోదరుడు పూర్ణేందర్ వివాహం నిశ్చయం కావడంతో ఈ ఏడాది జూన్‌లో ఇండియాకు వచ్చి పుట్టింట్లో ఉంది. జూన్ 3న మియాపూర్ గోకుల్ ఫ్లాట్స్‌లో పూర్ణేందర్ వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో యూకేలో ఉన్న అజిత్ తన స్నేహితుడు వినోద్‌ను యూకే నుంచి నగరానికి పంపించి..ఎలాగైనా శిరీషను, ఆమె కుటుంబ సభ్యులను అంతంచేయాలని నిర్ణయించుకున్నాడు. ఈమేరకు వారిపై వివాహం సమయంలో విషప్రయోగం చేయాలని కుట్రపన్నారు. వీరికి శిరీష ఇంటిపైన నివాసం ఉంటున్న పూర్ణేందర్‌రావు, వాచ్‌మెన్ కుమారుడు రమేష్ సహకరించారు. వీరంతా కలిసి వినోద్ స్నేహితులైన సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన ఎడ్లపల్లి భవానీశంకర్, వనస్థలిపురంకు చెందిన బత్తుల అశోక్, గుంటూరులోని చిలుకలూరిపేటకు చెందిన బాసిరాజు గోపినాథ్‌తో డీల్ కుదుర్చుకున్నారు. పెళ్లి సమయంలో వారింట్లో విషప్రయోగం చేసేందుకు వచ్చి ఆహార పదార్థాల్లో ఆర్సెనిక్ విషం కలిపారు. దీంతో ఆహారం తీసుకున్న బంధువులంతా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. శిరీష తల్లి ఉమామహేశ్వరి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జులై 5న మృతిచెందింది. శిరీష, ఆమె కూతురు, సోదరుడు పూర్ణేందర్, ఆయన భార్య శశిరేఖలు కూడా తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. శిరీష తన కూతురితో కలిసి గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చేరగా పరీక్షించిన వైద్యుడు..వారు తీసుకున్న ఆహారంలో విషప్రయోగం జరిగిందని వెల్లడించాడు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇంటిపైన అద్దెకుంటున్న పూర్ణేందర్‌రావు, వాచ్‌మెన్ కుమారుడు రమేశ్‌పై శిరీషకు అనుమానం వచ్చి ఆరా తీసింది. వెంటనే శుక్రవారం మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసుకొని మియాపూర్ పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. దీంతో వీరి కుట్ర బయటపడింది. ఇదిలా ఉండగానే శిరీష చనిపోలేదని తెలుసుకున్న అజిత్ తన మిత్రుడు వినోద్‌ను యూకే నుంచి మరోసారి సిటీకి పంపగా ఆయన ఓ హోటల్ రూంలో దిగాడు. మరోసారి కుట్రపన్నుతుండగా పోలీసులు నిందితులందరినీ అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు అజిత్ యూకేలో ఉండి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఆయుర్వేదం మందు ఇచ్చి.. అందినకాడికి దోచేశారు

హిమాయత్‌నగర్: నరాల సమస్యతో బాధపడుతున్న ఓ ఎన్ఆర్ఐకి మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి అందినకాడికి దోచుకున్నాడు. ఓ పక్క రోగం నయం కాక..మరో పక్క ఇచ్చిన డబ్బు తిరిగి రాకపోవడంతో వారి మధ్య వాగ్వాదం మొదలైంది. దీంతో తమకు న్యాయం చేయాలంటూ ఎన్ఆర్ఐ తల్లి నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉప్పల్‌కు చెందిన భారతి కుమారుడు సుమంత్ యూఎస్‌లో ఉంటున్నాడు. ఇతను కొంతకాలంగా మెడ నరాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల అక్కడ ఉండలేక నగరానికి తిరిగొచ్చాడు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇతని సమస్యను తెలుసుకున్న సంజయ్ అనే వ్యక్తి తన సోదరుడు ఆయుర్వేదం మందు తయారు చేస్తాడని, ఆ మందు వాడితే ఈ వ్యాధి తగ్గుతుందన్నాడు. దీంతో భారతి, సుమంత్‌లు అతని మాటలు నమ్మి హిమాయత్‌నగర్‌లోని 'సాయినాథ్ ఆయుర్వేదిక్' క్లినిక్‌కు వెళ్లి అక్కడ వేణుగోపాల్ స్వామి అనే వ్యక్తిని కలిశారు. ఆయుర్వేదం మందు తయారు చేసి ఇచ్చినందుకు రూ.13 లక్షలు ఖర్చు అవుతుందన్నాడు. అయితే తాము అంత ఇవ్వలేమని చెప్పి రూ.8 లక్షలకు చెక్కు ఇచ్చారు. నెలరోజులు గడిచినా ఏవిధమైన నరాల వ్యాధి ఏమాత్రం తగ్గలేదు. ఇదే సమయంలో వీరు ఇచ్చిన చెక్కుపై సంతకం సరిగా లేక బౌన్స్ అయ్యింది. దీంతో తనకు డబ్బు ఇవ్వాలని వేణుగోపాల్ స్వామి తీవ్ర ఒత్తిడికి గురి చేయగా.. తాము ఇవ్వమన్నారు. మరో కొత్త మందు తయారు చేసి ఇస్తానని చెప్పి, దానిని వారి చేతిలో పెట్టి మరో కొత్త చెక్కును తీసుకున్నాడు. ఆ మందు కూడా పనిచేయకపోవడంతో భారతి, సుమంత్‌లు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా..వేణుగోపాల్ స్వామితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని మహాత్మా గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు హరి అగర్వాల్ తమ ట్రస్ట్ తరఫున విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 250 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా నోట్ బుక్స్ అందజేశారు. సమావేశంలో షేక్‌పేట మండల డిప్యూటీ ఐవో ఎస్ రామలింగయ్య, ప్రధానోపాధ్యాయుడు జీవీ భద్రం తదితరులు పాల్గొన్నారు.

సంస్కార్ స్కూల్‌లో సందడిగా 'పరివారోత్సవ్'



శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు వారి తల్లిదండ్రులు ఆటలాడుతూ సందడి చేశారు. శనివారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఆధ్వర్యంలో మోతీనగర్‌లో పరివారోత్సవ్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పలు ఆటలాడి అలరించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల మధ్య మరింత అనుబంధాన్ని పెంచడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్

ఖైరతాబాద్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను విజయవంతంగా అరికట్టవచ్చని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు తెలిపారు. శనివారం లక్డీకాపూల్‌లోని డీహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పనిచేస్తున్న 150 మంది ఉద్యోగులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వాడకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్ గదిలో వృద్ధుడి అనుమానాస్పద మృతి

హిమాయత్‌నగర్: చికిత్స నిమిత్తం వచ్చిన ఓ వృద్ధుడు అనుమానాస్పదంగా హోటల్ రూమ్‌లో మృతిచెందిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... నాచారంకు చెందిన మహేష్ నాయుడు(69) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నాడు. శనివారం ఓ ఆస్పత్రిలోని వైద్యుడికి చూపించుకునేందుకు నారాయణగూడ వచ్చిన మహేష్ నాయుడు తాజ్‌మహల్ హోటల్లో బస చేశాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బయటకు రాకపోవడం, ఇంట్లో వారు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. హోటల్‌కు వచ్చి చూడగా కిందపడిపోయి ఉన్నాడు. దగ్గరకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. దీనిపై మృతుడి తమ్ముడి కుమార్తె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు అడ్మిన్ ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పెట్టుబడుల పేరిట గృహిణికి టోకరా

రూ. 44 లక్షలు దోచుకున్న సైబర్ నేరగాడు

హిమాయత్‌నగర్: యూట్యూబ్ లింక్ పంపి ఆ లింకుకు రేటింగ్ ఇవ్వాలని కోరిన సైబర్ నేరగాడు ఆ తరువాత తన ప్రతాపాన్ని చూపించాడు. తాను చెప్పినవిధంగా ఇన్వెస్ట్ చేస్తే తక్కువ సమయంలో కోటీశ్వరురాలిని చేస్తానంటూ నమ్మించి నట్టేట ముంచి రూ.44 లక్షలు దోచుకున్నాడు. సిటీ సైబర్ క్రైం ఏసీపీ ఆర్.జి శివమారుతి తెలిపిన వివరాల మేరకు.. నగరానికి చెందిన గృహిణికి టెలిగ్రామ్ ద్వారా ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను యూట్యూబ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బిజినెస్ చేస్తుంటానని సదరు మహిళకు నమ్మబలికాడు. తన బిజినెస్ లింక్‌ను ఆమెకు పంపించి, రేటింగ్ ఇవ్వాలని కోరాడు. ఆ మహిళ అతను పంపిన లింక్‌కు రేటింగ్ ఇచ్చింది. అనంతరం యూట్యూబ్‌లోని వీడియోస్‌పై ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభం వస్తాయని తెలిపాడు. దానితో మహిళ మొదట రూ.11 వేలు పెట్టుబడి పెట్టింది. దానికి లాభాలు పంపించడంతో..నమ్మకం కుదిరిన మహిళ పలు దఫాలుగా 44 లక్షల రూపాయల వరకు డబ్బులను ఇన్వెస్ట్ చేసింది. ఈ డబ్బులకు లాభాలు ఇవ్వకపోగా, ఇంకా ఇన్వెస్ట్ చేయాలని ఒత్తిడి చేయడంతో మోసపోయానని గ్రహించిన మహిళ సిటీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

అవగాహన ముమ్మరం...
ఓటు నమోదే లక్ష్యం!



ఓటు ఉందో లేదో తెలుసుకునే విధానాన్ని తెలియజేస్తున్న ఎన్నికల అధికారులు

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఓటరు అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. ఓటు నమోదుతో పాటు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

- ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం
- తప్పొప్పుల సవరణకు అవకాశాలు
- ఖైరతాబాద్‌లో పార్కులు రద్దీ ప్రాంతాల్లో పెరిగిన అవగాహన శిబిరాలు

బంజారాహిల్స్: ఈ నెల 21న ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. అనంతరం ఈ నెల 26, 27 తేదీల్లో యువత కోసం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికల సంఘం ప్రకటించిన 2023 జనవరి 1 నాటికి ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 2672 మంది అర్హులైన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకున్నారు.

- ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటరు శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ నెల 26, 27 తేదీల్లో కూడా నియోజక వర్గం పరిధిలోని 245 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు.
- 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని వారికి ఫారం–6 ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వెళ్ళిన వారు, మృతి చెందిన వారి పేరు తొలగించేందుకు ఫారం–7, జాబితాలో పేరు ఉండి సెల్‌ఫోన్ నెంబర్, ఇంటి నెంబర్, తల్లిదండ్రుల పేర్లతో పాటు తప్పొప్పులు సరిచేసుకునేందుకు ఫారం–8 బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉంటాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు. నమోదుకు వెళ్లేవారు తమ వెంట ఓ పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది.

సెప్టెంబర్‌లో మరోసారి...

- సెప్టెంబర్ 2, 3 తేదీల్లో కూడా ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. మరోసారి పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు. ఈ శిబిరాల్లో ఓటరు జాబితాను పరిశీలించుకొని తమ పేరు ఉందా లేదా అనేది చూసుకోవచ్చు.
- ఏదేని కారణంతో పేరు నమోదు కాకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం వచ్చిన దరఖాస్తులు పరిశీలించిన తర్వాత అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా విడుదల చేస్తారు.

అవగాహన కార్యక్రమాలు...

- ఓటరు జాబితాలో పేరు నమోదుతో పాటు తప్పొప్పుల సవరణకు అధికారులు అవకాశం కలిగించడంతో కొత్తగా ఓటరు జాబితాలో నమోదు కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.
- కొంత కాలంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఆరు డివిజన్లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.
- ఆన్‌లైన్‌లో ఓటు ఎలా నమోదు చేసుకోవాలో అవగాహన కలిగిస్తున్నారు. పార్కులు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియ మరి కొంతకాలం కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

చిన్నారులను ఎక్కడి నుంచి తెచ్చారు?

- చిన్నారులకు కల్లు తాగించి.. మత్తులో ఉండగా యాచన
- బెగ్గింగ్ చేయిస్తున్న ముఠా సూత్రధారి అరెస్టు
- పరారీలో మరో నలుగురు ముఠా సభ్యులు
- ఎక్కడి నుంచి వచ్చారనే అంశంపై ముమ్మర దర్యాప్తు
- వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్

బంజారాహిల్స్: చిన్న పిల్లలను తీసుకొచ్చి వారికి కల్లు తాగించి మత్తులో నిద్రపోయిన తర్వాత ప్రజల మనోభావాలను క్యాష్ చేసుకుంటూ బెగ్గింగ్‌కు పాల్పడుతున్నారని ఈ బెగ్గింగ్ ముఠా ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేసినట్లు వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ తెలిపారు. శనివారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, ఇన్‌స్పెక్టర్ పి.రవీంద్రప్రసాద్‌తో కలిసి మాట్లాడుతూ... గుల్బర్గా నుంచి 20కి పైగా కుటుంబాలు నగర కూడళ్లలో తిరుగుతూ యాచిస్తున్నాయని సాయంత్రం కాగానే వీరందరూ ప్యారడైజ్‌కు వెళ్లి అక్కడ కలుసుకుంటారని ఈ బెగ్గింగ్ ముఠా నిర్వాహకుడు అనిల్‌పవార్‌తో పాటు మరో నలుగురు వీరందరి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని తమ తనిఖీల్లో బయట పడిందన్నారు. ఒక్కో యాచకుడికి రూ. 200 చేతిలో పెట్టి మిగతా డబ్బంతా ఈ బెగ్గింగ్ ముఠా తీసుకుంటుందన్నారు. ప్రధాన సూత్రధారుడు అనిల్ పవార్‌ను అరెస్ట్ చేశారని ఆయన బావమరిది కాలేతో పాటు రాము, రఘు, ధర్మేందర్ పరారీలో ఉన్నారని తెలిపారు. వీరి నుంచి ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. నగరంలో 70కి పైగానే యాచక వృత్తిని చేస్తున్న కుటుంబాలు ఉన్నట్లుగా తేలిందని మరింత సమాచారం రాబడుతున్నామని తెలిపారు. ఈ పిల్లలు ఎవరు, ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, వీళ్లను కిడ్నాప్ చేసి తీసుకొచ్చారా అన్నది దర్యాప్తు చేస్తున్నామన్నారు. యాచకులను ఏరివేసే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఎక్కడైనా యాచకులు కనిపించినా, ఇలాంటి ముఠాలు చూసినా డయల్ 100కు ఫోన్ చేయాలని కోరారు.

సెక్టార్ల వారీగా సమగ్ర సమాచారం ఉండాలి



మాట్లాడుతున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్

ఫిలింనగర్: ప్రతి ఎస్‌ఐ తన సెక్టార్ పరిధిలో సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని... సెక్టార్ సమాచారం ఉంటేనే పౌరులకు మెరుగైన సేవలు అందించగలుగుతామని వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ పేర్కొన్నారు. శనివారం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సెక్టార్ ఎస్‌ఐలతో ఆయన సమావేశం అయ్యారు. సెక్టార్ల వారీగా సమాచార పుస్తకాన్ని పార్ట్–4 రూపంలో నిర్వహించాలన్నారు. విలేజ్ హిస్టరీ బుక్‌లాగా దీన్ని నమోదు చేయాలన్నారు. ప్రతి శనివారం సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఎస్‌ఐ తాజా తీర్పులను ఈ సమావేశాల్లో తెలియజేయాలన్నారు. దర్యాప్తు పురోగతిపై మరింత శ్రద్ధ చూపాలన్నారు. పౌరులకు సంతృప్తికరమైన సేవలు అందించే దిశలో మరింత చొరవ చూపాలని సూచించారు. ఇక నుంచి ప్రతి ఎస్‌ఐ వారానికి ఒకసారి తన పరిధిలోని కేసులు, దర్యాప్తులు, తదితర అంశాలపై తనకు తానే సమీక్ష నిర్వహించుకోవాలని డీసీపీ సూచించారు.

ఉత్సాహంగా 'ఐ ఓట్ ఫర్ షూర్'



5కే రన్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌సీ వెంకటేష్ దోత్రే



రన్‌లో పాల్గొన్న ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

బంజారాహిల్స్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కలిగించే నిమిత్తం శనివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఆధ్వర్యంలో »ఐ ఓట్ ఫర్ షూర్« 5కే రన్ నిర్వహించారు. ఓటు నమోదు, ఓటరు చైతన్య కార్యక్రమం పేరుతో ఏర్పాటు చేసిన ఈ రన్‌ను జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటు అనేది ప్రతి పౌరుడి వజ్రాయుధం అన్నారు. దీన్ని సక్రమంగా వినియోగించుకుంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుపై అవగాహన కలిగి.. దాన్ని సద్వినియోగం చేయడమే లక్ష్యంగా ఈ పరుగు నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అందుకే ఐ ఓట్ ఫర్ ష్యూర్ నేను తప్పనిసరిగా ఓటు వేస్తాను అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ఉండేందుకు ఓటరు జాబితాను పరిశీలన చేసుకోవాలని, తప్పులుంటే సవరించుకోవాలని అన్నారు. సర్కిల్–18 డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగ తెప్పోత్సవం

ఖైరతాబాద్: గంగపుత్రులు ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే గంగ తెప్పోత్సవం, గంగమ్మ బోనాల ఉత్సవాలను ఆదివారం నిర్వహించనున్నట్లు తెలంగాణ గంగ తెప్పోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు తుమ్మలబస్తీ ఏడుగుళ్ల నుంచి ఖైరతాబాద్, ఐమాక్స్ థియేటర్ మీదుగా హుస్సేన్ సాగర్ తీరంలోని గంగమ్మ ఆలయం వద్దకు చేరుకొని అక్కడ సాగర్‌లో గంగతెప్పను వదిలే కార్యక్రమం ఉంటుంది. ఈ ఊరేగింపు ఆద్యంతం వివిధ రకాల వేషధారణలు, మహిళలు సంప్రదాయ దుస్తులతో బోనాలతో గంగ తెప్పను ఊరేగిస్తూ సాగుతుందని అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పూస నర్సింహులు తెలిపారు.

త్వరలో ఫంక్షన్‌హాల్ ప్రారంభం

రహమత్‌నగర్: ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ త్వరలోనే ఉపయోగంలోని వస్తుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ స్పష్టం చేశారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని ఫంక్షన్ హాల్ పనులను ఆయన ఆదివారం పరిశీంచారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నాయకులు సుబ్బరాజు, దుబాయ్ నజీర్, జాఫర్ హుస్సేన్, కాసాల అరుణ్, జబ్బార్, గఫూర్, రవిశంకర్, షేక్ చోటు, ఫయాజ్, అర్షద్, వేముల జగన్, సమీనా తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఎస్‌పీలో కంటి పరీక్షలు

వెంగళరావునగర్: సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం అన్నారంటే కళ్ల ప్రాధాన్యత ఎంత ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని.. అంతటి ప్రాధాన్యం కల్గిన కళ్లను తరచూ పరీక్షించుకుంటూ సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ అన్నారు. యూసుఫ్‌గూడలోని టీఎస్‌ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ ప్రాంగణంలో శనివారం అగర్వాల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు, సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. డాక్టర్ అగర్వాల్స్ కంటి వైద్యశాల ప్రతినిధి డాక్టర్ దీపిక, రమ్య, సుప్రియ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫస్ట్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్లు కె.సుబ్రమణ్యం, టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు కె.పి.సత్యనారాయణ, బి.జవహర్‌లాల్, ఎ.నర్సింహరాజు, ఆర్‌ఐలు సురేష్, ధర్మారావు, సాంబయ్య, శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం, ఆర్‌ఎస్‌ఐలు, ఫస్ట్ బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

ప్రత్యేక పూజలు చేసిన సినీ దర్శకుడు బోయపాటి శ్రీను



అఘోర పాశుపత హోమంలో పాల్గొన్న బోయపాటి శ్రీను, చైర్మన్ దంపతులు

వెంగళరావునగర్: జీటీఎస్‌కాలనీలోని శ్రీవీరాంజనేయ భవానీశంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానం (జీటీఎస్ టెంపుల్)లో శ్రీభవానీశంకర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 9.30కు శ్రీభవానీ శంకరస్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం జరిగింది. 10.30 నుంచి ప్రారంభమైన అఘోర పాశుపత హోమం కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ దంపతులు, ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరై స్వామివారికి పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను చైర్మన్‌తోపాటు ఆలయ కమిటీ సభ్యులు సి.హెచ్.శ్రీనివాస్, జి.లక్ష్మి, కిలారు నరసింహారావు, కె.వెంకటేశ్వర్లు, ఇ.కె.సత్యనారాయణ, పి.స్రవంతి, ఎక్స్ అఫీషియో మెంబర్ డి.దేవేందర్‌శర్మ పర్యవేక్షించారు.

సప్తస్వరాల్లో ఓలలాడిన విద్యార్థులు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శనివారం బీవీబీపీ ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్చరల్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఇందులో భాగంగా అంతరించిపోతున్న కళలను నేటి తరానికి పరిచయం చేసే బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రుంజా అనే పరికరంపై సప్తస్వరాలు వాయించి కళాకారుడు నల్లగొండకు చెందిన రాంమూర్తి విశేషంగా ఆకట్టుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతా నాయర్ పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఘనంగా రోగి బర్త్‌డే

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలో రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి వైద్యవర్గాలు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం ట్రామా బ్లాక్ ఐదవ అంతస్తులోని ఏసీసీయూ వార్డులో ఈ వేడుకలు జరిగాయి. నిమ్స్ ఎస్సీఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు స్టాఫ్ నర్సు సుశీల ఆధ్వర్యంలో నందు(6) పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేయించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన నందు ఈ నెల 15వ తేదీన స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో వేగం వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. ఈ నెల16వ తేదీ నుంచి సర్వైకల్ సమస్యతో బాధపడుతున్న నందుకు నిమ్స్ న్యూరోసర్జరీ విభాగం వైద్యనిపుణులు డాక్టర్ వై.వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఆమెకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. పుట్టినరోజు వేడుకల్లో వైద్యులు, సిస్టర్స్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న సాయికుమార్

బంజారాహిల్స్: తెలంగాణ పద్మశాలీ యువజన సంఘం కార్యవర్గ సభ్యుడిగా పాశికంటి సాయికుమార్ నియమితులయ్యారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని జవహర్‌కాలనీకి చెందిన సాయికుమార్ కొంత కాలంగా పద్మశాలీయుల సంక్షేమం, అభ్యున్నతి కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు అఖిల భారత పద్మశాలి యువజన సంఘం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసులు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చినందుకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తల్వార్‌తో తిరుగుతున్న యువకుడి అరెస్టు

వెంగళరావునగర్: తల్వార్‌తో తిరుగుతున్న ఓ యువకుడితో పాటు అతని స్నేహితుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... బ్రహ్మశంకర్‌నగర్‌కు చెందిన పవన్‌కుమార్, కోటేష్‌లు శుక్రవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. పెట్రోలింగ్‌లో ఉన్న మధురానగర్ పోలీసులు వారిని ఆపి వివరాలు అడుగుతుండగా వారు పారిపోయారు. దాంతో పోలీసులు వెంబడించి ఇరువురిని పట్టుకున్నారు. తనిఖీ చేయగా పవన్‌కుమార్ వద్ద తల్వార్ లభించింది.

యువతిని మోసం చేసిన జబర్దస్త్ కమెడియన్

జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు

వెంగళరావునగర్: ప్రేమించానని నమ్మించి శారీరకంగా కలిసి అనంతరం తప్పించుకుని తిరుగుతున్న ప్రేమికుడిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. తొలుత ఈ యువకుడిపై గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు అయింది. కాగా ఆ ఎఫ్‌ఐఆర్‌ను మధురానగర్‌కు బదిలీ చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జబర్దస్త్ షోలో కమెడియన్‌గా ఉన్న నవ సందీప్ 2018లో ఓ యువతితో పరిచయం అయింది. వాట్సాప్‌లో చాటింగ్ చేస్తూ మరింత దగ్గర అయ్యాడు. విషయం అమ్మాయి ఇంట్లో తెలియడంతో కట్టడి చేశారు. కాగా ఆమెను నగరానికి రప్పించుకున్నాడు. తల్లిదండ్రులకు చెప్పకుండా షేక్‌పేటకు వచ్చి ఆల్ హమారా కాలనీలో నాలుగేళ్లుగా ఉంటుంది. ఈ క్రమంలో అతని ఆమెను అనేకమార్లు అమీర్‌పేటలోని ఓయో రూముకు తీసుకెళ్లి తన కోర్కెను తీర్చుకున్నాడు. అనంతరం పెళ్లి చేసుకోమని ఆమె అడగ్గా ముఖం చాటేసుకుని తప్పించుకుని తిరుగుతున్నాడు. దాంతో ఆమె తాను మోసపోయానని తెలుసుకుని గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ పోలీసులు అతనిపై జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి శనివారం మధురానగర్‌కు బదిలీ చేశారు.



స్వర్ణంతో పారిస్ ఒలింపిక్స్‌కు మేహులి

భారత యువ షూటర్ మేహులి ఘోష్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకంతో మెరిసింది. అజర్‌బైజాన్‌లోని బాకూలో జరుగుతున్న ఈ టోర్నీ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఆమె స్వర్ణం సాధించింది. 1895.9 స్కోరుతో మొదటి స్థానంలో నిలిచిన మేహులి తాజా ప్రదర్శనతో వచ్చే ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. మరో వైపు మేహులి, రమిత, తిలోత్తమ సేన్‌లతో కూడిన భారత జట్టు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. అయితే ఈ టోర్నీ ద్వారా ఒలింపిక్ కోటా వ్యక్తిగత ఈవెంట్లకు మాత్రమే పరిమితం. మరో వైపు స్కీట్ టీమ్ 14వ స్థానంలో నిలవగా, ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో టాప్-25లో భారత్‌నుంచి ఒక్క షూటర్ కూడా నిలవలేకపోయాడు.





ఆర్చరీలో 'డబుల్' ధమాకా

- మహిళల, పురుషుల కాంపౌండ్ జట్లకు స్వర్ణాలు
- వ్యక్తిగత ఈవెంట్‌లో జ్యోతికి కాంస్యం
- ప్రపంచకప్ ఆర్చరీ

పారిస్: భారత ఆర్చర్లు ప్రపంచకప్ స్టేజ్-4 ఈవెంట్‌లో పసిడి పంట పండించారు. కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలతో 'డబుల్' ధమాకా సాధించాయి. రికర్వ్ జట్లు కాంస్య పతకాలు గెలిచాయి. పురుషుల కాంపౌండ్ ఈవెంట్‌లో అభిషేక్ వర్మ, ఓజస్ ప్రవీణ్, ప్రథమేశ్ జౌకర్‌లతో కూడిన భారత జట్టు శనివారం జరిగిన ఫైనల్లో 236-232 స్కోరుతో క్రిస్ షాఫ్, జేమ్స్ లుజ్, సాయెర్ సలైవాన్‌లతో కూడిన అమెరికా జట్టుపై ఘన విజయం సాధించింది. మూడు రౌండ్లు ముగిసేసరికి ఇరు జట్లు సమంగా నిలవగా, కీలకమైన చివరి రౌండ్‌లో భారత్ పైచేయి సాధించింది. పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో సెమీస్‌లో ఓడిన భారత జట్టు కాంస్య పతక పోరులో స్పెయిన్ టీమ్‌పై గెలిచింది. ధీరజ్ బొమ్మదేవర, అతాను దాస్, తుషార్‌లతో కూడిన భారత్ 6-2తో స్పానిష్ టీమ్‌ను ఓడించి కాంస్యం గెలుచుకుంది. మహిళల రికర్వ్ టీమ్ విభాగంలో భజన్ కౌర్, అంకిత భకత్, సిమ్రాన్‌జీత్ కౌర్‌లు ఉన్న భారత త్రయం కాంస్య పతక పోరులో 5-4తో మెక్సికో జట్టుపై గెలిచింది.

అమ్మాయిల జట్టు పైచేయి

మహిళల కాంపౌండ్‌లో జ్యోతి సురేఖ, అదితి గోపీచంద్, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత బృందం 234-233తో మెక్సికో జట్టుపై గెలిచి పసిడి పతకం చేజిక్కించుకుంది. తొలి రౌండ్లో 59-59తో అండ్రియా బెకెరా, అనా సోఫియా, డాఫ్నె క్వింటెరోలతో కూడిన మెక్సికో జట్టుతో భారత్ స్కోరు సమంచేసింది. రెండో రౌండ్లో 59-58తో స్వల్ప ఆధిక్యం కనబరిచింది. 118-117 తో మూడో రౌండ్లోకి దిగిన భారత ఆర్చర్లు 57-59తో వెనుకబడ్డారు. 175-176తో ఆధిక్యం మెక్సికోవైపు మళ్లింది. ఈ దశలో నాలుగో రౌండ్‌పై దృష్టిపెట్టిన ఆర్చర్లు 59 స్కోరు చేస్తే... మెక్సికన్ అమ్మాయిలు 57 స్కోరే చేయడంతో పాయింట్ తేడాతో భారత్ (234-233) స్వర్ణ పతకం గెలుపొందింది.

జ్యోతి సురేఖ @ 50

ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ అంతర్జాతీయ పోటీల్లో పతకాల ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. ఈ టోర్నీకి ముందు 48 పతకాలు సాధించిన ఆమె శనివారం కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. అనంతరం వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం గెలుచుకోవడంతో 50వ పతకం ఆమె ఖాతాలో చేరింది. సెమీస్‌లో ఓడిన ఆమె మూడో స్థానం కోసం కొలంబియాకు చెందిన సారా లోపెజ్‌తో తలపడింది. స్కోరు 146-146తో సమం కాగా, షూటాఫ్‌లోనూ 10-10తో సమంగా నిలిచారు. అయితే లక్ష్యబిందువుకు అతి సమీపంగా కచ్చితత్వంతో కూడిన బాణాలు సంధించిన జ్యోతినే విజేతగా ప్రకటించడంతో కాంస్యం లభించింది. జ్యోతి సురేఖ వివిధ అంతర్జాతీయ టోర్నీల్లో కలిపి గెలిచిన మొత్తం 50 పతకాల్లో 17 స్వర్ణాలు, 18 రజతాలు, 15 కాంస్యాలున్నాయి.

నిరాశపరిచిన అవినాశ్ సబ్లే

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



బుడాపెస్ట్ (హంగేరీ): ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాడు అవినాశ్ సబ్లే నిరాశాజనక ప్రదర్శన నమోదు చేశాడు. పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో అతను కనీసం ఫైనల్‌కు కూడా అర్హత సాధించలేకపోయాడు. 8 నిమిషాల 22.24 సెకన్ల పేలవమైన టైమింగ్ నమోదు చేసిన అతను హీట్స్‌లోనే ఏడో స్థానంలో నిలిచి పోటీనుంచి తప్పుకున్నాడు. గత రెండు వరల్డ్ చాంపియన్‌షిప్‌లలోనూ ఫైనల్ చేరిన అవినాశ్‌నుంచి ఈ సారి అంతకంటే మెరుగైన ప్రదర్శన ఆశించగా, అతను పూర్తిగా విఫలమయ్యాడు. మహిళల లాంగ్‌జంప్‌లో తొలిసారి వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న శైలీ సింగ్ కూడా ఎటువంటి ప్రభావం చూపలేకపోయింది. గ్రూప్ 'బి' క్వాలిఫయింగ్‌లో 14వ స్థానంలో నిలిచింది. అత్యుత్తమంగా 6.40 మీటర్లు జంప్ చేసిన శైలి ఓవరాల్‌గా 24వ స్థానంతో ముగించి ఫైనల్ చేరడంలో విఫలమైంది. పురుషుల 20 కిలోమీటర్ల నడకలో కూడా ముగ్గురు భారత అథ్లెట్లు నిరాశాజనక ప్రదర్శన నమోదు చేశారు. 50 మంది పాల్గొన్న ఈ పోటీలో వికాశ్ సింగ్ 27వ, పరంజీత్ సింగ్ 35వ, ఆకాశ్‌దీప్ సింగ్ 47వ స్థానాల్లో నిలిచారు.

ఇవే ప్రపంచకప్ మస్కట్‌లు!



దుబాయ్: వన్డే వరల్డ్ కప్ ప్రచార కార్యక్రమాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఉధృతం చేసింది. ఇందులో భాగంగా టోర్నీ 'మస్కట్'లను ప్రకటించింది. శనివారం న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత కెప్టెన్లు షఫాలీ వర్మ, యశ్ ధుల్ పాల్గొన్నారు. పురుష క్యారెక్టర్‌ను బ్యాటర్‌గా, మహిళా క్యారెక్టర్‌ను బౌలర్‌గా చూపిస్తూ ఐసీసీ ఒక వీడియో విడుదల చేసింది. అయితే వీటికి అధికారికంగా ఐసీసీ పేర్లు పెట్టలేదు. ఇందుకు అభిమానులు ఆగస్టు 27లోగా ఓటింగ్ చేయాలని కోరుతూ ఒక్కో క్యారెక్టర్‌కు 3 ఆప్షన్‌లను ఇచ్చింది. బ్యాటర్ మస్కట్ కోసం టాంక్, బాష్, బ్లిట్జ్‌లలో ఒకదానిని, బౌలర్ మస్కట్ కోసం బ్లేజ్, విక్స్, ఫైరా అనే పేర్లలో ఒకదానిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 5నుంచి భారత్‌లో వరల్డ్ కప్ జరుగుతుంది.

ప్రజ్ఞానంద తొలి గేమ్ 'డ్రా'

ప్రపంచ కప్ చెస్ సెమీస్



బాకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ సెమీఫైనల్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద ఆత్మవిశ్వాసంతో ప్రారంభించాడు. ఫాబియనో కరువానా (అమెరికా)తో జరిగిన సెమీస్ తొలి గేమ్‌ను ప్రజ్ఞానంద 78 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ప్రత్యర్థికి పలు మార్లు మెరుగైన అవకాశాలు వచ్చినా... చివరి వరకు పోరాడిన అతను ఓటమినుంచి తప్పించుకోగలిగాడు. శనివారం నల్లపావులతో ఆడి కరువానాను నిరోధించగలిగిన భారత కుర్రాడు ఆదివారం తెల్ల పావులతో ఆధిక్యం ప్రదర్శించగలిగితే ఫైనల్ చేరే అవకాశాలు మెండుగా ఉంటాయి. మరో సెమీస్‌లో వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ తన స్థాయిని ప్రదర్శించాడు. స్థానిక ఆటగాడు నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)తో జరుగుతున్న ఈ పోరులో తొలి గేమ్‌ను అతను 43 ఎత్తుల్లో గెలుచుకున్నాడు. శనివారం తన రెండో గేమ్‌ను కార్ల్‌సన్ 'డ్రా' చేసుకోగలిగినా ఫైనల్లోకి అడుగు పెడతాడు.

సిరీస్‌పై భారత్ కన్ను

- ఒత్తిడిలో ఐర్లాండ్
- నేడు రెండో టి20
- రా.గం.7.30 నుంచి 'స్పోర్ట్స్ 18'లో ప్రత్యక్ష ప్రసారం



జట్లు (అంచనా)

భారత్.. బుమ్రా (కెప్టెన్), యశస్వి, రుతురాజ్, తిలక్ వర్మ, సామ్సన్, రింకూసింగ్, దూబే, సుందర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, ప్రసిధ్ కృష్ణ.

ఐర్లాండ్.. స్టిర్లింగ్ (కెప్టెన్), బల్బిర్నీ, టక్కర్, టెక్టర్, క్యాంపర్, డాక్‌రెల్, మార్క్ అడైర్, మెకార్తీ, యంగ్, జోష్ లిటిల్, బెన్‌వైట్.

డబ్లిన్: ఐర్లాండ్ పర్యటనలో శుభారంభం చేసిన భారత జట్టు మరో విజయంతో సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. నేడు జరిగే రెండో టి20లో ఐర్లాండ్‌పై గెలుపే లక్ష్యంగా బుమ్రా సేన బరిలోకి దిగుతోంది. వాన అడ్డుకున్న గత మ్యాచ్‌లో మన బౌలర్లు తమను తాము నిరూపించుకున్నారు. ముఖ్యంగా చాన్నాళ్ల తర్వాత మైదానంలోకి దిగిన సీనియర్ సీమర్ బుమ్రా మునుపటి వాడితో అదరగొట్టాడు. ప్రసిధ్ కృష్ణ, స్పిన్నర్ రవి బిష్ణోయ్ కూడా సత్తా చాటారు. ఇప్పుడు బ్యాటర్ల వంతు వచ్చింది. ఈ మ్యాచ్‌లో కుర్రాళ్లకు చక్కని బ్యాటింగ్ అవకాశమివ్వాలనుకుంటే మాత్రం భారత్ టాస్ గెలిస్తే బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. ఓపెనింగ్‌లో యశస్వి జైస్వాల్ ఉన్నంత సేపు బాగానే ఆడాడు. రుతురాజ్ మెరుగనిపించాడు. కానీ కరీబియన్ పర్యటనలో అందరికంటే బాగా ఆడిన తెలుగుతేజం తిలక్‌వర్మ డకౌట్ కావడం కాస్త నిరాశపరిచింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాదీ బ్యాటర్ చెలరేగితే స్కోరు బోర్డు ఉరకలెత్తడం ఖాయం. అనుభవజ్ఞులేకపోయినా... భారత జట్టులోని ఆటగాళ్లందరికి ఐపీఎల్‌లో మెరిపించిన అనుభవం ఎంతో ఉంది. కాబట్టి వరుస విజయం, సిరీస్ కైవసం ఏమంత కష్టం కాకపోవచ్చు.

గెలిపించేదెవరు..?

మరోవైపు ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య జట్టు సిరీస్‌లో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో గెలవక తప్పదు. టాపార్డర్‌లో బల్బిర్నీ, కెప్టెన్ స్టిర్లింగ్, టకర్ బాధ్యత కనబరిస్తేనే ప్రత్యర్థికి దీటైన స్కోరు చేయొచ్చు. లేదంటే తొలి టి20లాగే ఓ మోస్తరు స్కోరుకే పరిమితమయ్యే ప్రమాదముంది. బౌలింగ్‌లో యంగ్ వైవిధ్యమైన బంతులతో భారత్‌ను కంగారు పెట్టించాడు. జోష్ లిటిల్, మార్క్ అడైర్‌లు కూడా నిలకడగా బౌలింగ్ చేస్తే భారత కుర్రాళ్ల జట్టును ఇబ్బంది పెట్టవచ్చు. ఆదివారం వాన ముప్పు లేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం.

కింగ్స్, లయన్స్ విజయాలు

ఆంధ్ర ప్రీమియర్ లీగ్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో రాయలసీమ కింగ్స్ మరో విజయాన్ని అందుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో కింగ్స్ 5 వికెట్ల తేడాతో బెజవాడ టైగర్స్‌ను ఓడించింది. ముందుగా టైగర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. మహీప్ కుమార్ (44 బంతుల్లో 59; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ చేయగా, అభినవ్ (35 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం కింగ్స్ 19 ఓ వర్లలో 7 వికెట్లకు 153 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోగటం రెడ్డి (39 బంతు ల్లో 61; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆ డాడు. మరో మ్యాచ్‌లో ఉత్తరాంధ్ర లయన్స్ 3 వికెట్లతో కోస్టల్ రైడర్స్‌పై విజయం సాధించింది. రైడ ర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు చేసింది. మద్దిల వర్ధన్ (37 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జి. చిరంజీవి (23 బంతుల్లో 38 నాటౌ ట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ఆ తర్వాత లయన్స్ 17.3 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులు సాధించింది. కెప్టెన్ శ్రీకర్ భరత్ (22 బంతుల్లో 54; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో జట్టును గెలిపించాడు.


సినిమా

క్షణ క్షణం భయం.. భయం

హారర్ చిత్రాలంటే వెన్నులోంచి టెర్రర్ పుట్టాల్సిందే. అలా క్షణ క్షణం భయపడుతూ హారర్ చిత్రాలు చూడటంలో చాలా మందికి ఓ కిక్ దొరుకుతుంది. ఆ భయమే వసూళ్ల వర్షం కురిపిస్తుంది. ఇప్పుడలా థియేటర్లలో ప్రేక్షకులను భయపెట్టి, వసూళ్లు రాబట్టడానికి కొందరు హారర్ చిత్రాలు చేస్తున్నారు. ఆ చిత్రాలేంటో తెలుసుకుందాం.

భ్రమ యుగంలో...

సుదీర్ఘమైన కెరీర్‌లో ఎన్నో రకాల సినిమాల్లో నటించారు మమ్ముట్టి. ఈ ప్రయాణంలో పొలిటికల్, థ్రిల్లర్, హారర్, సస్పెన్స్.. ఇలా ఎన్నో జానర్స్‌ను టచ్ చేశారాయన. తాజాగా 'భ్రమయుగం' అనే హారర్ ఫిల్మ్‌లో మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కేరళలోని చీకటి యుగాల నేపథ్యంలో సాగే కథతో రాహుల్ సదా శివన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో ఏక కాలంలో వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది.


మమ్ముట్టి

హారర్ రాజా

లవ్, కామెడీ, ఫ్యామిలీ డ్రామాలతో సాగే చిత్రాలు చేస్తున్నప్పటికీ ఎక్కువగా యాక్షన్ చిత్రాల్లోనే నటిస్తారు ప్రభాస్. అయితే తొలిసారి ప్రభాస్ హ్యూమర్‌తో కూడిన హారర్ అంశాలు ఉండే ఓ సినిమాలో నటిస్తున్నారు. మారుతి ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రానికి 'రాజా డీలక్స్', 'వింటేజ్ కింగ్', 'అంబాసిడర్' అనే టైటిల్స్ తెరపైకి వచ్చాయి. ఈ చిత్రం షూటింగ్ సగానికి పైగా పూర్తయిందని సమాచారం. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఓ కీ రోల్‌లో సంజయ్ దత్ నటిస్తున్నారని తెలిసింది. ఈ సినిమా టైటిల్, రిలీజ్‌లపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.


సందీప్ కిషన్

చంద్రముఖి తిరిగొస్తే..

హారర్ జానర్‌ను ఇష్టపడే ప్రేక్షకులు 'చంద్రముఖి'ని అంత సులభంగా మర్చిపోలేరు. వెంకటపతి రాజుగా రజనీకాంత్, చంద్రముఖిగా జ్యోతిక వెండితెరపై ప్రదర్శించిన నటన అలాంటిది. ఇప్పుడు 'చంద్రముఖి' మళ్లీ వస్తోంది. కానీ రజనీ, జ్యోతికలు రావడం లేదు. 'చంద్రముఖి' సినిమాకు సీక్వెల్‌గా రూపొందిన 'చంద్రముఖి 2'లో రజనీ, జ్యోతికల స్థానాల్లో రాఘవా లారెన్స్, కంగనా రనౌత్ నటించారు. 'చంద్రముఖి'ని డైరెక్ట్ చేసిన పి. వాసుయే 'చంద్రముఖి 2'ని తెరకెక్కించారు. ఈ చిత్రం సెప్టెంబరు 15న రిలీజ్ కానుంది.


రవిబాబు


ప్రభాస్

భైరవకోనలో ఏం జరిగింది?

'ఎక్కడికి పోతావు చిన్నవాడా'తో ప్రేక్షకులను భయపెడుతూ, కథలో వీలైనప్పుడు నవ్వించారు దర్శకుడు వీఐ ఆనంద్. తాజాగా ఈ దర్శకుడు తెరకెక్కిస్తున్న సినిమా 'ఊరు పేరు భైరవకోన'. ఇందులో సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్నారు. వర్ష బొల్లమ్మ హీరోయిన్. ఈ సినిమా మేజర్ షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రంలో హారర్ అండ్ సస్పెన్స్ అంశాలు పుష్కలంగా ఉన్నట్లు ఇటీవల విడుదలైన టీజర్ స్పష్టం చేస్తోంది. భైరవకోన అనే ఊర్లో జరిగే కొన్ని కల్పిత ఘటనల సమాహారంగా ఈ సినిమా కథనం సాగనున్నట్లుగా తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయనున్నారు.


కంగనా రనౌత్

మంత్రం.. తంత్రం..

ప్రస్తుతం తెలుగులో ఫుల్ బిజీగా ఉన్న తెలుగు కథానాయికల్లో అనన్య నాగళ్ల ఒకరు. అరడజనుకు పైగా సినిమాలు చేస్తున్న ఈ బిజీ అమ్మాయి లిస్ట్‌లో 'తంత్ర' అనే ఓ హారర్ ఫిల్మ్ కూడా ఉంది. తాంత్రిక శాస్త్రం, పురాణ గాథల నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని ఈ చిత్ర దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి పేర్కొన్నారు. ధనుష్ (దివంగత నటుడు శ్రీహరి తమ్ముడు కొడుకు) నటుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో సలోని ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు.

ఓ మంచి దెయ్యం

'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ప్రేమకథా చిత్రమ్ 2'.. ఇలా హీరోయిన్ నందితా శ్వేతకు హారర్ జానర్‌లో నటించిన అనుభవం ఉంది. ఈ క్రమంలో నందితా శ్వేత చేసిన మరో హారర్ ఫిల్మ్ 'ఓఎమ్‌జీ'. 'ఓ మంచి ఘోస్ట్' ఉపశీర్షిక. 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ఈ సినిమాలో ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. మార్తాండ్ కె. శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది. మరి.. మంచి దెయ్యంగా నందితా శ్వేత ఏ రేంజ్‌లో భయపెడతారో చూడాలి.

కేరాఫ్ దెయ్యం

గ్రామాల్లో ఒకప్పుడు మాతంగులుగా జీవించిన వారి జీవితాల ఆధారంగా రూపొందుతున్న హారర్ ఫిల్మ్ 'భయం కేరాఫ్ దెయ్యం'. ఈ చిత్రంలో ఓ మాతంగిగా రమ్య, మాంత్రికుడిగా రవిబాబు, తాంత్రికుడిగా సత్యప్రకాష్ నటిస్తున్నారు. సీవీఎమ్ వెంకట రవీంద్రనాథ్ దర్శకత్వంలో తెలుగు, కన్నడ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది.

తంతిరం

హారర్ అంశాలతో కూడిన కుటుంబ కథాచిత్రం 'తంతిరం'. భార్యాభర్తల మధ్య ఒక ఆత్మ ప్రవేశిస్తే వారి దాంపత్య జీవితం ఎలా ప్రభావితం అవుతుందనేది ఈ సినిమా కథాంశం. మెహర్ దీపక్ దర్శకుడు. ఈ సినిమా మేజర్ షూటింగ్ కేరళలో జరి గింది. శ్రీకాంత్, ప్రియాంక లీడ్ రోల్స్ చేశారు. త్వరలో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

ఈ చిత్రాలే కాదు.. హారర్ జానర్‌లో ప్రేక్షకులను భయపెట్టే మరికొన్ని చిత్రాలు కూడా ఉన్నాయి.


'ఓఎమ్‌జీ' పోస్టర్


'తంతిరం' పోస్టర్


అనన్య నాగళ్ల

ప్రతి ఒక్కరూ జెంటిల్‌మేన్ అవ్వాలి


- కుంజుమోన్


కీరవాణి, కుంజుమోన్

ముప్పైఏళ్ల క్రితం అర్జున్ హీరోగా శంకర్ దర్శకత్వంలో కేటీ కుంజుమోన్ నిర్మించిన 'జెంటిల్ మేన్' సంచలన విజయం సాధించింది. ఆ తర్వాత నిర్మించిన 'ప్రేమ దేశం', 'రక్షకుడు' వంటివి కూడా భారీ బడ్జెట్ చిత్రాలే. చాలా గ్యాప్ తర్వాత కుంజుమోన్ 'జెంటిల్ మేన్ 2'కి శ్రీకారం చుట్టారు. చేతన్ శ్రీను హీరోగా గోకుల్‌కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం చెన్నైలో జరిగింది. ఈ వేడుకలో తమిళనాడు సమాచార, ప్రసార, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖా మంత్రి ఎల్. మురుగన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆస్కార్ అవార్డ్ గ్రహీత ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతదర్శకుడు. ఈ వేదికపై కీరవాణిని సన్మానించారు కుంజుమోన్. ''ప్రతి ఒక్కరూ జెంటిల్‌మేన్ అవ్వాలి అనేది ఈ చిత్రం ప్రధానాంశం'' అన్నారు కుంజుమోన్.

ఫన్ అండ్ ఎనర్జిటిక్

- సుప్రియ


అనురాగ్, రష్మి, శరత్, నితిన్ కృష్ణమూర్తి, సుప్రియ

ప్రజ్వల్ బీపీ, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స, తేజస్ జయన్న ఉర్స్ ప్రధాన పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'. నితిన్ కృష్ణమూర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 21న రిలీజై, సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను 'బాయ్స్ హాస్టల్' పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ తెలుగులో ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నాయి. ఈ సందర్భంగా 'బాయ్స్ హాస్టల్' ట్రైలర్‌ను 'బేబీ' చిత్ర యూనిట్ విడుదల చేసింది. దర్శకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ– ''కన్నడంలో విజయం సాధించిన ఈ సినిమాను తెలుగులోనూ ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''ట్రైలర్ ఫన్ అండ్ ఎనర్జిటిక్‌గా అనిపించి, తెలుగులో విడుదల చేయాలని భావించాం'' అన్నారు సుప్రియ. ''బాయ్స్ హాస్టల్' క్రేజీ ఫిల్మ్'' అన్నారు నిర్మాతలు శరత్, అనురాగ్.


రెజీనా

నేనే నా... థ్రిల్

పురాతన వస్తువులను వెలికి తీసే పని మీద ఉంటుంది ఆమె. ఎందుకంటే ఆమె పురావస్తు శాస్త్రవేత్త. వృత్తిలో భాగంగా పరిశోధనలు చేస్తున్నప్పుడు అనుకోని విధంగా కొన్ని ఘటనలు ఎదురవుతాయి. ఆ తర్వాత ఏం జరిగింది? అనే సస్పెన్స్‌కి సమాధానం 'శూర్పణగై' సినిమా. 'జాంబిరెడ్డి' సినిమాతో హిట్ అందుకున్న ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్ పై తెరకెక్కిన ఈ చిత్రం తెలుగులో 'నేనే నా' పేరుతో విడుదల కానుంది. అక్షర గౌడ, అలీ ఖాన్, జై ప్రకాష్ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ''1920, ప్రస్తుతం.. ఇలా రెండు విభిన్న కాలాల నేపథ్యంలో ఫ్యాంటసీ అడ్వంచరస్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది.

ఆయన నా బ్రెయిన్‌ని మార్చేశారు

- దర్శకుడు క్లాక్స్




కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. క్లాక్స్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రవీంద్ర బెనర్జీ ముప్పానేని (బెన్నీ) నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో క్లాక్స్ మాట్లాడుతూ– ''భీమవరం దగ్గర భీమడోలు నా స్వస్థలం. నా అసలు పేరు ఉద్దరాజు వెంకట కృష్ణ పాండురంగ రాజు. వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేసి, ఆ తర్వాత సినిమాలపై ఆసక్తితో ఇండస్ట్రీలోకి వచ్చాను. రామ్‌గోపాల్ వర్మ, సుధీర్ వర్మ, దేవ కట్టా గార్ల దగ్గర దర్శకత్వ శాఖలో పని చేశాను. రామ్‌గోపాల్ వర్మగారు నా బ్రెయిన్‌ను మార్చేశారు. అప్పటివరకూ సినిమా అంటే సైన్స్ అని భావించిన నేను మూవీ అంటే ఓ ఆర్ట్ ఫార్మ్ అని అర్థం చేసుకున్నాను. రేపనేది లేదని తెలిస్తే మన గురించి సమాజం ఏమనుకుంటుందో అని మనం పట్టించుకోం. ఇలా చెప్పేలా హాలీవుడ్ ఫిల్మ్ 'సెవెన్ సమురాయ్'లో ఓ డైలాగ్ ఉంది. అదే సమయంలో 'యుగాంతం 2012' సినిమా వచ్చింది. ఈ రెండు అంశాల ప్రేరణతో 'బెదురులంక 2012' కథ రాశాను. కార్తికేయకి కథ చెప్పగా ఓకే అన్నారు. అలాగే కథను సరిగ్గా అర్థం చేసుకున్న బెన్నీగారు కూడా సపోర్ట్ చేశారు. ఈ కథలో డ్రామా, హాస్యం, అంతర్లీనంగా సందేశం ఉన్నాయి. మణిశర్మగారితో వర్క్ చేయడం ఓ మంచి అనుభూతి'' అన్నారు.

మ్యాన్ ✗ వైల్డ్



➤ ప్రపంచంలోనే అత్యంత వేగంగా పరుగెత్తేవారు.. అత్యంత వేగంగా ఈదగలిగేవారు.. అలుపు లేకుండా కిలోమీటర్ల కొద్దీ పరుగులు తీసే సమర్థులు.. ఒక్క అంగలో మీటర్ల కొద్దీ దూరాన్ని లంఘించగలిగేవాళ్లు.. ఇలా అందరూ హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో దిగిపోయారు.. శనివారం ప్రారంభమైన వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సత్తా చూపించడానికి సిద్ధమైపోయారు.
అవునూ.. ఎప్పుడూ మనలో మనం పోటీ పడటమేనా..
ఓసారి సరదాగా జంతువులతో పోటీ పడి చూస్తే.. అలాంటి చాంపియన్‌షిప్ ఒకటి పెడితే.. మనకు పతకాలు వస్తాయా? లేక అన్ని అవే ఎగరేసుకుపోతాయా? చూద్దామా మరి..



- సాక్షి సెంట్రల్ డెస్క్

అమెరికా ఫార్మ్ ప్రోగ్రెస్ షోకు మంత్రి సింగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో జరగనున్న ప్రతిష్టాత్మక ఫార్మ్ ప్రోగ్రెస్ షో (వ్యవసాయ ప్రగతి ప్రదర్శన)కు హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆహ్వానం అందింది. ఈనెల 29 నుంచి 31 వరకు అమెరికాలోని ఇల్లినాయిస్ డెకాటూర్‌లో ఈ ప్రదర్శన జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవ సా య పరిశ్రమలో అధునాతన వ్యవసాయోత్పత్తులు, సాంకేతికతలు, వ్యవసాయ రసాయనాలు, పరికరాలు, విత్తన సాంకేతికతలపై ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ''పదేళ్లకాలంలో తెలంగాణ వ్యవసాయ రంగ స్వరూపం సంపూర్ణంగా మారిపోయింది. ఈ రంగంలో కూలీల కొరత, నకిలీ విత్తనాలు, పెరుగుతున్న పెట్టుబడులు ప్రధాన సమస్యగా ఉన్న తరుణంలో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు చాలా కీలకమని'' మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



సదస్సు తేదీలను ప్రకటిస్తున్న మంత్రి కేటీఆర్, జయేశ్ రంజన్ తదితరులు

వచ్చే ఫిబ్రవరిలో 21వ బయో ఏసియా సదస్సు

హైదరాబాద్ వేదికగా ఫిబ్రవరి 26–28 వరకు నిర్వహణ
ప్రకటించిన ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బయో ఏసియా 21వ వార్షిక సదస్సు తేదీలను ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ శనివారం ప్రకటించారు. హైదరాబాద్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న ఈ సదస్సు వచ్చే ఏడాది ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో జరుగుతుందన్నారు. 'డేటా అండ్ ఏఐ–రీడిఫైనింగ్ పాజిబిలిటీస్'అనే నినాదంతో ఈ సదస్సు జరుగుతుందని కేటీఆర్ వెల్లడించారు. హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ రంగాల్లో భవిష్యత్‌లో డేటా ఆధారిత సాంకేతికత, కృత్రిమ మేధస్సు పోషించే పాత్రపై 2024 బయో ఏసియా సదస్సులో చర్చిస్తారన్నారు. అన్ని రంగాల్లో డిజిటల్ ఆవిష్కరణల ఫలితాల ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో టెక్నాలజీ, లైఫ్‌సైన్సెస్ సంగమం ద్వారా అద్భుత ఫలితాలు సాధించే అవకాశముందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆరోగ్యరక్షణ రంగంలో ఆవిష్కరణ శకం నడుస్తున్న ప్రస్తుత సమయంలో బయో ఏసియా సదస్సుకు అత్యంత ప్రాధాన్యం ఉందని కేటీఆర్ వెల్లడించారు. ప్రగతిభవన్‌లో బయో ఏసియా తేదీల ప్రకటన కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే వివేకానంద, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు మన్నె క్రిశాంక్, పాటిమీది జగన్మోహన్‌రావు, వై.సతీశ్‌రెడ్డి, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా పర్యటనకు కేటీఆర్

సుమారు వారంపాటు టూర్ షెడ్యూల్
న్యూయార్క్, షికాగోలో పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ
కుమారుడి అండర్‌గ్రాడ్యుయేషన్ అడ్మిషన్‌కు కూడా హాజరు

సాక్షి, హైదరాబాద్: సుమారు వారంపాటు కొనసాగే అమెరికా పర్యటనకు మంత్రి కేటీఆర్ శనివారం రాత్రి బయలుదేరి వెళ్లారు. షెడ్యూల్‌కు అనుగుణంగా పెట్టుబడులను ఆహ్వానించడానికి సంబంధించిన సమావేశాల్లో కేటీఆర్ పాల్గొంటారు. పర్యటనలో భాగంగా న్యూయార్క్, షికాగో వంటి ప్రధాన నగరాల్లో వివిధ రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులతో ఆయన భేటీ అవుతారు. కేటీఆర్‌తోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ అధికారుల బృందం, పలు విభాగాల డైరె క్టర్లు కూడా ఈ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. కాగా, పర్యటన తొలి అంకంలో పెట్టుబడులకు సంబంధించిన సమావేశాలకు హాజరయ్యే కేటీఆర్ ఆ తర్వాత కుటుంబసభ్యులతో కలిసి పర్యటన కొనసాగిస్తారు. కేటీఆర్ కుమారుడు హిమా న్షుకు ఇప్పటికే అమెరికాలోని ఓ ప్రముఖ యూనివర్సిటీలో అడ్మిషన్ ఖరారైంది. హిమాన్షు అడ్మిషన్ కార్యక్రమంలో కుటుంబంతో కలిసి కేటీఆర్ హాజరవుతారు. అమెరికా పర్యటనను ముగించుకుని ఆయన ఈ నెలాఖరుకు తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

నాలో కొంత భాగాన్ని తీసుకెళ్తున్నట్లు ఉంది...

'బహుశా ఇది అందరు తల్లిదండ్రులు చెప్పే మాటలే కావచ్చు. నిన్నటి వరకు అల్లరి పిల్లాడిలా సందడి చేసిన అబ్బాయి కాలేజీకి వెళ్లేంత పెద్దోడయ్యాడు. తను వెళ్తూ నాలో కొంత భాగాన్ని తీసుకెళ్తున్నట్లు ఉంది. తండ్రిగా నా విధుల కోసం కుటుంబంతో కలిసి అమెరికా వెళ్తున్నా. వారం రోజులపాటు అటు కుటుంబం, ఇటు అధికారిక కార్యకలాపాలను కలగలిపి గడపబోతున్నా'అని కేటీఆర్ తన కుమారుడిని ఉద్దేశించి ట్వీట్ చేశారు.

26న కోటి మొక్కలు నాటే కార్యక్రమం

మంచిరేవుల ఫారెస్టు రేక్ పార్కులో నాటనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 26న స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా రంగారెడ్డి జిల్లా మంచిరేవుల ఫారెస్ట్ రేక్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమంలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు పాల్గొంటారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం మంచిరేవుల గ్రామాన్ని సీఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 26న కోటి మొక్కలు నాటే కార్యక్రమం జరగనుందని తెలిపారు.

అమెరికా వర్సిటీల్లో అడ్మిషన్లు ఎలా?



వీసా ఎలా దరఖాస్తు చేసుకోవాలి.. ఇంటర్వ్యూకు ఎలా సన్నద్ధం కావాలి?
సాక్షి టీవీ, సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం..
పాల్గొన్న అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా చీఫ్ ఎమ్మి, యూఎస్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రాంతీయ అధికారి సుజనా మైరెడ్డి

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో విద్యాభ్యాసంకోసం వెళ్లాలనుకునే విద్యార్థుల కోసం యూఎస్ కాన్సులేట్ పలు సూచనలు చేసింది. అమెరికాలో చదువు, ఆపై ఉద్యోగం కోసం తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతీ సంవత్సరం వేలాది మంది విద్యార్థులు వెళ్తున్న విషయం విదితమే. అమెరికా వెళ్లే విద్యార్థులు ఆయా యూనివర్సిటీల్లో అడ్మిషన్లు ఎలా పొందాలి? యూనివర్సిటీల ఎంపిక ఎలా? వీసా దరఖాస్తు ఎలా చేసుకోవాలి? వీసా ఇంటర్వ్యూలకు ఎలా సన్నద్ధం కావాలన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి 'సాక్షి టీవీ, సాక్షి ఎడ్యుకేషన్.కామ్'శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్, నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా చీఫ్ ఎమ్మి, యూఎస్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రాంతీయ అధికారి సుజనా మైరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లార్సెన్ మాట్లాడుతూ, అమెరికాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వారిలో తెలుగువారు కూడా ఉన్నారని, అమెరికాలో చదువుకుని స్థిరపడే వారి సంఖ్య ఏటా పెరుగుతోందని ఆమె వివరించారు.

వీసాల మంజూరులో...

యూఎస్ వెళ్లే వారికి వీసా మంజూరులో ఆలస్యమవుతోందన్న ప్రశ్నకు నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా చీఫ్ ఎమ్మి సమాధానమిస్తూ వీసాల జారీని సులభతరం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వారికి అనుకున్న సమయంలోనే వీసా ప్రక్రియను పూర్తి చేస్తున్నామని చెప్పారు. స్లాట్లు విడుదలకాగానే బుక్ చేసుకోవాలని, వీసాకు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధ్రువపత్రాలు చెక్ చేసిన తర్వాత, ఫింగర్‌ప్రింట్స్‌ను నమోదు చేసి, అన్ని సక్రమంగా ఉన్నాయని చెక్ చేసిన వెంటనే వీసాను మంజూరు చేస్తున్నామని వివరించారు. వీసా స్లాట్ల బుకింగ్ కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటంపై స్పందిస్తూ.. దేశవ్యాప్తంగా నాలుగు యూఎస్ కాన్సులేట్స్‌లో అందుబాటులో ఉన్న స్లాట్ల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని చెప్పారు.

ఉచితంగా ఎడ్యుకేషన్ ఫెయిర్..

అమెరికాలో చదవాలనే విద్యార్థులకు ఉచితంగా 'స్టడీ ఇన్‌ద యూఎస్ యూనివర్సిటీ ఫెయిర్'నిర్వహిస్తున్నట్లు యూఎస్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ రీజనల్ ఆఫీసర్ సుజనా మైరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని నొవాటెల్ కన్వెన్షన్‌లో ఆగస్టు 26 ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఫెయిర్ నిర్వహిస్తామని, విద్యార్థుల అనుమానాలన్నింటినీ ఉచితంగా నివృత్తి చేసుకోవచ్చని వివరించారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.యూఎస్ఐఈఎఫ్.ఓఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు. అమెరికాలో 4,700 యూనివర్సిటీలు ఉన్నాయని, 26న నిర్వహించే ఫెయిర్‌కు 40 ప్రముఖ యూనివర్సిటీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రశ్నలకు యూనివర్సిటీ ప్రతినిధులు సమాధానమిస్తారన్నారు.

ఫేక్ వర్సిటీల వివరాలు ఎలా కనుక్కోవాలి?

ఫేక్ యూనివర్సిటీల వివరాలు ఎలా తెలుసుకోవాలి అన్న ప్రశ్నకు సుజనా సమాధానమిస్తూ... అమెరికా ప్రభుత్వం ఆ దేశంలోని యూనివర్సిటీల వివరాలను అధికారికంగా వెబ్‌సైట్‌లలో ఉంచుతుందని చెప్పారు. జాయిన్ కావాలనుకున్న యూనివర్సిటీ వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయో లేదో విద్యార్థులు చెక్ చేసుకోవాలన్నారు. విద్యకు సంబంధించి అమెరికాకు చెందిన 8 కేంద్రాలు ఇండియాలో ఉన్నాయని.. వీటిలో సంప్రదించినా గుర్తింపు పొందిన యూనివర్సిటీల వివరాలు తెలుసుకోవచ్చన్నారు. అలాగే సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కూడా యూనివర్సిటీల వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు తమ ఆర్థిక స్థితిని అంచనా వేసుకుని యూనివర్సిటీలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

మన పిల్లలకు అండగా నిలుద్దాం

అమెరికా నుంచి తెలుగు విద్యార్థులను వెనక్కి పంపిన ఘటనపై ఏపీ సీఎం ఆరా

- పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులకు ఆదేశం
- అమెరికా వెళ్లే విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు
- వెనక్కి పంపిన విద్యార్థులను తిరిగి పంపేలా విదేశాంగ శాఖతో చర్చలు

సాక్షి, అమరావతి: అమెరికా వెనక్కు పంపిన భారతీయ విద్యార్థుల్లో కొంత మంది తెలుగు విద్యార్థులూ ఉన్నారనే విషయంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఆరా తీశారు. ఆ విద్యార్థుల పూర్తి వివరాలు తెలుసుకుని, వారికి అండగా నిలవాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి ఈ అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. అమెరికాలో ఇమిగ్రేషన్ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్ర విద్యార్థుల కోసం సీఎం ఆదేశాల మేరకు.. ప్రభుత్వం వేగంగా స్పందించి పలు కీలక నిర్ణయాలు తీసుకొంది. విదేశాంగ శాఖతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించారు. వెనక్కి వచ్చిన విద్యార్థులు వ్యాలిడ్ వీసాలను కలిగి ఉండటంతో వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సమస్యను త్వరగా పరిష్కరించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నారు. అమెరికా నుంచి బహిష్కరణకు గురైన తెలుగు విద్యార్థులు ఏపీఎన్ఆర్టీఎస్‌ను సంప్రదించాలని అధ్యక్షుడు వెంకట్ ఎస్ మేడపాటి తెలిపారు. ఇందుకోసం ఏపీఎన్ఆర్టీఎస్ ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబర్ కేటాయించిందన్నారు. ఈ హెల్ప్‌లైన్ నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని, +91 8632340678, 8500027678 సంప్రదించాలని సూచించారు. లేదా info@apnrts.com, helpline @apnrts. comకు మెయిల్ చేయాలని చెప్పారు.

నిబంధనలు క్షుణ్ణంగా తెలుసుకోండి

అమెరికా వీసా ఉన్నంత మాత్రాన ఆ దేశంలోకి ప్రవేశమనేది గ్యారెంటీ కాదని, విద్యార్థులు యూఎస్ ఇమ్మిగ్రేషన్ (పోర్ట్ ఆఫ్ ఎంట్రీ) వద్ద కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) అధికారులు అడిగే అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. ల్యాప్‌టాప్, మొబైల్‌లో అమెరికా నిబంధనలను ఉల్లంఘించేలా సందేశాలు (పార్ట్‌టైమ్ జాబ్, బ్యాంక్ బ్యాలెన్స్ మేనేజ్ తదితర) ఉండకూడదని తెలిపారు. ఆ దేశంలోకి ప్రవేశం ఎందుకనే అంశాన్ని చెప్పి, వారిని ఒప్పించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంలో ముందుగానే విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. విద్యార్థి దశలో అమెరికాలో జీవించడానికి అవసరమైన ఆర్థిక స్థోమతకు తగిన రుజువులు, యూనివర్సిటీ అడ్మిషన్ లెటర్, తదితరాల గురించి మన విద్యార్థులను అడిగినప్పుడు సంతృప్తికర సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానాలు ఇవ్వకపోతే విద్యార్థులు యూఎస్ ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించే అవకాశం ఉందని వారు భావిస్తారని చెప్పారు. ఈ విషయాలపై విద్యార్థులు ముందుగానే అవగాహన పెంచుకోవాలని చెబుతున్నారు. పేరున్న ఏజెన్సీల ద్వారానే విద్యార్థులు అమెరికా వెళ్లేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు.



కిలిమంజారో పర్వతారోహణ చేసిన కాకినాడ మహిళలు

అతివల తెగువకు తలవంచిన కిలిమంజారో!

- వారం రోజుల్లో పర్వతారోహణ
- ఆ ఐదుగురు మహిళలకు ప్రశంసలు

కాకినాడ: భారతీయ పర్వతారోహకుల్లో కాకినాడ మహిళలు మరో మైలురాయిని అధిగమించారు. 19,341 అడుగుల ఎత్తు గల కిలిమంజారో పర్వతాన్ని ఏడు రోజుల్లో అధిరోహించి.. పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడించారు. పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్న కాకినాడకు చెందిన సత్తి లక్ష్మితో పాటు కోనేరు అనిత, వాడకట్టు పద్మజ, స్రవంతి చేకూరి, శ్రీశ్యామలలు.. ఏడు రోజుల్లో వీరు లక్ష్యాన్ని చేరుకోవడంతో వీరి తెగువకు, సంకల్పానికి, కఠోర దీక్షకు అందరూ ఫిదా అవుతున్నారు. వారం రోజులు శ్రమించి సరిగ్గా ఆగస్టు 15న కిలిమంజారో పర్వతంపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. వీరిని రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కర రెడ్డి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అభినందించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయడం వల్లే తమ బృందం లక్ష్యాన్ని చేరుకోగలిగిందని సత్తిలక్ష్మి చెప్పారు.

శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల నవంబర్ కోటా విడుదల

తిరుమల:టీటీడీ షెడ్యూల్ ప్రకారం నవంబర్ నెల తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను విడుదల చేసింది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్‌లైన్ లక్కీడిప్ కోసం శనివారం ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవా టికెట్లను మధ్యాహ్నం 3.00 గంటలకు విడుదల చేస్తారు. అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం టికెట్లను ఉదయం 11 గంటలకు, వృద్ధులు, దివ్యాంగులకు దర్శన టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3.00 గంటలకు విడుదల చేయనున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లు ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. తిరుమల, తిరుపతిలలో వసతి గదుల బుకింగ్ ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.

సీఎం జగన్‌ను కలవడం ఆనందంగా ఉంది

జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ అండ్ ఎండీ సజ్జన్ జిందాల్ ట్వీట్

సాక్షి, అమరావతి: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పేదల అభ్యున్నతి కోసం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించడం ఆనందంగా ఉంది' అని జేఎస్‌డబ్ల్యూ సంస్థ చైర్మన్ అండ్ ఎండీ సజ్జన్ జిందాల్ శనివారం ట్వీట్ చేశారు. సీఎం వైఎస్ జగన్ తనకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న ఫొటోను షేర్ చేస్తూ సజ్జన్ జిందాల్ ఈ ట్వీట్ చేశారు. 'గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలవడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుంది. రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతి కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సీఎంతో చర్చించటం జరిగింది.' అని ఆయన పేర్కొన్నారు.



ఆర్టీసీలో 'ఆగస్టు' టెన్షన్

ఈ నెలాఖరుకు 183 మంది ఉద్యోగుల పదవీ విరమణ
ఇంకా విడుదల కాని 'ప్రభుత్వంలో విలీన ప్రక్రియ' ఉత్తర్వు

ఆ 183 మంది ఆర్టీసీ ఉద్యోగులుగానే రిటైర్‌మెంట్ తీసుకుంటారా? ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అందే అన్ని రకాల బెనిఫిట్స్ పోయినట్టేనా ? ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనమయ్యే ప్రక్రియ ఆలస్యమవుతున్న కొద్దీ వారిలో తీవ్ర ఆందోళన నెలకొంది. కోరుకున్న అవకాశం అందినట్టే అంది చేజారిపోతుందనే బాధ వారిలో స్పష్టంగా కనిపిస్తోంది.



సాక్షి, హైదరాబాద్: ఈ నెల నుంచే ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు చెల్లించేందుకు సిద్ధమని ఇటీవల ఆర్టీసీ చైర్మన్ స్వయంగా ప్రకటించారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులూ వెల్లడించారు. ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు, వారు పనిచేస్తున్న విభాగాల వారీగా ఆర్థికశాఖకు వెళ్లాయి. జీతాలు చెల్లింపునకు అంతా సిద్ధమవుతోంది. కానీ, ఇప్పటి వరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్టుగా ప్రభుత్వ ఉత్తర్వు మాత్రం జారీ కాలేదు. ఏ తేదీ నుంచి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలో ఆ ఉత్తర్వులో పేర్కొనాల్సి ఉంది. ఆ తేదీ విషయంలో స్పష్టత లేకపోయేసరికి ఇప్పుడు ఆర్టీసీలో గందరగోళం నెలకొంది. ఆగస్టు నెలాఖరుకు ఆర్టీసీలో 183 మంది పదవీ విరమణ పొందాల్సి ఉంది. రిటైర్‌మెంట్‌కు ఇంకా 13 రోజులు మాత్రమే ఉంది. ఇప్పటి వరకు ప్రభుత్వ ఉత్తర్వు వెలువడకపోవటంతో తాము విలీన ప్రక్రియ కంటే ముందే విరమణ చేయాల్సి వస్తుందేమోనన్న టెన్షన్ వారిలో ఉంది. వాస్తవానికి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని గత నెల31నే మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. దీంతో తాము కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ చేయొచ్చని ఈ 183 మంది ఆశపడ్డారు. కానీ నెలాఖరు సమీపిస్తున్నా, అసలు తంతు మాత్రం ఇంకా పెండింగ్‌లో ఉండడంతో వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

గవర్నర్ ఆమోదంలో జాప్యంతో...: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి సంబంధించిన బిల్లును ఈ నెల 6వ తేదీన శాసనసభ ఆమోదించింది. ఆ వెంటనే బిల్లు గవర్నర్ ఆమోదానికి పంపిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు రాజ్‌భవన్ దానిపై ఆమోదముద్ర వేయలేదు. పది రోజులు దాటినా గవర్నర్ ఆమోదం లభించలేదు. దీంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయలేదు. తాజాగా ఆ బిల్లుపై సందేహాల నివృత్తికి న్యాయశాఖ కార్యదర్శి అభిప్రాయం కోసం పంపినట్టు రాజ్‌భవన్‌వర్గాలు అధికారికంగా ప్రకటన విడుదల చేశాయి. దీంతో బిల్లుపై గవర్నర్ సంతకం, ప్రభుత్వ ఉత్తర్వు జారీకి మరికొంత సమయపట్టే అవకాశం కనిపిస్తోంది.

ఈ బెన్ఫిఫిట్స్ కోల్పోయినట్టేనా ?

ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ పరిధిలోకి వస్తే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి సీనియర్ డిపో మేనేజర్ వరకు పెద్దగా ప్రయోజనం లేకున్నా, కిందిస్థాయి ఆర్టీసీ ఉద్యోగుల వేతనాల్లో మంచి పెరుగుదల ఉంటుంది.

- గ్రాట్యూటీ, పీఎఫ్ మొత్తం కూడా పెరుగుతుంది. కొత్త పీఆర్సీ వస్తే జీతాలు పెరుగుదల మరింతగా ఉంటుంది.
- ఆర్టీసీలో ప్రస్తుతం ఉద్యోగ విరమణ వయసు 60 ఏళ్లుగా ఉండగా, ప్రభుత్వంలో అది 61 ఏళ్లుగా ఉంది. దీంతో ఒక సంవత్సరం ఎక్కువగా పనిచేసే వెసులుబాటు కలుగుతుంది.
- పెరిగిన జీతం 12 నెలల పాటు అందుకునే వీలు చిక్కుతుంది. ఉద్యోగ భద్రతకు భరోసా ఉంటుంది.

'పంచాయతీ' ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ భేరి

- 66 సర్పంచ్ పదవుల్లో ఏకగ్రీవాలతో కలిపి 53 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల గెలుపు
- 10 చోట్ల టీడీపీ, ఒక స్థానంలో జనసేన విజయం
- ఎన్నిక ఏదైనా ఫ్యాన్ గాలికి ఎదురులేదని మరోసారి రుజువు



కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు

సాక్షి, అమరావతి / నెట్‌వర్క్: ఏపీలో పంచాయతీ ఉప ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయ దుందుభి మోగించారు. ఎన్నిక ఏదైనా, ఎప్పుడొచ్చినా విజయ పరంపర కొనసాగుతూనే ఉందని మరోమారు రుజువైంది. మొత్తం 66 గ్రామాల సర్పంచ్ పదవులకు గాను 64 గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. వాటిలో ఏకగ్రీవమైన 30 సర్పంచ్ పదవులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకే దక్కాయి. మిగిలిన 34 సర్పంచ్ పదవుల ఎన్నికల్లో 23 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయ కేతనం ఎగురవేశారు. 10 స్థానాల్లో టీడీపీ మద్దతుదారులు, ఒక స్థానం జనసేన మద్దతుదారుకు దక్కింది. మొత్తం 1,062 వార్డుల్లో 63 స్థానాల్లో ఎన్నికలు జరగలేదు. మిగతా 999 వార్డు సభ్యుల పదవుల్లో ఏకగ్రీవాలతో కలిపి789 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, 182 వార్డుల్లో టీడీపీ మద్దతుదారులు, 7 వార్డుల్లో జనసేన మద్దతుదారులు, 21 వారుల్లో ఇతరులు గెలుపొందారు. టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గంలోని చలివెందుల పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. తాడిపత్రి నియోజకవర్గంలోని జేసీ బ్రదర్స్ సొంత మండలం పెద్దపప్పూరులో వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు గెలుపొందారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయ అధికారులు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా, మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగింది. రెండు గంటల అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి రాత్రి ఏడు గంటలలోపే విజేతలను ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇలాఖా కుప్పంలో మరోసారి ఆ పార్టీకి తీవ్ర భంగపాటు ఎదురైంది.

కుప్పంలో బాబుకు పరాభవం

చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో ఆరు వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అందులో ఐదుగురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. చంద్రబాబు ఇల్లు కట్టుకుంటున్న వార్డులో కూడా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గెలుపొందడం విశేషం. ఒక్క స్థానంలో మాత్రమే టీడీపీ మద్దతుదారు గెలుపొందారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు/ 41/5'11" / (Un Married Govt. ఆఫీసర్. 75000/-PM దృష్టి లోపం) గల వరునికి, కేవలం వివాహం ఆసక్తమైన 30yrs పై బడిన Un Married హిందూ వధువు కావలెను. 9177904999 (No Brokers) [H-788404]

రెడ్డి/ 50y/విడోవర్ / 5'5" / 20 ఎకరాల ల్యాండ్ + వ్యవసాయం/సొంత ఇల్లు/Fair/ వెల్ సెటిల్డ్ వరుడికి ఏ బాదరబందీలేని ఒంటరి వధువు కావలెను. Ph: 6301342958 [H-788941]

క్రిస్టియన్: 2వ పెళ్లి / కులప్రసక్తి లేదు/ M.Tech/ SWE/Hyd/ 2 Laksh. PM/5'9" ఎత్తు/ 38 సంగిల పిల్లలు లేని వరునికి వధువు కావలెను. Ph: 9550650024 [H-13678]

SC మాల: B.Tech/ C.Govt.Asst. ఇంజనీర్/ ట్రాన్స్‌కో/90,000/- Pm/ 5'10" ఎత్తు/ 28 సంగిల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [H-13678]

యాదవ: కట్నం ప్రసక్తి లేదు/B.Tech (సివిల్)/ C.Govt.A.E.E/ IOCL/20 Lakhs. P.A/ 5'9" ఎత్తు/ 28 సంగిల వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [H-13678]

SC మాల&క్రిస్టియన్: కట్నం ప్రసక్తి లేదు/ M.Tech, IT/ C.Govt./ డిప్యూటీ మేనేజర్/SBI/ 85,000/- PM/ 5'8"ఎత్తు/ 28 సంగిల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [H-13678]

SC మాదిగ&క్రిస్టియన్: B.Tech, MBA/ C.Govt./ డిప్యూటీ మేనేజర్/SBI/ 70,000/- PM/ 5'8"ఎత్తు/ 28 సంగిల వరునికి వధువు కావలెను. Ph: 9515755529/ 9912280929 [H-13678]

క్రిస్టియన్ మాల: కట్నం ప్రసక్తి లేదు/ 29 /5'10"/ M.Tech/ Govt. A.E.E/ ఇరిగేషన్ Dept/ 1Lakh. Pm అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [H-13678]

బ్రాహ్మణ: 2వ పెళ్ళి/ గుడ్ లుకింగ్ / 43/ 5'10"/ MBA, BE/SWE/ 5 Lakhs. Pm/ కోట్ల ఆస్తి గల వరుడికి 1st మ్యారేజ్ వధువు కావలెను. Ph: 8367619529, 9515349877 [H-13678]

నాయుడు/45 సంగి/5'6"/MBA/ సొంత బిజినెస్ బిల్డర్, కోట్ల ఆస్తి గల వరుడికి కుల ప్రసక్తి లేని వధువు కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్. వాట్సాప్ నెం. Ph: 9032744799 [HA-13687]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 25, 6' 1", SWE, 150 K, 100 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Germany, BE, MS, 29, 6', 84 K Pounds, 10 Crores. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE (BITS), 28, 5' 7", 40 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (IIIT), 30, 5' 8", SWE, 40 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MBA, 26, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 24, 5' 10", Analyst, 85 K, 25 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 3", SWE, 150 K, 2 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 26, 5' 7", Deloitte, 10 L P/A, 5 Crores, Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6', SWE, 200 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 11", 22 L P/A, 100 Crores, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MPH, 32, 5' 11", Residency Doctor, USA. USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 10", PG Doctor, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 5", Analyst, 95 K, 25 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 5", SWE, 85 K, 6 Crores, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 26, 5' 8", Doctor, USA, 10 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 7", 50 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాదిగ: Govt.Job 30 సంగి 5'9" B.Tech, MBA, 12L P/A Own House Well Settled వరునికి తగిన వధువు కావలెను. Ph: 6281925716 [H-10954]

గంగపుత్ర(బెస్త): Govt. సెంట్రల్ Job 30 సంగిల 5'9" B.Tech, MBA 15L P/A Well Settled వరునికి తగిన వధువు కావలెను. Ph: 6301621607 [H-10954]

ఆర్యవైశ్య/24y&25y&26y&28y&30y&31y&32y&34y&36y&38y&40y&42y&44y&46&48y&50y&52y&54y&56y&58y&59&60y&62y & 63y/శ్రీ.సుప్రజా గుప్తా "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [H-788404]

మాదిగ/21/5'3"/2వ పెళ్లి/డిగ్రీ పూర్తి చేసిన వధువుకు వరుడు కావలెను. * మాదిగ 29/ 5'9"/ B.Tech వరుడికి జాబ్ చేసే వధువు కావలెను. 1వ/2వ అయినా OK (డైరెక్ట్) 9700151269 [H-788404]

రెడ్డి/55y/ డైవర్స్/CNB/ AP స్టేట్ Govt. లో గ్రూప్-1 ఆఫీసర్‌గా ఉంటూ, సెలవులో UK Govt.లో ఆఫీసర్‌గా జాబ్ చేస్తూ UK PR కలిగిన వరునికి ఇండియా / అబ్రాడ్‌లో సెటిల్ అయ్యేందుకు అందమైన Rich వధువు కావలెను. Ph:6303487992, నో బ్రోకర్స్. [HA-13954]

రెడ్డి/40/5.6/B.Tech Software Employee Good Salary Any 1st and 2st Fair అందమైన అమ్మాయి కావలెను. డైరెక్ట్‌గా సంప్ర: 73375 86682 [L-787433]

★

రెడ్డి: లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఏపీ తెలంగాణ వధువు కావలెను. డైవర్స్/ విడో OK కుల, కట్నం ప్రసక్తి లేదు డైరెక్ట్. Ph:7989079290 [H-189373]

క్రిస్టియన్ మాల 39, ప్రైవేట్ జాబ్ వరుడికి వధువు కావలెను. కులం, కట్నం పట్టింపులే దు. విడోయర్స్, నో బ్రోకర్స్, ఓన్లీ జెన్యూన్ పర్సన్స్ కాల్ డైరెక్ట్ సెల్ : 9550913919 [Y-784377]

★★


రాజులు యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం సొంత ఇల్లు 48 సం. 2వ పెళ్లి వెల్ సెటిల్డ్ వరుడికి కులప్రసక్తిలేని సాంప్రదాయమైన వధువు కావలెను. సంప్ర. 9573428169 [B-190735]

34సంగి/హిందూమాల/ఎం.టెక్/5'8"/Asst. Manager (U.B.I), Sal: 70k, 2వ పెండ్లి వరునికి ఉద్యోగం/వ్యాపారం చేయుచున్న వధువు కావలెను. పిల్లలు లేని 2వ సంబంధమైనను OK. డైరెక్టు(నో బ్రోకర్సు) 9247150678, 9989103416 [G-787464]

దూదెకుల (దెవి పోగు) B.Tech ఎత్తు 5'9' వైట్, సౌదీ అరేబియా (రియాద్) సామ్‌సంగ్ కంపెనీలో ప్లానింగ్ మేనేజర్‌కు వధువు (B.Tech, డిగ్రీ) కావలెను. 9959215917, [C-777196]

OC వయస్సు: 50, బిజినెస్ వెల్ సెటిల్ వరుడుకు 45 టు 50 అందమైన OC వెల్ సెటిల్ వధువు కావలెను. (డైరెక్ట్) సంప్ర: 94908 78646. [P-1233418]

వరుడు కావలెను



No Caste bar/1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok. త్వరగా చేసుకునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [HA-29865]

కాపు/45yrs/కుల పట్టింపు లేదు/Govt ఎంప్లాయ్/12 Lac (pm)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ బిజినెస్ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం 1st& 2nd లేట్ మ్యారేజ్ OK) సంప్ర: 9492081545 [H-788659]

వాసవి ఆర్యవైశ్య: వరులకు మొదటి వివాహం/2వ వివాహం కోసం ఆర్య వైశ్య వధువులు కలరు. వెంటనే వాట్సప్ ఫోటో, జాతకం: 8667325268 [IA-8611]

రెండవ పెళ్ళి/విడో/45y/ విజయవాడ/Settled in Hyd/Own House Rents/ పిల్లలులేని/వెల్ సెటిల్ ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (పిల్లలున్నా OK) Ph: 8519803423 [H-788521]

రెడ్డి/24y/ 5'4"/ V.Fair/ B.Tech/SWE/ 18L P/A/కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9553652167 [H-788521]

రెడ్డి/విడో/32y/5'5"/Fair/M.Tech/Working in MNC/28L PM/కోట్ల ప్రాపర్టీ గల 5 సంగిబాబు/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9640667754 [H-788521]

కాపు/డైవర్స్/26y/5'5"/Fair/B.Tech/ SWE/22L P/A/కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-788521]

కుల పట్టింపు లేదు/39yrs/2వ పెళ్లి/Govt ఎంప్లాయ్/3,50,000/-(pm) బాగా స్థిరపడి కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్రదించండి: 7386550413 [H-788659]

2వ పెళ్ళి/36yrs/Govt ఎంప్లాయ్/3,00,000/- (pm) కుల పట్టింపు లేదు/బాగా స్థిరపడిన & కోట్ల ప్రాపర్టీ కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్రదించండి : 9502046384 [H-788659]

రెడ్డి/2వ పెళ్లి/కుల పట్టింపు లేదు/40yrs/M.Sc Ph.D/ ఇరిగేషన్ Dept(EE) Govt. ఆఫీసర్ 2 లక్షలు (pm) పిల్లలు లేని తెల్లని అందమైన 50 కోట్ల ఆస్తి గల వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్ర: 8341454870 [H-788659]

రెడ్డి/ విడో/ 49yrs/ 5'5"/ V.Fair/25 ఎకరాల మాగాణి ఏ బాదరబందీలేని వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 9492718486 [H-788941]

బ్రాహ్మణ/విడో/60y/తెల్లనిచాయ/Govt Retd సొంత ఇల్లు & రెంట్స్/సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్ సెటిలైన ఒంటరి వధువుకు స్నేహస్వభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9121509718 [H-788941]

వైశ్య/విడో/53y/డిగ్రీ/సొంత బిజినెస్ /80K/PM/6 ఎకరాల ల్యాండ్ గల వెల్ సెటిల్డ్ వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను Ph: 9703982351 [H-788941]

FC/ విడో/ 60y/ 5'3"/ Degree/ V.Fair/ సొంత బిజినెస్/4 ఎకరాల పంట పొలం G+1 Own House /60,000/-PM/ఆదాయం గల వెల్ సెటిల్డ్ వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 6301135887 [H-788941]

యాదవ, క్రిస్టియన్: కులప్రసక్తి లేదు/ B.Tech / 29, 5'3" జాబ్, Hyd, అందమైన అమ్మాయికి జాబ్ / బిజినెస్, ఇండియా / US వరుడు కావలెను. Ph: 9441039962 [H-13678]

SC మాల: ఏకైక కుమార్తె/ B.Tech/ Govt. Asst.ఇంజనీర్/TSNPDCL/ 60,000/-Pm/ 5'4" ఎత్తు/ 26 సంగిల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897389698 [H-13678]

బ్రాహ్మణ: 25/5'4"/B.Tech "28/5'3"/B.Sc "30/ 5'4"/ MBA "27/5'3"/ ఇంటర్. వధువులకు వరులు కావలెను. కట్నాలు ఆశించని/ మధ్యతరగతి/ పురోహితులకు ప్రత్యేకం. వాట్సప్: 7207634758 [H-13678]

CNB/లేటు/కాపు/42/5'4"/B.Tech/SWE/1.30 L PM. * డైవర్స్/వెలమ/పిల్లలు లేరు/42/5'4"/ Ph.D/50 Lakhs. P.A/5Cr. ప్రాపర్టీ/UK/లండన్ అర్జెంట్. వాట్సాప్: 8187053655, 6303293337 [HA-13687]

43y/2వ పెళ్లి, పిల్లలు లేని ఫెయిర్ అందమైన ఎంప్లాయి వధువుకు Any FC/BC వరుడు కావలెను. 60y వరకు OK. Ph: 9542098659 [HA-13687]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/A:30, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకు 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను. (ఇల్లరికం OK.) Ph: 8143011223 [HA-13687]

BC/42/5'2"/V.Fair/డిగ్రీ, వ్యాపారం 60L. PA/ 25 కోట్ల స్థిరాస్తి కల్గి బాగా స్థిరపడిన బాదరబందీలేని ఏకైక వధువుకు మంచి సాంప్రదాయ కుటుంబపు వరుడు కావలెను. Ph: 9573943211, 9346929647 [HA-13687]

CNB II Mach 47 సంగి 5'4" M.Sc Govt Job 10LP/A No (issues)Well Settled అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7702195227 [H-10954]

మాల: 27 సంగి / 5'4"/ B.Tech/ MBA/ Govt Job 12L P/A Well Settled Only Daughter అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9581616774 [H-10954]

ఆర్యవైశ్య/22y&23y&24y&25y&26y&28y&29y&30y&31y&33y&35y&37y&39y&40y&42y&43y&45&47y&49y&51y&53y&55y&57y&59y/శ్రీ.సుప్రజా గుప్తా "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [H-788404]

రెండవ పెళ్లి/49/Widow/Labour Commissioner/ 2Lpm/Own House/14 AC పొలాలు/ కోట్ల ఆస్తి వెల్ సెటిల్డ్ అందమైన వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 9550453046 [H-788404]

29, 5.3", MNC Job, 50K ముస్లిం సున్నీ వధువునకు Hydలో జాబ్ చేస్తున్న 30-33 సంగిలలోపు SW / MNC (ముస్లిం/దూదేకుల) వరుడు కావలెను. © 86396 56798 [B-66]

★★

యాదవ్/28 / ఫెయిర్/డైవర్స్ అమ్మాయికి యాదవ లేదా కమ్మ/రెడ్డి/పద్మశాలి/ ఆర్యవైశ్య వరుడు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర: 94405 06975 [L-787434]

మాల హిందూ, వయస్సు 27 సంగి H.5.'7" చదువు B.Tech., వధువుకి వరుడు సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్ కావలెను. ఫోన్: 77949 11019 [R-1914]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1వ/ 2వ /లేట్/విడో/విడోయర్స్/ఒంటరి/పెన్షనర్స్ స్త్రీలకు & పురుషులకు వ॥ 21-80 సం॥ పెళ్లి సంబంధాలు త్వరగా చూడబడును. సంప్ర: 8374802603 [H-788659]

కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్స్, అన్ని కులాలవారికి త్వరగా కుదుర్చబడును స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-788521]

ఫాస్ట్ సెటిల్‌మెంట్: కులపట్టింపు లేని అన్ని కులముల వారికి 1st, IInd సంబంధములు చూడబడును. Pvt, SWE, Govt, మొదలగు సంబంధములు చూడబడును. 8897091964 [H-10954]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-780945]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI /PVT/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS/15 సం॥ Exp. Ph: 9989140444 [HA-30213]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st 2nd లేట్/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690809 [H-788938]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13679]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13679]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13679]

Kamma - Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam. Ph: 7093016945/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13679]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8500688938/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13679]

శ్రావణమాసం-పెళ్లిళ్ల సీజన్. అబ్రాడ్, సాఫ్ట్‌వేర్స్, రిచ్, IAS, IPS, IRS వారికి ఫాస్ట్ సెటిల్మెంట్. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, సంప్రదించండి: 7093722724. [T-1918]

15రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriages.com, Cont © 94418 29644, 9849058673, 9440785888 W [B-945]

మాల, మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK, Ph : 73969 15712 (A). [M-10225]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. Ph: 9704656103, 9533608887 (Whatsapp) [H-370]

నగర వార్తలు

మెట్రో-3 ఫేజ్ కన్సల్టెన్సీలకు ఆహ్వానం

12 కారిడార్లు, 278 కిలోమీటర్లలో మెట్రో నిర్మాణం

- ప్రాథమిక, సమగ్ర అధ్యయన నివేదికలు రూపొందించాలని నిర్ణయం
- కన్సల్టెన్సీల ఎంపికకు టెండర్లను ఆహ్వానించిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో
- వచ్చే నెలలో కన్సల్టెన్సీల ఎంపిక



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి నలువైపులా నిర్మించతలపెట్టిన మెట్రో కారిడార్ల పైన అధ్యయనం కోసం కన్సల్టెన్సీలను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టుమెట్రో నోటిఫికేషన్ విడుదల చేసింది. మెట్రో 3వ దశ కింద మొత్తం 12 కారిడార్‌లలో 278 కిలోమీటర్లలో మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎంఆర్‌టీఎస్)ను అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణ చేపట్టినట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. భారీ నిధులతో చేపట్టనున్న మెట్రో మూడోదశ ప్రాజెక్టు నిర్మాణంలో టీఎస్ ఐఐసీ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ తదితర ప్రభుత్వ సంస్థలు, విభాగాల భాగస్వామ్యం ఉంటుందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక, సవివరమైన నివేదికలను సిద్ధం చేయాలని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించినట్లు చెప్పారు. ఈ మూడో దశ మెట్రో ప్రాజెక్టులో 8 కారిడార్‌లలో మెట్రో విస్తరణ చేపట్టనుండగా, ఔటర్ మార్గంలోని మరో 4 కారిడార్‌లలో కొత్తగా నిర్మించనున్నారు. మూడో దశ మెట్రోను మొత్తం 4 ప్యాకేజీలుగా నిర్మించేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ నాలుగు ప్యాకేజీలపైన సమగ్రమైన అధ్యయనం చేసి ప్రాథమిక ప్రాజెక్టు నివేదిక (ప్రిలిమినరీ ప్రాజెక్ట్ రిపోర్ట్), సవివరమైన ప్రాజెక్టు నివేదిక (డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)లను అందజేసేందుకు కన్సల్టెన్సీలను ఎంపిక చేయనున్నట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆసక్తిగల సంస్థలు ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. టెండర్లు దాఖలు చేసిన సంస్థల్లో అన్ని విధాలుగా అర్హత కలిగిన సంస్థలను సెప్టెంబర్ మొదటి వారంలో ఎంపిక చేయనున్నట్లు ఎన్వీఎస్ చెప్పారు.నిబంధనల మేరకు ఎంపికైన సంస్థలు 2 నెలల వ్యవధిలో ప్రాథమిక నివేదికలను, మూడు నెలల వ్యవధిలో డీపీఆర్‌లను (సవివరమైన నివేదికలను) అందజేయవలసి ఉంటుంది.

రెండు దశలలో నివేదికలు....

కన్సల్టెన్సీలు 2 నెలల్లో అందజేసే ప్రాథమిక నివేదికలలో (పీపీఆర్) సమగ్రమైన ట్రాఫిక్ సర్వేతో పాటు భవిష్యత్తులో ప్రజా రవాణా ప్రాధాన్యత (ట్రావెల్ డిమాండ్)పైన అధ్యయనం చేయవలసి ఉంటుంది.అలాగే మెట్రో రైడర్‌షిప్‌పైన అంచనాలు రూపొందించాలి. సామాజిక, పర్యావరణ సంబంధమైన అంశాలు, ప్రత్యామ్నాయాలపైన విశ్లేషణ, ఏ రకమైన ప్రజా రవాణా వ్యవస్థ ఉంటే బాగుంటుందనే అంశంపైన ఈ ప్రాథమిక నివేదికలో దృష్టి సారించవలసి ఉంటుంది. అలాగే 3 నెలల కాలపరిమితిలో అందజేయవలసిన సవివరమైన నివేదికలలో మెట్రో రైల్ సివిల్ స్ట్రక్చరింగ్, ప్లానింగ్, స్టేషన్‌లు, డిపోలు, మల్టిమోడల్ ఇంటిగ్రేషన్, విద్యుత్ సరఫరా, సిగ్నలింగ్, ట్రైన్ కమ్యూనికేషన్స్, కోచ్‌లు, ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపైన అంచనాలు, ప్రయాణ చార్జీలు,ఆర్థిక విశ్లేషణ, తదితర అంశాలతో డీపీఆర్‌లను అందజేయవలసి ఉంటుంది.

నాలుగు ప్యాకేజీలుగా మెట్రో నిర్మాణం...

1) మొదటి ప్యాకేజీలో బీహెచ్ఈఎల్-పటాన్‌చెరు-ఓఆర్ఆర్-ఇస్నాపూర్ (13కి.మీ.), ఎల్‌బీ నగర్-హయత్‌నగర్-పెద్దఅంబర్‌పేట్ (13 కి.మీ.), ఓఆర్ఆర్ పటాన్‌చెరు ఇంటర్‌ఛేంజ్-కోకాపేట్-నార్సింగ్ ఇంటర్‌ఛేంజ్ (22 కి.మీ.)

2) రెండో ప్యాకేజీలో శంషాబాద్ జంక్షన్ మెట్రో స్టేషన్-కొత్తూరు-షాద్‌నగర్ (28కి.మీ.),శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ స్టేషన్-తుక్కుగూడ ఓఆర్ఆర్-మహేశ్వరం ఎక్స్‌రోడ్-ఫార్మాసిటీ (26 కి.మీ.) శంషాబాద్ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్- తుక్కుగూడ-బొంగుళూరు-పెద్ద అంబర్‌పేట్ ఇంటర్‌ఛేంజ్ (40 కి.మీ.)

3) మూడో ప్యాకేజీలో ఉప్పల్ క్రాస్‌రోడ్-ఘట్కేసర్ ఓఆర్ఆర్-బీబీనగర్ (25 కి.మీ.), తార్నాకా ఎక్స్‌రోడ్-ఈసీఐఎల్ ఎక్స్‌రోడ్ (8 కి.మీ.), ఓఆర్ఆర్ పెద్ద అంబర్‌పేట్ ఇంటర్‌చేంజ్- ఘట్కేసర్-షామీర్‌పేట్-మేడ్చల్ ఇంటర్‌ఛేంజ్ (45 కి.మీ.)

4) నాలుగో ప్యాకేజీలో జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి తూంకుంట వరకు 17 కిలోమీటర్‌ల మార్గంలో డబుల్ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ లేదా మెట్రో రైల్, ప్యారెడైజ్-కండ్లకోయ డబుల్ ఎలివేటెడ్ / మెట్రో (12 కి.మీ.),ఓఆర్ఆర్ మేడ్చల్ ఇంటర్‌ఛేంజ్-దుండిగల్-పటాన్‌చెరు ఇంటర్‌ఛేంజ్ (29 కి.మీ.)

కన్సల్టెన్సీల ఎంపిక ప్రక్రియ ఇలా...

- ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రో భవన్‌లో టెండర్‌లను దాఖలు చేయాలి.అదే రోజు మధ్యాహ్నం 3.30 కు టెండర్‌లను ఓపెన్ చేస్తారు.
- ఈ నెల 30వ తేదీన ఉదయం 11 గంటలకు కన్సల్టెన్సీ సంస్థల షార్ట్‌లిస్ట్‌ను ప్రకటిస్తారు.అదే రోజు ఉదయం 11.30 కు ఎంపికైన ప్రతిపాదనలను వెల్లడిస్తారు.
- సెప్టెంబర్ 6వ తేదీన ఎంపికైన సంస్థలకు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ఓఏ) అందజేస్తారు. 13వ తేదీన ఆయా సంస్థల పనితీరు పైన పర్‌ఫార్మెన్స్ సెక్యూరిటీని సమర్పించవలసి ఉంటుంది.
- సెప్టెంబర్ 15వ తేదీన ఒప్పందంపైన సంతకాలు చేయాలి.

మలబార్‌లో 23 నుంచి 'బ్రైడల్ జ్యువెలరీ షో'

సాక్షి, సిటీబ్యూరో: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో సోమాజిగూడ షోరూంలో ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 2 వరకు 'బ్రైడల్ జ్యువెలరీ షో' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 11 దేశాల్లో 325 షోరూమ్‌లతో మలబార్ గ్రూప్ తన వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆకర్షణీయమైన ఆభరణాలను మహిళల కోసం అందుబాటులో ఉంచుతున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆల్‌రౌండ్ విజేత నిశ్చల



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా రిథమిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు చాంద్రాయణగుట్టలోని మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ముగిశాయి. వేర్వేరు వయోవిభాగాల్లో చిన్నారులకు ఇందులో పోటీలు నిర్వహించారు. అండర్-5 విభాగం (ఫ్రీ హ్యాండ్స్ ఈవెంట్)లో మొత్తం 10.20 స్కోరుతో శ్రీనిక విజేతగా నిలిచింది. అండర్-7 ఆల్‌రౌండ్ విజేతగా వైదేహి (24.10 పాయింట్లు), అండర్-9 ఆల్‌రౌండ్ విజేతగా రియానా దాసన్ (25.00 పాయింట్లు), అండర్-11 ఆల్‌రౌండ్ విజేతగా ఎన్.ఆరాధ్య (28.10 పాయింట్లు) నిలిచారు. 11 ఏళ్లకు పైబడిన కేటగిరీలో 24.00 పాయింట్లు స్కోర్ సాధించి జి.నిశ్చల ఆల్‌రౌండ్ విజేతగా టైటిల్ గెలుచుకుంది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ జిమ్నాస్టిక్స్ సంఘం కార్యదర్శి మహేశ్వర్, మహావీర్ సొసైటీ కోశాధికారి అగ్నిహోత్రి రెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞాన తెలంగాణ కావాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు

సాక్షి, సిటీబ్యూరో: బంగారు తెలంగాణ కాదు..విజ్ఞాన తెలంగాణ కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలో హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాపాదయాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని ఆరోపించారు. గురుకులాలు, కేజీబీవీలు, కళాశాలలు పాత భవనాల్లో నడుస్తున్నాయని, ఇరుకు గదుల్లో చదువులు కొనసాగిస్తున్నారని, వారికి ఇప్పటి వరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ ఇవ్వలేదని అన్నారు. 2018లో మంత్రి హరీష్ రావు నేతత్వంలో ఇంటర్ విద్యార్థులకు భోజనం అందించేందుకు కమిటీ వేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు మధ్యాహ్నం భోజనంపై ఎలాంటి నిర్ణయం ప్రభుత్వం తీసుకోలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా మాట్లాడుతూ హైదరాబాద్ మహిళా యూనివర్సిటీపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, ప్రకటించిన నిధులూ ఇవ్వలేదన్నారు. తక్షణమే రూ.100 కోట్లు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి దమెర కిరణ్, జిల్లా గర్ల్స్ కమిటీ సభ్యురాలు కవిత,, నాయకులు అశోక్ రెడ్డి, పవిత్ర, కవిత, చరణ్ శ్రీ, సంధ్య, నాగేందర్, స్టాలిన్, సునీల్, ప్రశాంత్, సచిన్ కార్తిక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫొటోగ్రఫీ ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా నగరంలోని హామ్‌స్టెక్ క్యాంపస్ వేదికగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన కళాత్మక నైపుణ్యాలకు ప్రతిబింబంగా నిలిచింది. శనివారం నిర్వహించిన ఈ ఫోటో ఎగ్జిబిషన్‌లో భాగంగా 32 మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు తీసిన అందమైన ఛాయా చిత్రాలను ప్రదర్శించారు. ప్రకృతి అందాలు, ఆర్కిటెక్చర్ సోయగాలు, స్ట్రీట్ లైఫ్ అనుభవాలను, ఉత్పత్తుల నాణ్యత, ఫుడ్-ట్రావెల్-పోర్ట్రెయిట్స్ ఇలా విభిన్న అంశాలతో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనలో అభిషేక్ పాడిశెట్టి మొదటి బహుమతి పొందగా, రాహుల్ రత్న, నవీన్ మేకల ద్వితీయ-తృతీయ బహుమతులను అందుకున్నారు. ప్రేక్షకుల ఎంపికలో భాగంగా ఆయుష్మాన్ ఘోష్‌కు ప్రత్యేక బహుమతి లభించింది.

ఓయూ భూములను పరిరక్షించాలి: ఔటా



ఉస్మానియా యూనివర్సిటీ: వీసీ ప్రొ.రవీందర్ తన వ్యక్తిగత ప్రయోజనాల కోసమే రూ.200 కోట్ల విలువ చేసే భూమిని ప్రభుత్వ పరం చేస్తున్నారని ఓయూ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) నాయకులు శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. వీసీ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ఓయూ పాలక మండలి వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఓయూ భూములను రక్షించాల్సిన ప్రభుత్వమే భూములను తీసుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఔటా నాయకులు పేర్కొన్నారు. ఓయూ స్వయంప్రతిపత్తిని ప్రభుత్వం చేతిలో పెట్టి, వర్సిటీ భూములను దారదత్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓయూ సిండికేట్ 1986 నిర్ణయం ప్రకారం యూనివర్సిటీ భూములను ఎవరికి ఇవ్వకూడదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. భూముల పరిరక్షణకు విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు సమష్టిగా పోరాడనున్నట్లు ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్ పేర్కొన్నారు.

ఫ్లాగ్ ఫుట్‌బాల్ ఇండియన్ టీం బ్రాండ్ అంబాసిడర్‌గా కొటికె విఠల్



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కొటికె విఠల్‌కు అరుదైన గౌరవం లభించింది. అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రమోట్ చేస్తున్న ఫ్లాగ్ ఫుట్‌బాల్ టీమ్‌కు ఆయన బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. వచ్చే ఏడాది మార్చి వరకు ఆయన ఈ పదవిలో ఉంటారని అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సీఈఓ డాక్టర్ సందీప్ చౌదరి వెల్లడించారు. ఇక ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలు సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కాగా కొటికె విఠల్ ఈ నెల 20న నగరంలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరవుతారు. మలేషియాలో ఈ ఏడాది అక్టోబర్ 23 నుంచి జరగనున్న ఆసియన్ చాంపియన్ షిప్‌లో ఇండియన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ టీంకు ప్రత్యేక అతిథిగా, బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తారు. నెదర్లాండ్స్‌లో ఈ ఏడాది నవంబర్-డిసెంబర్ మాసాల్లో జరగనున్న అంతర్జాతీయ చాంపియన్‌షిప్‌లో ఇండియన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ టీంకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు ఆయన ఇటీవల నియామక పత్రాన్ని అందుకున్నారు.

మంత్రి కొప్పులతో క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ భేటీ



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనను నియమించడం పట్ల రాజేశ్వర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావును మంత్రి కొప్పుల ఈశ్వర్ సన్మానించారు.

మురుగు నీటి వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బస్తీలలో మురుగునీరు వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధికారులకు ఆదేశించారు. శనివారం తెలంగాణ హరిత ప్లాజా లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సమితి (దిశ) సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో జరుగుతున్న ఇండ్ల నిర్మాణాలపై జీహెచ్ఎంసీఅధికారులను అడిగి తెలుసుకొని త్వరగా పూర్తి చేయాలని, జేఎన్‌యుహెచ్ స్కీంలో నిర్మించిన ఇండ్లను లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని సూచించారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాదాపూర్: నగర అందాలను అద్భుతంగా ఫోటోలు తీశారని తెలంగాణ రాష్ట్ర టూరిజం,సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాటోగ్రఫీ, మీడియా ఫోటోగ్రఫీ, ఫ్రీలాంచర్స్‌లు అద్భుతంగా హైదరాబాద్ నగర అందాలను పోటోలు తీశారన్నారు. ఫోటోగ్రఫీ అనేది పెద్ద కళ అని అన్నారు.

క్లుప్తంగా...

అరుదైన రాజకీయ నేత సంతోష్‌కుమార్

'వింగ్స్ ఆఫ్ ప్యాషన్' పుస్తకావిష్కరణలో నటుడు రామ్‌చరణ్



సాక్షి, బంజారాహిల్స్: రాజకీయం, ప్రజాసేవలో ఉంటూ.. కళలపై ఆసక్తి కలిగిన వ్యక్తులు అరుదుగా ఉంటారని.. అలాంటి వారిలో రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ఒకరు అని సినీ నటుడు రామ్‌చరణ్ అన్నారు. ఎంపీ సంతోష్ కుమార్ తీసిన ఛాయాచిత్రాలతో కూడిన 'వింగ్స్ ఆఫ్ ప్యాషన్'పుస్తకాన్ని శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో రాంచరణ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'పక్షులతో ఉన్నప్పుడు నిశ్శబ్దంగా ఉండమని 'పుస్తకంలో ఆయన చెప్పిన మాట తన హృదయాన్ని హత్తుకుందని వ్యాఖ్యానించారు. జీవులపై కరుణ, జాలి, ప్రేమ, వాటితో నిరంతర సహవాసం ఉంటే తప్ప అద్భుతమైన ఆ తత్వాన్ని అర్థం చేసుకోలేమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్‌ను ఆయన అభినందించారు.

మెడికల్ కోర్సుల ఫీజు వసూళ్లను కట్టడి చేయాలి

ప్రభుత్వానికి హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రైవేటు మెడికల్ కాలేజీలు విద్యార్థుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మహేశ్‌కుమార్, శ్రీనివాస్ గుండగాని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని కాలేజీలు ఏకంగా విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న నెలవారీ స్టైపెండ్‌ను కూడా దండుకుంటున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ తరపున వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

మైత్రీ అంబుజాకు 'రెరా' షోకాజ్ నోటీసు

సాక్షి, హైదరాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా, రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా ప్రీలాంచ్ ప్రాజెక్ట్ చేపట్టిన మైత్రి అంబుజా (సంఘీ అంబుజా) యాజమాన్యంకు 'రెరా' షోకాజ్ నోటీసు జారీ చేసింది. మైత్రి అంబుజా యాజమాన్యం రంగారెడ్డి జిల్లాలో అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామంలో ప్రీలాంచ్ ప్రాజెక్టు చేపట్టింది. ఈ విషయం రెరా అథారిటీ దృష్టికి రావడంతో రెరా సంస్థ కార్యదర్శి ఎస్.బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైత్రి అంబుజా ప్రాజెక్టు యాజమాన్యానికి రెరా చైర్మన్ సత్యనారాయణ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసు జారీ చేశామని, సంజాయిషీ వచ్చిన తర్వాత విచారణ జరిపి రెరా చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఓయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో గత నెల వరకు జరిగిన వివిధ డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ప్రొ.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర డిగ్రీ కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

నేడు సీ టెట్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీపడే వారికి సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీ టెట్) పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్రంలోని హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్‌లలో ఈ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

28 నుంచి దోస్త్ ప్రవేశాల స్పెషల్ డ్రైవ్

షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌సీహెచ్‌ఈ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ మేరకు శనివారం టీఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అధ్యక్షతన రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది 16 సెక్టార్లలో స్కిల్ కౌన్సిల్ కోర్సులు(బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్, బీఎస్సీ బయోటెక్నాలజీ హానర్స్)ను 29 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, 35 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలతో పాటు అగ్రికల్చర్ బీఎస్సీ, నీట్ ప్రవేశాలు జరుగుతుండటంతో.. విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక డ్రైవ్ ద్వారా అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



గాడిదలపై పంటను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్న దృశ్యం

ఖరము కదిలితేనే..

రైతుల బతుకుబండి నడిచేది

- వ్యవసాయంలో ఎరువులు, విత్తనాలు, పంట ఉత్పత్తుల తరలింపులో కీలకం
- కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు సంగారెడ్డి జిల్లాలో వినియోగం
- పొలాలకు వెళ్లేందుకు దారులు లేక గాడిదలను ఆశ్రయిస్తున్న రైతులు

"ఎవరైనా ఎక్కువగా కష్టపడి పనిచేస్తే గాడిద చాకిరీ చేస్తున్నాడు"

"వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకున్నాడు"

ఇది ఉపమానం అయినా, సామెత అయినా.. పని, అవసరం విశిష్టత చెప్పడమే. అవి కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు సంగారెడ్డి జిల్లాలోని మారుమూల గ్రామాలు. పొలాలకు వెళ్లేందుకు వీలుగా ఎడ్లబండ్లు తీసుకెళ్లడానికి మట్టిబాటలు కూడా లేవు. ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లాలన్నా, పండిన పంట ఇంటికి చేరాలన్నా రైతులకు ఎన్నో వ్యయప్రయాసలే. అలాంటి వారి పాలిట గాడిదలే కార్గో విమానాలు, ట్రాక్టర్లు.

– సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

కిరాయి... వస్తు బదిలీ రూపంలోనే

వ్యవసాయ ఉత్పత్తులు తరలించినందుకు గాడిదల యజమానులకు కిరాయి డబ్బురూపంలో కాకుండా, వస్తురూపంలో ఉంటుంది. ఇది పాత పద్ధతే అయినా ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో అమలులో ఉంది. 60 నుంచి 70 కిలోల వ్యవసాయ ఉత్పత్తుల బస్తా తరలిస్తే అడ్డెడు సరుకుల చొప్పున ఇస్తున్నారు. పెసర, మినుము, సోయా వంటి పంటలను తరలిస్తే రెండు, మూడు బస్తాలకు ఒక అడ్డ చొప్పున ఇస్తున్నారు. పంట చేను నుంచి తరలించే ఇంటి దూరాన్ని బట్టి కిరాయి పెరుగుతుంది. ఒకఅడ్డ అంటే ఐదు కిలోలతో సమానం. వడ్లు అయితే కాస్త తక్కువగా ఉంటుంది. సీజన్‌లో కొందరు రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు సమీప మండల కేంద్రాలకు తెచ్చేందుకు కూడా గాడిదలను వినియోగిస్తారు. ఎరువులు, విత్తనాల బస్తాలను ఇంటి నుంచి పొలాలకు తరలిస్తే బస్తాకు రూ.30 నుంచి రూ.50 వరకు దూరాన్ని బట్టి తీసుకుంటారు.

గాడిదల వినియోగం ఎక్కడంటే..

కర్ణాటక, మహారాష్ట్రలకు సరిహద్దులో ఉంటే సంగారెడ్డి జిల్లాలోని మారుమూల మండలాలైన సిర్గాపూర్, కంగ్టి, కల్హేర్, మనూరు మండలాల్లో రైతుల పంట రవాణాకు గాడిదల వినియోగం ఎక్కువ. ఆయా మండలాల్లోని చీమలపాడు, వాసర్, వంగ్‌దాల్, తడకల్, రాసోల్, జంగి, గాజుర్పాడు, దామరగిద్దలో ఆయా వ్యవసాయ సీజన్లకు అనుగుణంగా వీటి వినియోగం చూడొచ్చు.

అంగడి.. శూన్య అమావాస్య రోజున

గాడిదల అంగడి మహారాష్ట్రలోని మాలేగాంలో జరుగుతుంది. ఏడాదికోసారి వచ్చే శూన్య అమావాస్య రోజు (సంక్రాంతి పండుగకు ముందు) జరిగే ఈ అంగడిలో గాడిదల క్రయవిక్రయాలు జరుగుతాయి. ఈ అంగట్లో తమకు అవసరమైన గాడిదలు కొనుగోలు చేస్తారు. ఒక్కో గాడిద ఖరీదు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది.

సీజన్‌లో మహారాష్ట్ర నుంచి..

ఆయా పంట సీజన్‌కు అనుగుణంగా మహారాష్ట్ర నుంచి గాడిదలు సంగారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామాలకు తీసుకొచ్చి సరుకు రవాణా చేయిస్తారు. నెల, రెండు నెలలు ఇక్కడ ఉండి సీజన్ ముగిశాక వెళ్లిపోతారు.

వేరే ప్రత్యామ్నాయం లేకనే...



నాకున్న భూమిలో నాలుగు ఎకరాల వరకు సరిగ్గా దారి లేదు. దీంతో ఏటా నేను ఆ పొలం నుంచి వడ్లు, సోయా, కందులు, పెసర్లు ఇంటికి తెచ్చేందుకు గాడిదలనే కిరాయికి పెట్టుకుంటాను. తూము(16 అడ్డల)కు ఒక అడ్డెడు కిరాయి కింద గాడిదల యజమానికి చెల్లిస్తా. అంటే సుమారు 20 క్వింటాళ్ల సరుకు తరలిస్తే క్వింటాలు వరకు కిరాయి ఇస్తా. ఈ పొలాల నుంచి పంటను తరలించేందుకు ప్రస్తుతానికి వేరే మార్గం లేదు. ఆ పొలం వరకు ట్రాక్టర్ వెళ్లదు.

– దేవుకతే యాదవరావు, రైతు, సిర్గాపూర్



రెండు గాడిదలతో కనిపిస్తున్న ఈ వ్యక్తి కుమ్మరి పండరి. సిర్గాపూర్ మండలం చీమలపాడు గ్రామం. కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ఈ గ్రామంలో పండరికి ఎనిమిది గాడిదలు ఉన్నాయి. రోజూ ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి చీకటిపడే వరకు గాడిదలను మేపేందుకు తీసుకెళ్లాడు. పంటలు వేసుకునే సమయంలో ఎరువులు, విత్తనాల బస్తాలు తరలించేందుకు సీజన్ మొత్తంలో రూ.8వేల నుంచి 10 వేల వరకు వస్తాయని, పంట ఇంటికి చేరే సీజన్‌లో తన కుటుంబం ఏడాదంతా తినేందుకు సరిపడా పప్పు దినుసులు, ఏడెనిమిది క్వింటాళ్ల వరకు సోయాలు వస్తాయని చెబుతున్నాడు. వీటిని అమ్ముకుంటే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చేతికందుతుందని పండరి చెప్పుకొచ్చాడు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలకు 30% వెయిటేజీ

అర్హత పరీక్ష ద్వారానే ఉద్యోగావకాశం.. క్రమబద్ధీకరణ అసాధ్యం

- కొత్తగా మరో 411 పోస్టులు .. మొత్తం ఖాళీలు 1,931
- ఏఎన్ఎంలు తక్షణమే సమ్మె విరమించి విధుల్లో చేరాలి
- ప్రజారోగ్య విభాగం సంచాలకుడు జి.శ్రీనివాసరావు



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కింద ఎంపికైన ఏఎన్ఎం-2 (సెకండ్ ఏఎన్ఎం)లకు తాజాగా తలపెట్టిన నియామకాల ప్రక్రియలో 30 శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య విభాగం సంచాలకుడు జి.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటివరకు 20 శాతం వెయిటేజీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావించిందని, కానీ క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి మరో 10 శాతం మార్కులను వెయిటేజీ రూపంలో ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు. శనివారం కోఠిలోని తన కార్యాలయంలో ఆయన ఏఎన్ఎం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. చర్చల అనంతరం సంఘాల నేతలు ప్రభుత్వ నిర్ణయాలపై సానుకూలత వ్యక్తం చేసినట్లు శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. ఎన్‌హెచ్ఎం కింద రాష్ట్రంలో ప్రభుత్వం 5,198 మందిని రెండో ఏఎన్ఎంగా నియమించిందన్నారు. వీరి సర్వీసును క్రమబద్ధీకరించేందుకు ఎలాంటి ప్రాతిపదికలు లేవన్నారు. దీంతో క్రమబద్ధీకరణ అసాధ్యమని ప్రభుత్వం తేల్చిందని, ఈ క్రమంలో పోస్టుల లభ్యత ఆధారంగా నియామకాలు చేపడుతున్నప్పటికీ సర్వీసు ఆధారంగా గరిష్టంగా 30 శాతం మార్కులు వెయిటేజీ రూపంలో ఇస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,520 ఏఎన్ఎం ఖాళీల భర్తీకి తొలుత మెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందని, ఆ తర్వాత మరిన్ని పోస్టులు మంజూరు కావడంతో 411 పోస్టులను అదనంగా కలిపామని, దీంతో పోస్టుల సంఖ్య 1,931కి పెరిగిందని చెప్పారు. తుది నియామకం జరిగే నాటికి మరిన్ని పోస్టులు ఖాళీ అయితే వాటిని కూడా కలిపి నియామకాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీల ఆధారంగా పనిచేస్తున్న ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించడం సాధ్యం కాదని, అందుకే అర్హత పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ రెండో వారంలో ఏఎన్ఎం అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ప్రతి ఆర్నెళ్లకు రెండు పాయింట్లు..

రాష్ట్రంలో సెకండ్ ఏఎన్ఎంలుగా 2008 నుంచి నియమితులైన వారున్నారని, మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ప్రతి ఆరునెలలకు 2 పాయింట్లు ఇస్తున్నామని, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే వారికి రెండున్నర పాయింట్లు ఇస్తున్నామని శ్రీనివాసరావు చెప్పారు. గరిష్టంగా ఎనిమిది సంవత్సరాలు పనిచేసిన వారికి 30 శాతం వెయిటేజీ వస్తుందని, ఈ క్రమంలో తాజా నియామకాల ప్రక్రియలో వంద శాతం అవకాశాలు వీరికే వస్తాయని వెల్లడించారు. తాజాగా నియామకాల ప్రక్రియలో అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 49 సంవత్సరాలకు పెంచామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిని 53 సంవత్సరాలుగా ఖరారు చేశామని తెలిపారు. ఎన్‌హెచ్ఎం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైనప్పటికీ రాష్ట్రంలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలకు నెలవారీగా రూ.27,300 వేతనంగా ఇస్తున్నామన్నారు. ఏఎన్ఎంలు మొండిగా సమ్మె కొనసాగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపిన టీయూఎంహెచ్‌ఈయూ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూఎంహెచ్‌ఈయూ) ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య పార్కు వద్ద మోకాళ్ల మీద కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎంలు 20 ఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ వారిని రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కొత్త నోటిఫికేషన్ ఇచ్చి రాతపరీక్షల ద్వారా రెగ్యులర్ ఉద్యోగంలోకి రావాలనడం అన్యాయం అని వాపోయారు. వెంటనే నోటిఫికేషన్ రద్దు చేసి ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనేక శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిందని, ఆర్టీసీని కూడా ప్రభుత్వంలో విలీనం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, నాయకులు రాజేశ్వరి, లక్ష్మి, అమ్మాజీ, విజయ, ప్రణయశీల తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీట్ల కేటాయింపుపై నివేదిక ఇవ్వండి

ఈనెల 23న సీల్డ్ కవర్‌లో సమర్పించండి

- కొత్త మెడికల్ కాలేజీల్లోని సాఫ్ట్‌వేర్‌ను సవరించండి
- పాత కాలేజీల్లోనే ఏపీ విద్యార్థులకు సీట్లు వస్తే సమస్యే లేదు లేనిపక్షంలో తామే నిర్ణయం తీసుకుంటామన్న సీజే
- ధర్మాసనం మెడికల్ కాలేజీల్లో రిజర్వేషన్లపై హైకోర్టు విచారణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మొత్తం 54 మెడికల్ (ఎంబీబీఎస్, డెంటల్) కాలేజీల్లో సీట్ల కేటాయింపు, ఫలితాల ప్రకటనకు సంబంధించి పూర్తి వివరాలు తమకు సీల్డ్ కవర్‌లో అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వ విద్యాలయాన్ని హైకోర్టు ఆదేశించింది. కొత్త మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 72ను కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ కానున్నాయి. ఈ మేరకు జూలై 3న జీవో నంబర్ 72ను విడుదల చేసింది. అంతకు ముందు జాతీయ కోటా 15 శాతం పోగా.. మిగిలిన సీట్లలో 85 శాతం స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వుడ్‌గా ఉండేది. ఇందులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా పోటీ పడేవారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏపీ విద్యార్థులకు పోటీపడే అవకాశం ఉండదు. దీన్ని సవాల్ చేస్తూ ఏపీకి చెందిన గంగినేని సాయి భావనతో పాటు మరికొందరు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది.

పాత కాలేజీల్లో సీట్లు వస్తే సమస్యే లేదు..

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రిజర్వేషన్లను 10 ఏళ్ల పాటు కొనసాగించాలని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదిస్తూ.. 'రాష్ట్ర విభజన నాటికి 20 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. 2,850 సీట్లలో 15 శాతం కింద 313 సీట్లను కేటాయించాం. 2019లో నీట్ అమల్లోకి వచ్చాక.. జాతీయ కోటా కింద 540 సీట్లను రిజర్వు చేశాం. మొత్తం ఈ 853 సీట్లలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అవకాశం ఉంటుంది.' అని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్లను 15 శాతం కోటా కింద చేర్చడానికి సాఫ్ట్‌వేర్‌ను సర్దుబాటు చేయాలని వర్సిటీని ఆదేశించింది. సవరణ తర్వాత సీల్డ్ కవర్‌లో కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఒకవేళ పిటిషనర్లు పాత 20 మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించగలిగితే సమస్య ఉండదని.. లేని పక్షంలో వర్సిటీ సమర్పించే నివేదికను పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని చెబుతూ, విచారణ వాయిదా వేసింది.

ఈ-సేవ కేంద్రాన్ని ప్రజలు, న్యాయవాదులు వినియోగించుకోవాలి

హైకోర్టులో కేంద్రాన్ని ప్రారంభించిన సీజే జస్టిస్ అలోక్ అరాధే



సిబ్బందితో మాట్లాడుతున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే. చిత్రంలో న్యాయమూర్తులు జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ సుధీర్‌కుమార్, జస్టిస్ సాంబశివరావు నాయుడు, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ శరత్, జస్టిస్ రాజేశ్వర్‌రావు, జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ లక్ష్మీనారాయణ తదితరులు

సాక్షి, హైదరాబాద్: కోర్టుకు వచ్చే ప్రజలు, న్యాయవాదులు ఈ-సేవ కేంద్రం సేవలను వినియోగించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సూచించారు. అందరికీ న్యాయాన్ని చేరువ చేయడం, న్యాయ సేవలను విస్తరించాలన్న దృఢ సంకల్పంతో కేంద్రం ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కక్షిదారులు ఇక్కడ కేసు స్థితిని కూడా తెలుసుకోవచ్చని చెప్పారు. రాష్ట్ర హైకోర్టు ఆవరణలో ఈ-సేవ కేంద్రాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే శనివారం ప్రారంభించారు. సుప్రీంకోర్టు ఈ-కమిటీ ఆధ్వర్యంలో ఈ కేంద్రం పనిచేస్తుంది. ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కోర్టు నుంచి ఏదైనా సాఫ్ట్‌కాపీ కావాలన్నా ఈ కేంద్రం నుంచి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు. కాగా, కేసు స్థితి (ప్రస్తుత స్థితి, తదుపరి విచారణ తేదీ), ఈ-కోర్టు యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి జడ్జీల సెలవుల సమాచారం తెలుసుకోవడానికి, సర్టిఫైడ్ కాపీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు, ఉచిత లీగల్ సర్వీస్‌లు పొందడం వంటి వివరాలు, జైలులో ఉన్న వారిని కలిసేందుకు ఈ-ములాఖత్ అపాయింట్‌మెంట్ కోసం, కోర్టుకు సంబంధించిన అంశాల్లో ఈ-పేమెంట్స్ కోసం, ట్రాఫిక్ చలాన్లు, ఇతర నేరాల్లో చెల్లించాల్సిన నగదు చెల్లించడానికి.. ఇలా పలు రకాల సేవలను ఈ-సేవ కేంద్రం అందించనుంది.

చట్టాలపై అందరికీ అవగాహన అవసరం

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి



రాయదుర్గం: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్‌రెడ్డి పేర్కొన్నారు. మెడికవర్ ఆస్పత్రి, ఐఏఎంసీ హైదరాబాద్, సీఐఐ-ఐడబ్ల్యూఎస్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 'ఏ డికేడ్ ఆఫ్ ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎట్ వర్క్‌ప్లేస్ యాక్ట్-2023 (పీఓఎస్‌హెచ్)'పై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ-అదర్స్ వర్సెస్ రాజస్తాన్ రాష్ట్రం కేసులో వచ్చిన తీర్పు తర్వాత మాత్రమే ఈ చట్టాలు, మార్గదర్శకాలను రూపొందించారని తెలిపారు. ఈ చట్టం సానుకూల అంశం ఏమిటంటే ఇది సమానంగా సమతుల్యంగా ఉంటుందన్నారు. కొందరు బాధితులు ఉద్యోగ సమస్యలు, ప్రతికూల వాతావరణానికి భయపడి ఫిర్యాదు చేయడానికి ఇష్టపడరని, కానీ ఫిర్యాదు చేస్తేనే సమస్యలు పరిష్కారం కావడానికి ఆస్కారం ఉంటుందని జస్టిస్ విజయసేన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అదనపు డీజీపీ శిఖా గోయల్ మాట్లాడుతూ యూనిఫామ్‌లో ఉన్న మహిళలకు సురక్షితమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో పీఓఎస్‌హెచ్ ఎలా సహాయపడిందో వివరించారు. చాలా మంది మహిళలకు నిబంధనల గురించి తెలియదని, సెన్సిటైజింగ్ ప్రాముఖ్యతను వారికి తెలియజెప్పాల్సిన అవసరముందని తెలంగాణ రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ హరిచందన దాసరి అన్నారు. కార్యక్రమంలో సీఐఐ ఐడబ్ల్యూఎస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, ముంబై లీగల్ స్వాన్ వ్యవస్థాపకుడు శివంగిప్రసాద్ ప్రసంగించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్య బృందం, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ

ఇబ్రహీంపట్నం చెరువులో చేప పిల్లలను విడుదల చేయనున్న మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: ఈనెల 26 నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అదేరోజు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం చెరువులో మంత్రి ఉచిత చేప పిల్లల విడుదలను లాంఛనంగా ప్రారంభిస్తారు. శనివారం సచివాలయంలో ఉచిత చేప పిల్లల పంపిణీపై పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యాలతో తలసాని సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి విడతలో 3,939 నీటి వనరులలో 27.86 కోట్ల చేప పిల్లలను విడుదల చేస్తామని చెప్పారు. ఈ ఏడాది 26,357 నీటి వనరులలో 84.13 కోట్ల చేప పిల్లలను విడుదల చేస్తామన్నారు. అదే విధంగా మత్స్యకారులకు అదనపు ఆదాయ వనరుగా మారాలనే 300 నీటి వనరులలో రూ.25.99 కోట్లతో 10 కోట్ల రొయ్య పిల్లలను విడుదల చేస్తామన్నారు. ఈ ఉచిత చేప పిల్లల పంపిణీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో 1.98 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంతో రాష్ట్రంలో మత్స్యసంపద ఉత్పత్తి 4.24 లక్షల టన్నులకు పెరిగిందని తెలిపారు. ఉచిత చేప పిల్లలు, రొయ్య పిల్లల పంపిణీతో 3.76 లక్షల మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని తలసాని వెల్లడించారు.

ఎంపీహెచ్ఏ ఉద్యోగ నోటిఫికేషన్‌లో మార్పులు

1,520 నుంచి 1,931 పోస్టులు పెంపు.. సవరణ ప్రకటన జారీ

సాక్షి, హైదరాబాద్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మహిళ) కేటగిరీలో ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎంహెచ్ఎస్ఆర్‌బీ) గత నెలలో జారీ చేసిన నోటిఫికేషన్‌లో మార్పులు చేసింది. ఇదివరకు జారీ చేసిన పోస్టుల సంఖ్యకు అదనంగా మరిన్ని పోస్టులు జోడించడంతో పాటు వయోపరిమితి పెంపు, వెయిటేజీ మార్కుల పెంపు తదితర అంశాలతో కూడిన సవరణ ప్రకటనను శనివారం జారీచేసింది. ఈమేరకు బోర్డు సభ్య కార్యదర్శి వెల్లడించారు. ఇదివరకు జారీ చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య 1,520 కాగా.. తాజాగా వీటి సంఖ్య 1,931కు చేరింది. ప్రస్తుతం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సెకండ్ ఏఎన్ఎంలుగా పనిచేస్తున్న వారికి అర్హత పరీక్ష గరిష్ట మార్కులు 100 కాగా.. ఇందులో సీనియార్టీ ఆధారంగా 30 మార్కులు గరిష్ట వెయిటేజీ ఇవ్వనున్నారు. 70 మార్కులు రాత పరీక్ష ద్వారా కేటాయిస్తారు.

వెయిటేజీ మార్కులను ప్రతిఆర్నెల్లకోసారి పరిగణనలోకి తీసుకుంటారు. ఏజెన్సీ ప్రాంత ఉద్యోగులకు 2.5 శాతం, మైదాన ప్రాంతాల్లో 2 శాతం చొప్పున లెక్కిస్తారు. జనరల్ కేటగిరీ వయోపరిమితిని 44 నుంచి 49 సంవత్సరాలకు పెంచారు. పరీక్షను ఇంగ్లిష్/తెలుగు మాధ్యమంలో నిర్వహించనున్నట్లు సవరణ ప్రకటనలో స్పష్టం చేశారు.

మేనేజ్‌మెంట్ సీట్లలో 'స్థానికత'పై వివరణివ్వండి

కాళోజీ వర్సిటీకి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో వైద్య, దంత వైద్య కోర్సుల్లోని మేనేజ్‌మెంట్ సీట్లకు 'స్థానిక'రిజర్వేషన్ ఇవ్వడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ కాళోజీ నారాయణరావు వర్సిటీకి నోటీసులు జారీ చేసింది. బీ-కేటగిరీ కింద ఎంబీబీఎస్ సీటు కోసం సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడానికి అనుమతి ఇవ్వడం, ఆగస్టు 15న అందజేసిన వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ వికారాబాద్‌కు చెందిన సౌమ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. మేనేజ్‌మెంట్ సీట్లలో 10 శాతం రిజర్వేషన్ కల్పించకపోవడం చట్ట విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. రాష్ట్రంలోని కళాశాలలన్నీ మొత్తం సీట్లలో 50 శాతం ప్రభుత్వానికి కేటాయిస్తాయని, వీటిని కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తుందని వర్సిటీ తరపు న్యాయవాది ప్రభాకర్ రావు వివరించారు. మిగిలిన 50 శాతంలో 15 శాతం ఎన్ఆర్ఐలు, 25 శాతం మేనేజ్‌మెంట్‌కు, 10 శాతం ఇతర రిజర్వేషన్లు ఉంటాయన్నారు. వాదనలను విన్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. మరోవైపు తెలంగాణకు చెందిన పలువురు విద్యార్థులు తమ స్థానికతను పరిగణనలోకి తీసుకోవడం లేదంటూ హైకోర్టులో పిటిషన్లు వేశారు. స్థానికత అర్హత ఉన్నా తమ ప్రవేశాలను తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం స్థానికత వర్తించాలంటే కనీసం ఏడేళ్లు తెలంగాణలో చదివినవారై ఉండాలి. దీనిపై సోమవారం వాదనలు జరగనున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.